www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 6-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 51 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: ఏకాదశి తె.4:48 తదుపరి ద్వాదశి, నక్షత్రం: హస్త ఉ.6:34 తదుపరి చిత్త, వర్జ్యం: మ.3:36-5:24, దుర్ముహూర్తం:ఉ.8:19-9:11, మ.12:39-1:31, అమృతఘడియలు: రా.2:26-4:14, రాహుకాలం: ఉ.10:30-12:00 సూర్యోదయం: 5:43, సూర్యాస్తమయం: 6:44 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆర్సీబీపై కేసు

తొక్కిసలాటపై సుమోటోగా పోలీసుల చర్య

ఏ దేశం కోసం ఆడారని సన్మానించారు?

సర్కారును తప్పుబట్టిన కర్ణాటక హైకోర్టు

2చోట్ల సంబరాలెందుకంటూ మండిపాటు

బెంగళూరు పోలీస్ కమిషనర్ సస్పెన్షన్ 2

ఏసీపీ, డీసీపీలపైనా వేటు వేసిన సర్కారు

ప్రతి ఒక్కరూ పది మొక్కలు

నాటండి

చెట్లు నరకడం దుర్మార్గం

గత ప్రభుత్వం ఐదేళ్లూ అదే పనిచేసింది: ముఖ్యమంత్రి

నాటి సీఎం హెలికాప్టర్లో వెళ్తున్నా కింద ఉన్న చెట్లు నరికేవారు

కొన్ని దేశాల్లో హత్యానేరంతో సమానం

వాటిని పెంచని వారు స్వచ్ఛమైన గాలిని ఆశించడం సమంజసమా?

ఇక రాష్ట్రంలో గ్రీన్, సర్క్యులర్ ఎకానమీ

2029 నాటికి 37% పచ్చదనం లక్ష్యం

సీడ్ రాఖీతో ఆడబిడ్డలు పర్యావరణానికి దోహదపడాలి

పర్యావరణ దినోత్సవాన బాబు పిలుపు

చెట్లే మనిషికి ఆధారం.. ఆనవాళ్లు: పవన్

అమరావతిలోని అనంతవరంలో మొక్కలు నాటిన సీఎం, డిప్యూటీ సీఎం

వచ్చే అక్టోబరు 2 నాటికి 17 కార్పొరేషన్లు, వచ్చే ఏడాది జూన్ 5 నాటికి మొత్తం రాష్ట్రాన్ని సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ రహితంగా మారుస్తాం. 175 నియోజకవర్గాల్లోనూ నగర వనాలు ఏర్పాటు చేస్తాం.
- సీఎం చంద్రబాబు

ఈ ఏడాది కోటి మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకుంటా. వచ్చే వన మహోత్సవంలో ఆ అనుభవాలు పంచుకుంటా.
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్


అనంతవరంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

గుంటూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): 'చెట్లు పెంచడం బాధ్యత.. వాటిని నరకడం దుర్మార్గం. దురదృష్టం కొద్దీ గత ఐదేళ్లూ చెట్లు నరకడం తప్ప నాటడం తెలియని ప్రభుత్వం ఉంది. అప్పటి సీఎం పైన హెలికాప్టర్లో వెళ్తుంటే కింద చెట్లు నరికేసేవారు. అలా చేస్తే కొన్ని దేశాల్లో జైలుకు పంపుతారు. మనిషిని చంపినట్లుగానే ఆ దేశాల్లో భావిస్తారు. అంత కఠినంగా శిక్షిస్తారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చెట్లను పెంచడం

మిగతా 13వ పేజీలో...



అది అసలు నెయ్యే కాదు

వైసీపీ హయాంలో టీటీడీకి కల్తీ సరుకు సరఫరా

పామాయిల్, కెమికల్స్, ఇతర ముడిపదార్థాలతో తయారీ

సరఫరాలో బోలే బాబా డెయిరీది కీలక పాత్ర: సిట్

ఏఆర్ డెయిరీని ముందుంచి తెరవెనుక వ్యవహారం

బెయిల్ పిటిషన్లు కొట్టివేయండి

హైకోర్టులో సీబీఐ స్టాండింగ్ కౌన్సిల్ వాదనలు

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా వెనుక బోలే బాబా డెయిరీది కీలకపాత్ర అని, టీటీడీకి సరఫరా చేసింది అసలు నెయ్యే కాదని హైకోర్టుకు సిట్ నివేదించింది. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఏఆర్ డెయిరీ ఎండీ రాజురాజశేఖరన్(ఏ2), బోలే బాబా డెయిరీ

మిగతా 13వ పేజీలో...


'సాక్షి' వైసీపీ సొంత పత్రిక అనేది బహిరంగ రహస్యమే! ఇప్పుడు ఆ ముసుగును పూర్తిగా తొలగించేశారు. రాజకీయ లబ్ధి, వ్యాపార వృద్ధికోసం పార్టీ నేతలు, పత్రిక ప్రతినిధులు 'కలిసి కట్టు'గా పని చేయాలని జగన్ ఆదేశించారు.

అధికారంలో ఉండగా... రోత పత్రిక సర్క్యులేషన్ పెంచుకోవడానికి వలంటీర్లను, ఐప్యాక్ వ్యూహాలనూ వాడుకున్నారు. ఇప్పుడు అధికారంలేదు. వలంటీర్లూ లేరు. దీంతో... పార్టీ నేతలకే ఆ బాధ్యత అప్పగించేశారు!

కలిసికట్టుగా, బురద జల్లుదాం!

ఒక పత్రిక ప్రతినిధులు, అదే పత్రిక 'యజమాని' అధ్యక్షతన నడిచే పార్టీ నేతలు కలిసి కూర్చుని చర్చించుకున్నారు. ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా సమన్వయంతో పని చేయాలని తీర్మానించుకున్నారు.

ముసుగు తొలగించిన 'వైసీపీ పత్రిక'
పార్టీ నేతలతో సమన్వయ భేటీలు



ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే లక్ష్యం

సాక్షి పత్రికలో ఏది పడితే అది రాసేయాలి

చిన్న సమస్యనూ పెద్దగా చూపించాలి

ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరించాలి

పరస్పరం సమాచారం పంచుకోవాలి

రోత పత్రికలో వార్తలు రాగానే..

వైసీపీ పరంగా రాజకీయ ఆందోళనలు

జగన్ ఆదేశాల మేరకు ఉమ్మడి భేటీలు

తిరుపతిలో జరిగిన తొలి సమావేశం

భూమన, చెవిరెడ్డి, రోజా సహా పలువురు నేతలు హాజరు

'సమస్య చిన్నదైనా సరే... భూతద్దంలో చూపించాలి! దానిని సర్కారు దృష్టికి తీసుకెళ్లినట్లు కాకుండా... పాలకుల వైఫల్యంగా చిత్రీకరించాలి. ప్రభుత్వాన్ని బద్నాం చేయాలి'... ఇదీ జగన్ రోత పత్రిక, ఆయన పార్టీ ఉమ్మడి వ్యూహం! సర్క్యులేషన్ పెంచుకోవడంతో పాటు... కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడేలా తీర్మానం! జిల్లాలు, ప్రాంతాల వారీగా 'పార్టీ-పత్రిక' సమావేశాలు పెట్టి మరీ కార్యాచరణకు నిర్దేశం! అధికారంలో ఉండగా... సొంత మీడియాకు ప్రభుత్వ ధనాన్ని దోచిపెట్టారు! అధికారం పోగానే... ప్రభుత్వంపై బురదజల్లడమే 'పార్టీ పత్రిక' లక్ష్యంగా మార్చారు!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"పార్టీ వేరు, పత్రిక వేరూ కాదు! అందరం కలిసి పని చేయాలి. ప్రభుత్వం గురించి ఏ చిన్న సమాచారం వచ్చినా మన మీడియా ప్రతినిధులు పార్టీ నేతలకు చెప్పాలి. అలాగే... ప్రభుత్వం వైపు నుంచి ఏ తప్పు దొరికినా పార్టీ నేతలు సాక్షి ప్రతినిధులకు చెప్పాలి. దేనినీ వదలొద్దు. ఏది దొరికితే అది కుమ్మేయాలి. ప్రభుత్వాన్ని ఎండగట్టాలి"... ఇదీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన రోత మీడియా

మిగతా 13వ పేజీలో...

రాఫెల్ యుద్ధవిమానాల ఫ్యూస్‌లాజ్ తయారీ..

హైదరాబాద్‌లో...

న్యూఢిల్లీ, జూన్ 5: రాఫెల్ యుద్ధవిమానాలకు అవసరమైన ఫ్యూస్‌లాజ్‌ను ఇకపై భారత్‌లోనే తయారు చేయనున్నారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) సంస్థ ఈ ఫ్యూస్‌లాజ్‌ను తయారు చేయనుంది. ఈ మేరకు ఫ్రాన్స్‌కు చెందిన రాఫెల్ విమానాల తయారీ సంస్థ దసో ఏవియేషన్‌తో టీఏఎస్ఎల్ నాలుగు ఒప్పందాలు కుదుర్చుకుంది. అత్యాధునికమైన ఫ్యూస్‌లాజ్ తయారీ కేంద్రాన్ని టీఏఎస్ఎల్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. నౌకాదళానికి రాఫెల్ మెరైన్ జెట్లు అందజేయడానికి భారత ప్రభుత్వం ఫ్రాన్స్‌తో ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.64 వేల కోట్ల ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. దాని ప్రకారం రాఫెల్ జెట్ల బాడీ ఉత్పత్తికి ఒక కేంద్రాన్ని భారత్‌లో ఏర్పాటు చేయాల్సి ఉంది. దాన్నే హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రంలో రాఫెల్ యుద్ధ విమానాలకు అవసరమైన ఫ్యూస్‌లాజ్ సహా కీలక సామగ్రిని తయారు చేస్తారు. విమానానికి ఫ్యూస్‌లాజ్ అత్యంత కీలకమైన భాగం. ఇది సిలిండర్ ఆకారంలో ఉంటుంది. విమానాల వినియోగాన్ని బట్టి ఫ్యూస్‌లాజ్‌ను డిజైన్ చేస్తారు. 2028 ఆర్థిక సంవత్సరానికల్లా ఫ్యూస్‌లాజ్ తయారీని

మిగతా 2వ పేజీలో...



టాటా సంస్థతో దసో ఒప్పందం

తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేయనున్న టీఏఎస్ఎల్

నెలకు రెండు ఫ్యూస్‌లాజ్‌ల తయారీ లక్ష్యం

తొలిసారిగా ఫ్రాన్స్ వెలుపల ఉత్పత్తి!

ఫైటరాబాద్!

యుద్ధవిమానాల తయారీలో కీలకంగా హైదరాబాద్


సుధాకర్ మృతదేహం

మావోయిస్టు అగ్రనేత సుధాకర్

ఎన్‌కౌంటర్

బీజాపూర్‌లోని నేషనల్ పార్క్ ప్రాంతంలో కాల్చివేత

తప్పించుకున్న అగ్రనేతలు బండి ప్రకాశ్, పాపారావు?

దళపతి నంబాలను కోల్పోయిన నక్సల్స్‌కు మరో పెద్ద దెబ్బ

కేంద్రకమిటీ సభ్యుడు.. పొలిటికల్ స్కూలు ఇన్‌చార్జి

2004లో రామకృష్ణతోపాటు శాంతి చర్చలకు వచ్చిన నేత

స్వస్థలం ఏలూరు జిల్లా సత్యవోలు

బెజవాడలో ఆయుర్వేద విద్య అభ్యసిస్తూ పోరులోకి..

తలపై రూ.కోటికిపైగా రివార్డు


సుధాకర్ ఫైల్ ఫొటో

చింతూరు, ఏలూరు, చర్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): దళపతిని కోల్పోయి అసలే కష్టాల్లో పడిపోయిన మావోయిస్టు పార్టీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో గురువారం జరిగిన ఎన్‌కౌంటరులో మరో అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు లక్ష్మీ నరసింహాచలం అలియాస్ సుధాకర్ అలియాస్ గౌతమ్ (65) మృతి చెందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంతో 2004లో మావోయిస్టు పార్టీ జరిపిన చర్చల్లో ప్రతినిధిగా సుధాకర్ పాల్గొన్నారు. ఆ చర్చల అనంతరం దండకారణ్యం చేరుకుని అక్కడే తన కార్యకలాపాలు సాగిస్తున్నారు. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో సుధాకర్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు పాపారావు, ఇతర ముఖ్య నేతలు సంచరిస్తున్నారన్న సమాచారంతో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా దళాలు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో

మిగతా 12వ పేజీలో...



1,000 డాలర్లు చెల్లిస్తే..
నిరీక్షణ అక్కర్లేదు

యూఎస్ వీసా ఇంటర్వ్యూకు కొత్తగా ప్రీమియం సేవలు 2

డిసెంబరు నుంచి అమలుచేసే యోచనలో ట్రంప్ సర్కారు

తిరుపతి చేరిన 'లిక్కర్' లింకులు

రెండు రోజులు సిట్ అధికారుల విచారణ 13

చంద్రగిరి, తిరుపతిలో సమాచార సేకరణ

అరెస్టు చేయాలనుకుంటే నేనే వస్తా: చెవిరెడ్డి



ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్‌గా మహేంద్రదేవ్

ఏపీకి చెందిన ఆర్థికవేత్తకు ప్రతిష్ఠాత్మక పదవి 13

నేడు బాధ్యతలు స్వీకరించే అవకాశం

రాష్ట్రంలో మరో 11 కొవిడ్ కేసులు



నెల్లూరులో 6, కర్నూలులో 4, విశాఖలో 1 14

కోస్తా భగభగ

నరసాపురంలో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రత

ఉక్కపోత, వడగాడ్పులతో జనం విలవిల 14

నాలాంటి వేల మంది విద్యార్థుల

మనోగతమే వినిపించా

గాజాలో జరుగుతున్నది నరమేధం

మానవత్వమున్న వారెవరూ సమర్థించరు

పాలస్తీనా వాసులకు మద్దతుగా కార్యక్రమాలు చేపట్టాం

క్లాస్ ప్రెసిడెంటుగా స్నాతకోత్సవం రోజు కావాలనే ఈ అంశం లేవనెత్తా

అనంతరం నాకు ఎలాంటి బెదిరింపులూ ఎదురుకాలేదు

వర్సిటీ నుంచి బహిష్కరించలేదు

డిగ్రీని పోస్టులో పంపుతామన్నారు

యువత బాధితులకు గొంతు అవ్వాలి

'ఆంధ్రజ్యోతి'తో మేఘా వేమూరి

అమెరికాలో పాలస్తీనాకు మద్దతుగా గళం వినిపించిన ఎంఐటీ విద్యార్థిని

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



పాలస్తీనాకు మద్దతుగా గళమెత్తుతున్న వారిపై అమెరికా ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగుతోంది. సోషల్ మీడియా వెట్టింగ్ పేరిట సామాజిక మాధ్యమాల ఖాతాలను జల్లెడ పడుతూ పాలస్తీనా మద్దతుదారులను హడలెత్తిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాలోని ఓ తెలుగు కుటుంబానికి చెందిన మేఘా వేమూరి పెను సాహసం చేసింది. తాను విద్య అభ్యసించిన అమెరికాలోని

మిగతా 2వ పేజీలో...


నూతన జీఎం సందీప్ మాథుర్

విశాఖ జోన్‌పై ముందడుగు

దక్షిణ కోస్తా జోన్ జీఎంగా సందీప్ మాథుర్

రైల్వే బోర్డు నియామక ఉత్తర్వులు

త్వరలో విశాఖలో నూతన బాధ్యతలు

ఆ వెంటనే జోన్ డీపీఆర్ పరిశీలన


తాత్కాలిక భవనాల ఎంపిక, కావలసిన సిబ్బందిపై నివేదిక.. కేంద్రం గెజిట్!

ఆదేశాలివ్వగానే పరిపాలన ప్రారంభం

విజయవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యరూపం దిశగా ముందడుగు పడింది. విశాఖ కేంద్రంగా నూతన రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్ (జీఎం)గా సీనియర్ అధికారి సందీప్ మాథుర్‌ను నియమిస్తూ గురువారం రైల్వేబోర్డు ఉత్తర్వులు జారీచేసింది. ఇండియన్ రైల్వే సర్వీస్ సిగ్నల్

మిగతా 14వ పేజీలో...

జాబ్ గ్యారెంటీకి
'యాడ్ ఆన్' నైపుణ్యం



కచ్చితంగా ఉద్యోగం వచ్చేలా డిప్లొమా విద్యార్థులకు అదనపు కోర్సులు

పది సెక్టార్లలో 24 రకాలు అందుబాటులోకి

అందుకోసం ప్రత్యేకంగా సిలబస్

ప్రాంతాలు, పరిశ్రమలకు తగ్గట్టుగా కోర్సులు

అదనంగా సర్టిఫికెట్ జారీకి ప్రణాళిక

సాంకేతిక విద్యా శాఖ నూతన విధానం

ఈ విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో అమల్లోకి

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

త్వరగా ఉద్యోగాలు సాధించాలన్న లక్ష్యంతో విద్యార్థులు పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో చేరుతుంటారు. అలాంటి వారికి అదనపు నైపుణ్యాలను అందించే దిశగా సాంకేతిక విద్యా శాఖ కొత్త విధానం అమల్లోకి తీసుకొచ్చింది. యాడాన్ కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చి, సాధారణంగా ఇచ్చే డిప్లొమా సర్టిఫికెట్‌తో పాటు మరో సర్టిఫికెట్ కూడా జారీ చేయనుంది. నాలుగో సెమిస్టర్‌లో యాడ్ ఆన్ కోర్సును పూర్తిచేసిన వెంటనే

మిగతా 3వ పేజీలో...

నేటి నుంచే మెగా డీఎస్సీ

30 వరకు రోజూ 2 సెషన్లలో పరీక్షలు

గంటన్నర ముందే కేంద్రాల్లోకి అనుమతి

హాల్ టికెట్, ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరి.. పెన్నులకు అనుమతి

పేపర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం 14

ట్రంప్ వల్లే యుద్ధం ఆగింది!



- ట్రంప్‌తో పుతిన్ ఫోన్ చర్చల్లో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది
- పుతిన్ సీనియర్ సలహాదారు యూరీ ఉషకోవ్ వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 5: భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యక్తిగత చొరవతోనే ఆగిందని రష్యా పేర్కొంది. డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ బుధవారం ఫోన్‌లో జరిపిన చర్చల్లో ఈ అంశం ప్రస్తావనకు వచ్చినట్టు తెలిపింది. అయితే భారత్, పాకిస్థాన్ యుద్ధానికి సంబంధించి ఏమేం చర్చించారనేది మాత్రం పేర్కొనలేదు. ట్రంప్, పుతిన్‌ల ఫోన్ చర్చలకు సంబంధించిన వివరాలను పుతిన్ సీనియర్ సలహాదారు యూరీ ఉషకోవ్ వెల్లడించారు. "ఇరువురు నేతలు మధ్య ప్రాచ్య ప్రాంతంలో పరిస్థితులతో పాటు భారత్, పాక్ మధ్య పరస్పర దాడుల అంశంపైనా చర్చించారు. ట్రంప్ వ్యక్తిగత జోక్యంతో భారత్, పాక్ మధ్య యుద్ధం నిలిచింది.." అని పేర్కొన్నారు. తన ఒత్తిడి వల్లే భారత్, పాక్ కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చాయని, ఇరు దేశాల మధ్య అణు యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ పలుమార్లు ప్రకటించారు. వాటిని భారత్ ఖండించింది. కాల్పుల విరమణకు పాక్ ప్రతిపాదన చేయడంతో భారత్ అంగీకరించిందని.. ఇందులో మూడో దేశం జోక్యానికి తావులేదని స్పష్టం చేసింది.

పుతిన్ సాయం కోరిన పాక్.. భారత్‌కే మద్దతు!

భారత్‌తో ఉద్రిక్తతల విషయంలో జోక్యం చేసుకోవాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను పాకిస్థాన్ కోరింది. ఈ మేరకు పుతిన్‌కు పాక్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ రాసిన లేఖను ఆయన ప్రతినిధి సయ్యద్ తారీఖ్ ఫతేమి తాజాగా రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌కు అందజేశారు. పుతిన్ తన పలుకుబడిని ఉపయోగించుకుని.. పాకిస్థాన్‌తో భారత్ చర్చలు జరిపి దౌత్యపరమైన పరిష్కారానికి వచ్చేలా ఒత్తిడి చేయాలని కోరారు. అయితే రష్యాలో ఇటీవలే పర్యటించిన డీఎంకే ఎంపీ కనిమొళి నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం.. పాక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న తీరును వివరించింది. భారత్‌కు రష్యా పూర్తి మద్దతును కూడా సాధించింది.


మూడో దేశం జోక్యమేం లేదు



- భారత్‌కు ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు
- రాహుల్ చేసిన 'నరేందర్.. సరెండర్' వ్యాఖ్యలను పరోక్షంగా తోసిపుచ్చిన శశిథరూర్

న్యూఢిల్లీ, జూన్ 5: పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి ప్రధాని నరేంద్ర మోదీ లొంగిపోయారంటూ.. 'నరేందర్.. సరెండర్' అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆ పార్టీ ఎంపీ శశిథరూర్ పరోక్షంగా తోసిపుచ్చారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ అంశంలో మూడో దేశం జోక్యమేదీ లేదని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పాక్ ప్రోత్సహిస్తున్న తీరు, దానికి ప్రతిగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అంశాలను వివరించేందుకు అమెరికాలో పర్యటిస్తున్న భారత అఖిలపక్ష బృందానికి శశిథరూర్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా వాషింగ్టన్‌లో మీడియాతో మాట్లాడారు. భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ ట్రంప్ చేస్తున్న ప్రకటనలు, మోదీ లొంగిపోయారంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా.. "దాడులు ఆపాలని భారత్‌కు ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పాక్ ఆపితే మేం ఆపడానికి సిద్ధంగా ఉన్నామని మేం ముందే స్పష్టం చేశాం. ఒకవేళ వారు (ట్రంప్).. భారత్ దాడులు నిలిపేయడానికి సిద్ధంగా ఉందని, తొలుత మీరు ఆపాలని పాక్‌కు చెప్పి ఉంటే.. అదే వారు చేసిన గొప్ప పని.." అని శశిథరూర్ పేర్కొన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని వీడకపోతే.. తామేంటో చూపించడానికి భారత్ సిద్ధంగా ఉందని, ఇక్కడ మూడో వ్యక్తి అవసరమేమీ లేదన్నారు. కాగా, భారత ప్రతినిధి బృందంలోని మరో సభ్యుడు, ఎంపీ మిలింద్ దేవరా మాట్లాడుతూ.. 'శశిథరూర్‌కు తన పార్టీ కంటే దేశమే ఎక్కువ' అని పేర్కొన్నారు.

లోకం తీరు



రాఫెల్ యుద్ధవిమానాల ఫ్యూస్‌లాజ్ తయారీ.. హైదరాబాద్‌లో..

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లో ప్రారంభించనున్నారు. నెలకు రెండు ఫ్యూస్‌లాజ్‌ను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాఫెల్ యుద్ధ విమానాలకు అవసరమైన ఈ ఫ్యూస్‌లాజ్‌లను ఫ్రాన్స్ వెలుపల తయారు చేయనుండడం ఇదే తొలిసారి. ఇది రక్షణ ఉత్పత్తుల తయారీలో 'మేకిన్ ఇండియా'కు ఊతమిచ్చే ప్రాజెక్టు అని నిపుణులు పేర్కొంటున్నారు.

మరింత వేగంగా 'రాఫెల్' సరఫరా

భారత్‌లో తమ సరఫరా ప్రక్రియను బలోపేతం చేయడానికే ఈ నిర్ణయాత్మక అడుగు వేసినట్లు దసో ఏవియేషన్ చైర్మన్ ఎరిక్ ట్రాపియర్ చెప్పారు. తమతో కలిసి పనిచేస్తున్న టీఏఎస్ఎల్‌కు కృతజ్ఞతలు చెప్పారు. భారత ఏరోస్పేస్ పరిశ్రమలో టీఏఎస్ఎల్ ప్రధాన సంస్థగా ఉందన్నారు. రాఫెల్ యుద్ధ విమానాలను మరింత వేగంగా సరఫరా చేయడానికి ఈ భాగస్వామ్యం ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. భారత ఏరోస్పేస్ రంగంలో దసోతో తమ భాగస్వామ్యం కీలక అడుగు అని టీఏఎస్ఎల్ సీఈవో, ఎండీ సుకరణ్ సింగ్ చెప్పారు. టీఏఎస్ఎల్ సామర్థ్యాలపై నమ్మకం ఉండబట్టే దసో ఏవియేషన్ రాఫెల్ ఫ్యూస్‌లాజ్ తయారీ బాధ్యతలను అప్పగించిందని ఆయన తెలిపారు.

మోదీ నివాసంలో 'సిందూర్ మొక్క'

- ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా నాటిన ప్రధాని



న్యూఢిల్లీ, జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా గురువారం ప్రధాని మోదీ తన అధికార నివాస ప్రాంగణంలో సిందూర్ మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఎక్స్‌లో మోదీ స్పందిస్తూ.. దేశంలోని మహిళల స్ఫూర్తికి, పరాక్రమానికి ఈ మొక్క గుర్తుగా ఉంటుందని పేర్కొన్నారు. ఇటీవల తాను గుజరాత్‌లోని కచ్‌కు వెళ్లినపుడు 1971 యుద్ధ సమయంలో అత్యంత ధైర్యం ప్రదర్శించిన మహిళల బృందం తనకు ఈ మొక్కను బహూకరించిందని చెప్పారు. ఢిల్లీలోని 7, లోక్‌కళ్యాణ్ మార్గ్ నివాసంలో ఆ మొక్కను నాటుతానని అప్పుడే వాళ్లకు మాట ఇచ్చానన్నారు. కాగా, ప్రపంచ పర్యావరణాన్ని కాపాడటానికి ప్రతి దేశం స్వప్రయోజనాలు పక్కనబెట్టి ముందుకు రావాలని ఓ వీడియో సందేశంలో ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ బ్రిడ్జి నేడు ప్రారంభం

దేశ రైల్వే చరిత్రలో శుక్రవారం నూతన ఘట్టం ఆరంభం కానుంది. జమ్మూ-కశ్మీర్‌లో చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే ఎత్తైన వంతెనను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. చినాబ్ నదిపై 359 మీటర్ల ఎత్తులో నిర్మించిన ఈ ఉక్కు వంతెన ఈఫిల్ టవర్‌ను మించిపోయింది. భూకంప ప్రభావం, వేగంగా వీచే గాలులతో ముప్పు ఉన్నప్పటికీ అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ ఇంజినీరింగ్ అద్భుతాన్ని సృష్టించారు. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్టులో భాగంగా దీన్ని నిర్మించారు. ఇందులో భాగంగానే నిర్మించిన అంజి బ్రిడ్జిని కూడా ప్రధాని ప్రారంభించనున్నారు. ఇదే సందర్భంగా శ్రీ మాతా వైష్ణో దేవి కాట్రా-శ్రీనగర్‌ల మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు కూడా పచ్చజెండా ఊపనున్నారు. కాట్రాలో రూ.46వేల కోట్లు విలువ చేసే ప్రాజెక్టులను కూడా ప్రధాని ప్రారంభించనున్నారు.

ఫైటరాబాద్!



యుద్ధవిమానాల తయారీలో కీలకంగా హైదరాబాద్

తేజస్ ఎంకే1ఏ సెంట్రల్ ఫ్యూస్‌లాజ్ తయారీ ఇక్కడే

రాఫెల్ ఫ్యూస్‌లాజ్ తయారీ యూనిట్ భాగ్యనగరంలోనే

హైదరాబాద్, జూన్ 5: దేశ రక్షణలో అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించే యుద్ధ విమానాల తయారీలో హైదరాబాద్ కీలక హబ్‌గా మారుతోంది. ఒక్క యుద్ధ విమానాలే కాదు.. డ్రోన్ల నుంచి క్షిపణులు, ఉపగ్రహాల దాకా తయారు చేసే 20కి పైగా ఏరోస్పేస్ కంపెనీలు మన రాజధాని నగరంలో ఉన్నాయి!! తాజాగా రాఫెల్ యుద్ధవిమానాల ఫ్యూస్‌లాజ్ (విమానం ప్రధాన/మధ్య భాగం) తయారీకి సంబంధించి దసో ఏవియేషన్‌తో ఒప్పందం కుదుర్చుకున్న టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్.. ఆ తయారీ యూనిట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుండడంతో భాగ్యనగర కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరినట్టయింది. రక్షణ రంగంలో స్వావలంబన (ఆత్మనిర్భర్ భారత్) దిశగా ఇప్పటికే హైదరాబాద్‌కు చెందిన వెమ్ టెక్నాలజీస్ సంస్థ.. 'తేజస్ ఎంకే1ఏ' యుద్ధవిమానాల సెంట్రల్ ఫ్యూస్‌లాజ్‌ను ఇక్కడ అసెంబుల్ చేసి హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)కు అందజేసిన సంగతి తెలిసిందే. దేశీ పరిజ్ఞానంతో రూపొందిస్తున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధవిమానం ఆమ్కా (అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) అభివృద్ధిలో సైతం వెమ్ టెక్నాలజీస్ కీలకపాత్ర పోషిస్తోంది. ఆ విమానం 'ఎండ్-టు-ఎండ్ మాడ్యూల్స్' తయారీలో, ఎయిర్‌క్రాఫ్ట్ అసెంబ్లింగ్‌లో పాలుపంచుకుంటోంది. యుద్ధవిమానాల ఫ్యూస్‌లాజ్‌ల తయారీ మాత్రమే కాక.. ఫైటర్ జెట్లకు అవసరమైన జనరేటర్లు, రక్షణ శాఖ హెలికాప్టర్లు, యుద్ధవిమానాల్లోని ఆన్-బోర్డ్ సిస్టమ్స్ తయారీలోనూ వెమ్ టెక్నాలజీస్ కీలకపాత్ర పోషిస్తోంది. ఇక.. హైదరాబాద్‌లోని 'టాటా, లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ఎంఏఎల్)'లో ఎఫ్21 ఫైటర్ జెట్ వింగ్స్ తయారీకి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు 2023 మేలో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇదే టీఎల్ఎంఏఎల్.. సీ-130జే రవాణా విమానాల ఎంపెన్నేజ్ అసెంబ్లీస్‌ను (విమానంలో తోకభాగంలో ఉండే రడ్డర్, ఎలివేటర్స్, వర్టికల్, హారిజాంటల్ స్టెబిలైజర్లు- ఇవన్నీ కలిసి చుక్కానిలా పనిచేస్తాయి) ప్రపంచం మొత్తానికీ సరఫరా చేస్తోంది. హైదరాబాద్‌లోని టీఎల్ఎంఏఎల్‌లో ఇప్పటి దాకా 220కిపైగా ఎంపెన్నేజ్ అసెంబ్లీ యూనిట్లు తయారయ్యాయి. ఇక.. ప్రపంచంలోనే అతిపెద్ద ఏరోస్పేస్ కంపెనీ, అమెరికాకు చెందిన బోయింగ్‌తో కలిసి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (టీబీఏఎల్)'.. ఏహెచ్-64 అపాచీఅటాక్ హెలికాప్టర్ల ఫ్యూస్‌లాజ్‌ను తయారుచేస్తోంది. టీబీఏఎల్ ఇప్పటికే 300కు పైగాఅపాచీ హెలికాప్టర్ల ఫ్యూస్‌లాజ్‌ను సరఫరా చేయడం విశేషం.

ఇక్కడ తయారవుతున్నాయిగానీ..

తేజస్ ఎంకే1ఏ యుద్ధవిమానాలకు అవసరమైన సెంట్రల్ ఫ్యూస్‌లాజ్‌ను ఇక్కడ తయారుచేసి బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు అందిస్తున్నా.. విదేశీ ఇంజన్లు రాకపోవడంతో వాటి ఉత్పత్తి ఆలస్యమవుతోంది. ఈ విమానాలకు కావాల్సిన 99 ఎఫ్404 ఇంజన్ల కోసం హాల్ 2021లోనే జీఈ సంస్థకు ఆర్డర్ ఇచ్చింది. ఒప్పందం ప్రకారం ఏటా కొన్ని ఇంజన్లు సరఫరా చేయాల్సిన జీఈ.. ఈ ఏడాది ఫిబ్రవరి దాకా ఒక్క ఇంజన్‌ను కూడా పంపలేదు. ఎట్టకేలకు మార్చిలో ఒక్క ఇంజన్‌ను మాత్రం పంపింది. దీనివల్లే తేజస్ ఎంకే1ఏ విమానాల తయారీ నత్తనడకన సాగుతోంది. అలాగే.. మన రక్షణ శాఖ ఆర్మీ కోసం ఆరు అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు బోయింగ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇక్కడి నుంచి అపాచీ ఫ్యూస్‌లాజ్‌లు సమయానికి సరఫరా అవుతున్నా.. ఆ సంస్థ మాత్రం మనకు ఇప్పటిదాకా వాటిని సరఫరా చేయకపోవడం గమనార్హం.

మెరైన్ వన్ క్యాబిన్ కూడా ఇక్కడే!

అమెరికా అధ్యక్షుడు వాడే హెలికాప్టర్‌ను మెరైన్ వన్ అంటారు. ఆ హెలికాప్టర్ 'సికోర్స్కీ ఎస్92' రకానికి చెందినది. ఆ తరహా హెలికాప్టర్ల క్యాబిన్లను తయారుచేసేది ఎవరో తెలుసా? హైదరాబాద్‌లోని 'టాటా సికోర్స్కీ ఏరోస్పేస్ లిమిటెడ్'. 2009లో టాటా, సికోర్స్కీ సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు.. 2013 నుంచి ఎస్-92 హెలికాప్టర్ల క్యాబిన్లను హైదరాబాద్‌లో తయారుచేస్తున్నారు. క్యాబిన్ల అసెంబ్లింగ్ మాత్రమే కాదు.. అందుకు అవసరమయ్యే 5000 ప్రెసిషన్ విడిభాగాలను సైతం ఇక్కడే తయారుచేస్తున్నారు. అనంతరం ఈ క్యాబిన్లను అమెరికాకు పంపిస్తారు. అక్కడ ఫైనల్ అసెంబ్లింగ్ పూర్తిచేసి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కస్టమర్లకు వాటిని సరఫరా చేస్తారు. హైదరాబాద్‌లో ఉన్న టీఎస్ఏఎల్‌కు నెలకు నాలుగు ఎస్92 క్యాబిన్లను తయారుచేసే సామర్థ్యం ఉంది. సికోర్స్కీ సంస్థ అంతర్జాతీయ సరఫరా చైన్‌లో ఈ యూనిట్ అత్యంత కీలకపాత్ర పోషిస్తోంది.

ఆర్సీబీపై కేసు

- తొక్కిసలాట ఘటన నేపథ్యంలో సుమోటోగా నమోదుచేసిన పోలీసులు

బెంగళూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద 11 మందిని బలిగొన్న తొక్కిసలాట ఘటనలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్లపై కేసు నమోదైంది. ఈ ఘటనపై బెంగళూరు పోలీసులు సుమోటోగా ఫిర్యాదును నమోదుచేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 105 సహా ఐదు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని వదిలిపెట్టేది లేదని ప్రకటించిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు ప్రారంభించింది. బెంగళూరు పోలీస్ కమిషనర్ బి.దయానందను సస్పెండ్ చేసింది. అడిషనల్ పోలీస్ కమిషనర్ వికాశ్ కుమార్, డిప్యూటీ పోలీస్ కమిషనర్ శేఖర్‌పైనా వేటుపడింది. కబ్బన్ పార్క్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ సి.బాలకృష్ణ, కబ్బన్ పార్క్ సీఐ ఏకే గిరీశ్‌లను సస్పెండ్ చేసింది. ఈ కేసును సీఐడీకి ఇవ్వాలని సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ సమావేశం నిర్ణయించింది. ఈ వివరాలను ముఖ్యమంత్రి మీడియాకు తెలిపారు.

సుమోటోగా స్వీకరించిన హైకోర్టు

తొక్కిసలాట ఘటనను కర్ణాటక హైకోర్టు ధర్మాసనం సుమోటోగా స్వీకరించింది. హైకోర్టు చీఫ్ జస్టిస్ వి.కామేశ్వరరావ్, జస్టిస్ సీఎం జోషిల ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ తీరును తప్పుబట్టింది. ఐపీఎల్ విజేత ఆర్‌సీబీ సభ్యులతో రెండుచోట్ల ఎందుకు సంబరాలు నిర్వహించారని ప్రశ్నించింది. స్టేడియం వద్ద ఎలాంటి బందోబస్తు ఏర్పాటుచేశారు? క్రికెటర్ అభిమానుల నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమిటని సర్కారును నిలదీసింది. క్రీడాకారులు ఏ దేశానికి ఆడారని సన్మానం చేయదలచారని ప్రశ్నించిది. అడ్వకేట్ జనరల్ శశికరణ శెట్టి స్పందిస్తూ, ఘటనపై న్యాయ విచారణకు ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. దీంతో విచారణను బెంచ్ ఈ నెల 10వ తేదీకి వాయిదా వేస్తూ, సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

ఎవ్వరూ బాధ్యత తీసుకోరా?

బెంగళూరు తొక్కిసలాట ఘటనపై హర్ష్ గొయెంకా నిలదీత

న్యూఢిల్లీ, జూన్ 5: బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో పదకొండు మంది ప్రాణాలు బలిగొన్న ఘటనపై 'వ్యవస్థ' స్పందించిన తీరును ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్పీజీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ హర్ష్ గొయెంకా తీవ్రస్థాయిలో తూర్పారబట్టారు. తొక్కిసలాట ఘటనపై ఇప్పటివరకు ఎవ్వరూ రాజీనామా చేయకపోవడం, బాధ్యత వహిస్తున్నట్లుగా కనీసం ఓ ప్రకటన కూడా చేయకపోవడం ఏమిటి? అని నిలదీశారు. భారత్‌లో సామాన్యుడి ప్రాణాలకు విలువలేదా? అని ప్రశ్నించారు.

అయోధ్యలో వైభవంగా విగ్రహాల ప్రాణప్రతిష్ఠ

- పూజలు నిర్వహించిన సీఎం యోగి

అయోధ్య, జూన్ 5: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య బాలరాముడి ఆలయంలో రెండో దశ విగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. రామజన్మభూమి అయిన అయోధ్యలో 2024 జనవరిలో బాలరాముడి విగ్రహం ప్రతిష్ఠించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆలయ మొదటి అంతస్తులోని రామ్ దర్బార్‌లో రాజారాముడి విగ్రహాలను నూతనంగా ప్రతిష్ఠించారు. వాటితో పాటు, ఆలయ ప్రాంగణంలోని ఏడు ఉప ఆలయాల్లో కూడా విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ జరిగింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శర్మిష్ఠ పనోలికి మధ్యంతర బెయిల్ మంజూరు

కోల్‌కతా, జూన్ 5: సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, లా విద్యార్థిని శర్మిష్ఠ పనోలికి కోల్‌కతా హైకోర్ట్ మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేల పూచీకత్తు సమర్పించడంతో పాటు దేశం విడిచి వెళ్లరాదని చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆదేశించారు. కోల్‌కతాకు చెందిన 22 ఏళ్ల శర్మిష్ఠ పుణేలోని ఓ న్యాయ విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం చదువుతోంది. ఆపరేషన్ సిందూర్ వేళ బాలీవుడ్ ప్రముఖుల మౌనంపై శర్మిష్ఠ మే 14న ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది వైరల్ అవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఆమె తన వీడియోను తొలగించి క్షమాపణలు చెప్పారు. అయితే ఓ వర్గం వారి మనోభావాలను కించపరిచారంటూ శర్మిష్ఠపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. దీంతో కోల్‌కతా పోలీసులు ఆమెను మే 31న అరెస్ట్ చేశారు.

నాలాంటి వేలాది విద్యార్థుల మనోగతమే వినిపించా

(మొదటిపేజీ తరువాయి)



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

స్నాతకోత్సవం వేదికపై నుంచి పాలస్తీనాకు మద్దతుగా వారి సంప్రదాయ వస్త్రం ధరించి మరి తన గళం వినిపించింది. ఇజ్రాయెల్ ఆక్యుపేషన్ ఫోర్సెస్‌తో అమెరికా, ఎంఐటీ చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేసుకోవాలని పిలుపునిచ్చి సంచలనంగా నిలిచింది. కొన్ని వేలమంది సమక్షంలో సాహోసోపేత ప్రసంగం చేసి మానవతావాదుల మన్ననలు పొందిన భారతీయ-అమెరికన్ మేఘ వేమూరిని సామాజిక మాధ్యమాల ద్వారా 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. తన ప్రసంగంతోపాటు ఇతర అంశాలపై ఆమెను ప్రశ్నించింది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..!!

మీ కుటుంబ నేపథ్యం ?

నా పూర్తి పేరు మేఘ మాలిక వేమూరి. జార్జియాలోని అల్ఫారెట్టాలో పుట్టి, పెరిగాను. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు సామాజిక స్పృహ, జ్ఞానార్జనకు తోడ్పడే రకరకాల స్టూడెంట్స్ క్లబ్‌ల నిర్వహణలో నాయకత్వ పాత్ర పోషించా. విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగానూ పనిచేశా. మా నాన్న శరత్ వేమూరి సొంతూరు కృష్ణా జిల్లా ఘంటసాల గ్రామం. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆయన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా అమెరికాలో స్థిరపడ్డారు. అమ్మ పేరు సునీత, ఆమె కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీరే. తల్లిదండ్రులు నా ఆలోచనలకు, అభిప్రాయాలకు విలువ ఇస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో పెంచారు. అది నా వ్యక్తిత్వానికి ఎంతో మేలు చేసింది.

మీ అభిప్రాయ ప్రకటనకు స్నాతకోత్సవ వేదికను ఎంచుకోవడానికి కారణం ?

2021లో ఎంఐటీలో గ్రాడ్యుయేషన్ కోర్సులో చేరా. కంప్యూటింగ్, కాగ్నిటీవ్ సైన్స్, లింగ్విస్టిక్స్ నా సబ్జెక్టులు. వర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా పని చేస్తున్నప్పుడు 2023 ప్రారంభంలో పాలస్తీనియన్ల దయనీయ పరిస్థితిని తెలుసుకున్నా. ఇజ్రాయెల్ పాలస్తీనాపై సాగిస్తోన్న నరమేధం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఒక దేశ ఆధిపత్య దాడిలో వేల మంది అమాయకులు, అభంశుభం తెలియని చిన్నారులు, మహిళలు చనిపోవడం దారుణం కదా.! గాజాలో ఇజ్రాయెల్ బాంబు దాడులను, కాల్పులను మానవత్వం ఉన్నవారు ఎవరు సమర్థించరు. పాలస్తీనియన్లకు సంఘీభావం ప్రకటించకుండా ఉండలేరు. అదే సమయంలో మా ఎంఐటీలో ఇదే అంశం మీద పనిచేస్తున్న సమూహాలను కలిశా. మేమంతా కలిసి పాలస్తీనీయులకు మద్దతుగా పలు కార్యక్రమాలు చేపట్టాం. ఈ క్రమంలోనే పాలస్తీనాలో నరమేధం సృష్టిస్తున్న ఇజ్రాయెల్ ఆక్యుపేషన్ ఫోర్సెస్‌తో ఎంఐటీ పరిశోధనా సంబంధాలు కలిగి ఉండడాన్ని నిరసించడానికి మా స్నాతకోత్సవం సరైన వేదిక అనుకున్నాం. నేను క్లాస్ ప్రెసిడెంట్‌ను కావడంతో నాకు ప్రసంగించే అవకాశం ఇస్తారని తెలుసు. ఆ సమయాన్ని మా నిరసన తెలియజేయడంతో పాటు గాజాలో ఇజ్రాయెల్ నరమేధాన్ని ఆపాలన్న డిమాండ్‌ను ముందుకు తేవడానికి, పాలస్తీనాకు సంఘీభావాన్ని ప్రకటించడానికి వాడుకున్నాం. పాలస్తీనావాసులకు మద్దతుగా కెఫెయే('సంప్రదాయ వస్త్రం)ను ధరించి మరీ ఆ వేదికపై ప్రసంగించా.

ప్రసంగం తర్వాత నిర్బంధాలు ఎదుర్కొన్నారా ?

లేదు.! నాకు ఎలాంటి బెదిరింపులు రాలేదు. నిర్బంధాలు ఎదురుకాలేదు. మరుసటి రోజు స్నాతకోత్సవానికి మాత్రం నన్ను అనుమతించలేదు. డిగ్రీ పట్టాను నాకు పోస్టు ద్వారా పంపిస్తామని చెప్పారు. యూనివర్సిటీ నుంచి నన్ను పూర్తిగా నిషేధించారు అని జరిగిన ప్రచారంలో వాస్తవంలేదు. న్యూరోసైన్స్‌తో పాటు లింగ్విస్టిక్స్‌లో పరిశోధన కొనసాగిస్తాను.

పాక్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై కూడా మాట్లాడాల్సింది అని అంటున్నారు కదా..

కశ్మీర్ సమస్యతో సహా ఇవాళ ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ల మీద నాకు అవగాహన ఉంది. అయితే, కొన్నేళ్లుగా గాజా సమస్యపై లోతుగా అధ్యయనం చేస్తున్నా. అందువల్లే పాలస్తీనా పక్షాన గళం వినిపించా.

మీరు ఎదుర్కొన్న విమర్శలు? ప్రశంసలు?

మా గ్రాడ్యుయేషన్ డే రోజున పాలస్తీనాకు సంఘీభావంగా ప్రసంగించాలని అనుకున్నప్పుడే.. ప్రశంసలే కాదు, అంతకుమించి విమర్శలూ వస్తాయని ఊహించాం. నాపై సాగే ట్రోల్స్‌కు కూడా సిద్ధపడ్డా. ఎవరో ఏదో అంటారని, మనం నమ్మిన సత్యాన్ని వెల్లడించకుండా ఉండడం సరికాదు. ఈ సంఘటన తర్వాత మా అమ్మానాన్న, బాబాయిలు, ఇతర కుటుంబసభ్యులు, బంధుమిత్రులు అంతా నాకు మద్దతుగా నిలిచారు. 'నీ ధైర్యసాహసాలు, పాలస్తీనియన్ల పట్ల నువ్వు చూపిస్తున్న కరుణ చూస్తుంటే గర్వంగా ఉంది' అంటూ మా నాన్న నన్ను గుండెలకు హత్తుకున్నారు. నా చర్య వల్ల అమెరికాలోని భారతీయ విద్యార్థులకు సమస్యలు ఎదురవుతాయి అనుకోవడంలో నిజం లేదు. ఎక్కడైనా అన్యాయం, అసత్యం, అమానవీయం అనిపించిన సందర్భాల్లో యువత బాధితులకు గొంతుకగా నిలవాలి.

వివాహ బంధంలోకి మహువా

వరుడు బీజేడీ మాజీ ఎంపీ పినాకి మిశ్రా



న్యూఢిల్లీ, జూన్ 5: తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. బీజేడీ మాజీ ఎంపీ పినాకి మిశ్రాను ఈనెల 3న జర్మనీ రాజధాని బెర్లిన్‌లో ఆమె పెళ్లి చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోను ఒక ఆంగ్ల టీవీ చానల్ తాజాగా వెలుగులోకి తెచ్చింది. సాంప్రదాయ పెళ్లి దుస్తుల్లో ఇద్దరూ చేయిచేయి పట్టుకొని సంతోషంగా నడిచి వస్తున్న ఈ ఫొటోలో మహువా భారీగా బంగారు ఆభరణాలు కూడా ధరించి ఉండటంతో వీరు పెళ్లి చేసుకున్నట్టు అర్థమవుతోంది. అలాగే, పెళ్లి జరిగినట్టు మహువా గురువారం నిర్ధారించారు. తామిద్దరూ కలిసి కేక్ కట్ చేస్తున్న ఫొటోను ఆమె 'ఎక్స్'లో పోస్టు చేశారు. దీంతో ప్రజలు సోషల్ మీడియా ద్వారా ఈ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 1974 అక్టోబరు 12న అసోంలో జన్మించిన మహువా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. అనంతరం 2010లో ఆమె మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2019, 2024లో కృష్ణనగర్ నుంచి ఆమె ఎన్నికయ్యారు.

1,000 డాలర్లు చెల్లిస్తే.. నిరీక్షణ అక్కర్లేదు

- యూఎస్ వీసా ఇంటర్వ్యూకు కొత్తగా ప్రీమియం సేవలు

వాషింగ్టన్, జూన్ 5: నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా దరఖాస్తుదారులకు ప్రీమియం సర్వీసును అందించాలని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. అయితే దీనిని ఉపయోగించుకోవాలంటే 1,000 యూఎస్ డాలర్లు అంటే సుమారుగా రూ.86,000 చెల్లించాలి. డబ్బులు పెట్టుకోగలిగిన పర్యాటకులకు, వ్యాపారవేత్తలకు ఉపయుక్తంగా ఉండేలా దీనిని రూపొందించారు. ట్రంప్ ప్రచార విధాన సలహాదారులు మే 17న తయారు చేసిన ఓ డ్రాఫ్ట్ ప్రకారం వీసా ఇంటర్వ్యూకి త్వరగా వెళ్లడానికి ఇది ఉపయోగపడుతుంది. యూఎస్ వీసా ఇంటర్వ్యూ కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కొన్ని దేశాల్లో అయితే ఈ సమయం ఏడాదిన్నర వరకూ ఉంది. ఈ పరిస్థితిని తప్పించడానికి ప్రీమియం సర్వీసు ఉపయోగపడుతుందని మెమోలో పేర్కొన్నారు. డిసెంబరులో దీనిని ప్రయోగాత్మకంగా ప్రారంభించాలని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఇది ప్రస్తుత వీసా దరఖాస్తు, ఇంటర్వ్యూ ప్రక్రియల్లో ఎటువంటి మార్పును చేయబోదు. కేవలం సుదీర్ఘకాల నిరీక్షణను మాత్రమే తప్పిస్తుందని మెమోలో స్పష్టం చేశారు. వీసా దరఖాస్తు సమయంలో చెల్లించాల్సిన 185 యూఎస్ డాలర్లకు ఇది అదనం.

మస్క్‌తో నిరాశ చెందా: ట్రంప్

వాషింగ్టన్, జూన్ 5: తాను ప్రతిపాదించిన ఫెడరల్ ప్రభుత్వ వ్యయ నియంత్రణ బిల్లును ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యతిరేకించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ బిల్లులోని ముఖ్యఅంశాలు తెలిసి కూడా వ్యతిరేకించారని, దాంతో తాను నిరాశ చెందానని చెప్పారు. తప్పనిసరిగా విద్యుత్తు వాహనాలను వినియోగించడంపై విధించిన లక్ష్యాలను ఈ బిల్లులో మార్పు చేశామని, ఇది టెస్లా విద్యుత్తు వాహనాల కంపెనీ యజమాని అయిన మస్క్‌కు నచ్చినట్టు లేదని అభిప్రాయపడ్డారు. డోగ్‌కు మస్క్ అధిపతిగా ఉండడం, ఈ బిల్లును చూసిన తరువాత ఆ పదవికి రాజీనామా చేయడం గమనార్హం. గురువారం ట్రంప్ శ్వేతసౌధంలోని ఓవల్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఒక్క విద్యుత్తు వాహనాల అంశం తప్ప బిల్లులోని మిగిలిన అంశాలపై మస్క్‌కు అభ్యంతరాలు లేవని అన్నారు. విద్యుత్తు వాహనాలకు ఇస్తున్న పన్ను మినహాయింపులు ఎత్తివేయడం కూడా ఆయనకు నచ్చలేదని అన్నారు. 'మస్క్‌కు ఎంతో చేశాను. ఇద్దరి మధ్య గొప్ప స్నేహం ఉంది. అది కొనసాగుతుందో లేదో చెప్పలేను. ఆయన నా గురించి ఎంతో గొప్పగా చెప్పారు. చెడుగా ఒక్క మాట అనలేదు. అయినా ఆయనతో అసంతృప్తి చెందా' అని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై మస్క్ ఎక్స్‌లో స్పందిస్తూ వ్యయ నియంత్రణ బిల్లును తనకు చూపలేదని తెలిపారు.

అక్రమ వలసదార్లపై అమెరికా ఉక్కుపాదం

వాషింగ్టన్, జూన్ 5: అక్రమ వలసదారులపై అమెరికా ఉక్కు పాదం మోపుతోంది. మంగళవారం ఒక్క రోజునే ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ 2,200 మందిని అరెస్టు చేసింది. రోజుకు కనీసం 3,000 మందిని అదుపులోకి తీసుకోవాలని హోంలాండ్ సెక్రటరీ ఆదేశించిన నేపథ్యంలో ఈ అరెస్టులు జరిగాయి. ఏటీడీ ప్రోగ్రాం కింద పేర్లను నమోదు చేశారు. ఇలాంటి వారి మోకాళ్లకు మోనిటర్లు బిగించడంతో పాటు స్మార్ట్‌ఫోన్ యాప్‌లు, గూగుల్ లోకేషన్ ద్వారా వీరిపై నిఘా పెడుతారు. కానీ ఇమ్మిగ్రేషన్ కార్యాలయానికి రావాలంటూ అందరికీ మెసేజ్‌లు పెట్టారు. అందరూ అక్కడికి వచ్చిన తరువాత అరెస్టు చేశారు. అందులో ఏడుగురికి బేడీలు వేసి కారులో కూర్చోబెట్టారు. 12 దేశాల వారు అమెరికాకు రాకుండా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం రాత్రి ఆదేశాలు ఇచ్చారు. ఈ జాబితాలో అఫ్ఘానిస్థాన్, మయన్మార్, చాద్, కాంగో, ఈక్విటోరియల్ గుయానా, ఎరిత్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, యెమెన్‌లు ఉన్నాయి.

బక్రీద్‌కు ఆవులు, ఒంటెలను వధిస్తే చర్యలు

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ హెచ్చరిక

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులు, దూడలు, ఒంటెలను వధిస్తే.. జంతు సంరక్షణ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు హెచ్చరించారు. జంతు సంరక్షణ, గోవధ నిషేధ చట్టాల ప్రకారం రాష్ట్రంలో ఈ జంతువుల వధపై నిషేధం ఉందని గురువారం ఓ ప్రకటనలో ఆయన తెలిపారు. ఈ చట్టాలను గౌరవించి, వీటిని వధించరాదని కోరారు. క్షేత్రస్థాయిలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, జంతు వధను నివారించాలని పశుసందర్ధక శాఖ సిబ్బందిని ఆయన ఆదేశించారు.

జాబ్ గ్యారెంటీకి 'యాడ్ ఆన్' నైపుణ్యం

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులకు సర్టిఫికెట్ జారీచేసేలా ప్రణాళిక రూపొందించింది. అంటే డిప్లొమా కోర్సు మరో ఏడాది మిగిలి ఉండగానే విద్యార్థులకు అదనపు నైపుణ్య శిక్షణ సర్టిఫికెట్ చేతికి అందుతుంది. దానివల్ల డిప్లొమా పూర్తికాగానే వారికి ఉద్యోగాలు వచ్చే అవకాశాలు మెరుగవుతాయని సాంకేతిక విద్యాశాఖ చెబుతోంది. 2024-25లో ఈ యాడ్‌ఆన్ కోర్సులను ప్రయోగాత్మకంగా అమలుచేయగా, 2025-26 విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో అమలుకు సిద్ధమైంది. ఇందుకోసం ప్రాంతాల వారీగా ఉన్న పరిశ్రమలతో విద్యార్థులను అనుసంధానం చేయనుంది. మొత్తం రాష్ట్రాన్ని ఆరు క్లస్టర్లుగా విభజించి, పది రకాల సెక్టార్లలో 24 రకాల కోర్సుల్లో విద్యార్థులకు అదనపు శిక్షణ ఇస్తుంది. డిప్లొమా రెండో సంవత్సరం విద్యార్థులకు సాయంత్రం తరగతులు పూర్తయిన తర్వాత యాడ్‌ఆన్ కోర్సుల కోసం మరో గంట సేపు అదనంగా బోధన చేయనున్నారు. ఇందుకోసం సాంకేతిక విద్యాశాఖ ప్రత్యేకంగా సిలబస్‌ను తయారుచేసింది.

ఈ ఏడాది నుంచి తప్పనిసరి

ప్రయోగాత్మకంగా 2024-25లో 70 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 3,468 మంది విద్యార్థులకు యాడ్‌ఆన్ కోర్సులు బోధించారు. వారికి ఇప్పుడు సర్టిఫికెట్లు జారీకి సాంకేతిక విద్యాశాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. 2025-26 నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో దీనిని తప్పనిసరి చేశారు. రెండో సంవత్సరం చదివే సుమారు 13వేల మంది విద్యార్థులు తప్పనిసరిగా యాడ్‌ఆన్ కోర్సు సర్టిఫికెట్ పొందాలి. వారికి 30 గంటల పాటు ఇన్‌స్టిట్యూట్, ల్యాబ్స్‌లో శిక్షణ ఇస్తారు. మరో 10 గంటల పాటు సంబంధిత పరిశ్రమలకు విద్యార్థులను తీసుకెళ్లి అక్కడి యంత్రాలు, వాటి పనితీరుపై అవగాహన కల్పిస్తారు. దీనికి 4.5 లెవెల్‌తో సర్టిఫికెట్ జారీచేస్తారు. డిప్లొమా సర్టిఫికెట్,యాడ్‌ఆన్ కోర్సు సర్టిఫికెట్, కోర్సు అనంతరం చేసే ఇండస్ట్రియల్ శిక్షణతో విద్యార్థులకు తొందరగా ఉద్యోగం వస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

డిప్లొమాతో ఉద్యోగాలే లక్ష్యం

గత కొన్నేళ్లుగా డిప్లొమా విద్య తీరు మారిపోయింది. ఒకప్పుడు త్వరగా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో డిప్లొమాలో చేరితే ఇప్పుడు ఎక్కువ మంది ఇంజనీరింగ్ కోసం డిప్లొమా చదువుతున్నారు. మూడేళ్ల డిప్లొమా అనంతరం ఈసెట్ ద్వారా ఇంజనీరింగ్‌లో సీట్లు పొందుతున్నారు. డిప్లొమాపై మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు వస్తున్నవారు కూడా వాటిని వదులుకుని ఇంజనీరింగ్ బాట పడుతున్నారు. దీనివల్ల డిప్లొమా అనంతరం ఉద్యోగాలు చేసేవారి సంఖ్య తగ్గుతోంది. కొత్త విధానంతో డిప్లొమా సర్టిఫికెట్‌తోనే ఉద్యోగంలో స్థిరపడే అవకాశం ఏర్పడుతుంది. అలా విద్యార్థులను డిప్లొమా స్థాయిలో ఉద్యోగాలు సాధించేలా చేయాలని సాంకేతిక విద్యాశాఖ లక్ష్యంగా నూతన విధానాలు అమలుచేస్తోంది.

ఇవీ క్లస్టర్లు, కోర్సులు

- క్లస్టర్-1లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు ఉన్నాయి. ఇక్కడ ఫార్మా, ఉత్పత్తిరంగాలు ప్రధాన పరిశ్రమలు. ఈ క్లస్టర్‌లో ఫార్మాలో ఉపకరణాల నిర్వహణ, ఫార్మా ప్రాసెస్ కంట్రోల్, ఫార్మా ఇండస్ట్రీ ప్రాసెస్ సేఫ్టీ, ఉత్పత్తి రంగంలో నిర్వహణ, ఉత్పత్తి రంగంలో అడ్వాన్స్‌డ్ ఎన్‌డీటీల కోర్సులు ఉన్నాయి.
- క్లస్టర్-2లో ఉభయగోదావరి జిల్లాలున్నాయి. ఇక్కడ ఆక్వా ప్రధాన పరిశ్రమ. ఈ క్లస్టర్‌లో ఆక్వా అమ్మోనియా రిఫ్రిజిరేషన్, ఆక్వా ప్లాంట్ ఆటోమేషన్ అండ్ మానిటరింగ్ కోర్సులు ఉన్నాయి.
- క్లస్టర్-3లో కృష్ణా, గుంటూరు జిల్లాలున్నాయి. ఇక్కడ మెకానికల్, టెక్స్‌టైల్ ప్రధాన పరిశ్రమలు. ఈ క్లస్టర్‌లో టెక్స్‌టైల్ పరిశ్రమలో మెషీన్ల నిర్వహణ- రిపేర్లు, స్పిన్నింగ్ మిల్లులో ప్రాసెస్ కంట్రోల్ కోర్సులు ఉన్నాయి.
- క్లస్టర్-4లో ప్రకాశం, నెల్లూరు జిల్లాలున్నాయి. ఇక్కడ గ్రానైట్, ఆయిల్ టెక్నాలజీ ప్రధాన పారిశ్రామిక రంగాలు. ఈ క్లస్టర్‌లో గ్రానైట్ ఇండస్ట్రీలో మెషీన్ల నిర్వహణ- రిపేర్లు, పీఎల్‌సీ, ఎస్‌సీఏడీఏ ద్వారా ఆటోమేషన్, గ్రానైట్ క్వాలిటీ కంట్రోల్, ఆయిల్ ఇండస్ట్రీలో మెషినరీ నిర్వహణ, ఎలక్ట్రికల్ ఆటోమేషన్ కోర్సులున్నాయి.
- క్లస్టర్-5లో కర్నూలు, అనంతపురం జిల్లాలున్నా యి. ఇక్కడ రెన్యూవబుల్, సోలార్, విండ్ పవర్, ఆటోమొబైల్ ప్రధాన రంగాలు. ఈ క్లస్టర్‌లో సోలార్ ఎనర్జీ బేసిక్స్ అండ్ సిస్టమ్ డిజైన్, రెన్యూవబుల్ సివిల్ ఇంజనీరింగ్, అసెంబ్లీ ఇన్ ఆటోమేటివ్స్, ఆటోమేటివ్స్‌లో ఎలక్ట్రికల్ సిస్టమ్స్, ఆటోమేటివ్ డైనమిక్స్ అండ్ కంట్రోల్స్ కోర్సులున్నాయి.
- క్లస్టర్-6లో కడప, చిత్తూరు జిల్లాలున్నాయి. ఇక్కడ సిమెంట్, ఎలక్ట్రానిక్స్ ప్రధాన రంగాలు, సిమెంట్ పరిశ్రమలో ఉపకరణాల నిర్వహణ, ఎలక్ట్రికల్ ఆటోమేషన్, మెటీరియల్ టెస్టింగ్ కోర్సులు, ఎలక్ట్రానిక్స్‌లో పీసీబీ డిజైన్ ఈక్యాడ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, సేఫ్టీ ప్రొటోకాల్స్, పీఎల్‌సీ, ఎస్‌డీఏడీఏ కోర్సులున్నాయి.

ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు మెరుగైన ప్రోత్సాహకాలు

- రాయలసీమలో 25 శాతం తయారీ యూనిట్లు
- ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి కాటమనేని భాస్కర్
- తిరుపతిలో పెట్టుబడుల ప్రమోషన్ల వర్క్‌షాప్



సమావేశంలో మాట్లాడుతున్న కాటమనేని భాస్కర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు, పరిశ్రమల స్థాపనకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాటమనేని భాస్కర్ అన్నారు. తిరుపతిలో గురువారం నిర్వహించిన ఎలక్ట్రానిక్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీం (ఈసీఎంఎస్), ఏపీ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ ముసాయిదా, పెట్టుబడుల ప్రమోషన్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రానిక్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల మార్గదర్శకాలు విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కేంద్రం పాలసీకన్నా అదనంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మెరుగైన రాయితీలు, సదుపాయలు అందించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈ వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. ఇప్పటి వరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్‌ను మన రాష్ట్రంలో తయారు చేసేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామన్నారు. 25 శాతం ఆ యూనిట్లను దక్షిణ రాయలసీమలో నెలకొల్పడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పారిశ్రామికవేత్తలను కోరారు. ఇప్పటికే శ్రీసిటీలో 200కుపైగా పరిశ్రమలు ఉన్నాయని వివరించారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామన్నారు. అంతకుముందు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి సుశీల్ పాల్ మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కోసం భారత ప్రభుత్వం పీఎల్‌ఐ, ఇతర ఇన్సెంటివ్స్ అందజేస్తోందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు తీసుకొస్తున్న పాలసీలు అమోఘమని పలువురు పారిశ్రామిక వేత్తలు కొనియాడారు.

కొరియర్‌లో ఎండీఎంఏ డ్రగ్స్

- ముగ్గురు యువకుల అరెస్టు..
- ఢిల్లీ నుంచి వచ్చినట్టుగా గుర్తింపు

విజయవాడ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీ నుంచి కొరియర్ ద్వారా విజయవాడకు సరఫరా అవుతున్న డ్రగ్ వ్యవహారాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు బట్టబయలు చేశారు. ముగ్గురు యువకులను అరెస్టు చేసి, 33 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత, సెంట్రల్ ఏసీపీ కె.దామోదర్, పటమట ఇన్‌స్పెక్టర్ వి.పవన్‌కిశోర్ గురువారం ఈ కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం సనత్‌నగర్‌కు చెందిన తిరుమలశెట్టి జీవన్‌కుమార్ అలియాస్ కిన్ను బీటెక్ చదువుకుని ఖాళీ ఉంటున్నాడు. విజయవాడ పటమట ఫన్ టైమ్స్ క్లబ్ వీధికి చెందిన బొంతు నితీష్‌కుమార్ అలియాస్ బబ్బు డిగ్రీ పూర్తిచేసి వీసా కన్సల్టెన్సీలో ఉద్యోగం చేస్తున్నాడు. పెనమలూరు మండలం యనమలకుదురుకు చెందిన తూలిమెల్లి తరుణ్‌ప్రసాద్ గంగూరులోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. జీవన్‌కుమార్, నూజివీడుకు చెందిన మనోహర్ అనే యువకుడు ఇంటర్మీడియట్ వరకు కలిసి చదువుకున్నారు. తర్వాత మనోహర్ ఉత్తరప్రదేశ్‌లోని కాంట్రాక్ట్‌లు చేస్తున్న తన మేనమామ వద్దకు వెళ్లిపోయాడు. అక్కడి నుంచి విజయవాడకు వచ్చినప్పుడు ఎండీఎంఏ డ్రగ్ తెచ్చుకునేవాడు. ఆవిధంగా జీవన్ డ్రగ్ అలవాటు చేసుకున్నాడు. ఇదే క్రమంలో డ్రగ్ ఆర్డర్ కోసం నోయిడాకు చెందిన రింకు అనే యువకుడ్ని జీవన్‌కు మనోహర్ పరిచయం చేశాడు. ఆరు నెలలుగా జీవన్ నోయిడా నుంచి ఆర్డర్ ఇచ్చి ట్రాక్ ఆన్, డీటీడీసీ కొరియర్ సర్వీసుల ద్వారా డ్రగ్స్‌ను రప్పించుకుంటున్నాడు. ఇందుకోసం హైదరాబాద్‌లో తప్పుడు చిరునామాలు ఇస్తున్నాడు. ఫోన్ నంబర్ మాత్రం తనదే ఇచ్చాడు. డ్రగ్స్ పంపే వ్యక్తి ఎవరికీ అనుమానం రాకుండా గిఫ్ట్‌ప్యాక్‌లా పార్సిల్ చేస్తున్నాడు. కొరియర్ సర్వీస్ డెలివరీ బాయ్స్ ఆ చిరునామాకు వెళ్లి ఫోన్ చేయగా విజయవాడ నుంచి జీవన్ బయలుదేరి వెళ్లి తీసుకునేవాడు. ఇలా హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి ఎండీఎంఏను నితీష్‌కుమార్‌కు ఇచ్చి అమ్మకాలు చేయిస్తున్నాడు. గుంటూరు జిల్లాలో ఉన్న ఓ డీమ్డ్ వర్సిటీ, విజయవాడ, కృష్ణా జిల్లాలో ప్రైవేటు ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు గ్రాము రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఏపీ39ఆర్‌పీ1404, ఏపీ40సీసీ4501 నంబరు గల ద్విచక్రవాహనాలపై ఎండీఎంఏను తీసుకొస్తుండగా రామవరప్పాడు రింగ్ వద్ద టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు పట్టుకున్నారు. ఈ ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 33 గ్రాముల ఎండీఎంఏ, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయాన్ని గొల్లపూడి నుంచి మంగళగిరికి మార్చినట్టు విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

మల్లన్న సన్నిధిలో జస్టిస్ సుమతి



నంద్యాల కల్చరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి దంపతులు బుధవారం నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.

టీటీడీ సీవీఎస్వోగా మురళీకృష్ణ బాధ్యతల స్వీకరణ

టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్(సీవీఎస్వో)గా కేవీ మురళీకృష్ణ గురువారం తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా శ్రీవారిని దర్శించుకున్న ఆయన రంగనాయక మండపానికి చేరుకున్నారు. అక్కడ సీవీఎస్వోగా ఫైల్‌పై సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. తిరుమలలో ఉన్నత భద్రతా ప్రమాణాలను అమలు చేసే దిశగా పనిచేస్తానని మురళీకృష్ణ తెలిపారు.

కొబ్బరి, పొగాకు పంటలకూ బీమా

అమరావతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని కొబ్బరి, పొగాకు రైతులకు ఈ ఏడాది నుంచి పంటల బీమా వర్తించనున్నది. గతేడాది మామిడిని పంటల బీమాలోకి చేర్చిన రాష్ట్రప్రభుత్వం..కేంద్రం ప్రతిపాదనతో ఇప్పుడు కొబ్బరి, పొగాకును కూడా పంటల బీమా పరిధిలోకి తెచ్చింది. పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమాలో ఈ పంటలను చేర్చారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖతో ఎంపానల్ అయిన రాష్ట్ర వ్యవసాయ శాఖ కొబ్బరి, పొగాకు పంటలకు బీమా అమలుకు టెండర్లు పిలిచింది. శుక్రవారం బిడ్లను ఖరారు చేయనున్నది. ప్రభుత్వ ఆమోదంతో అవార్డు నోటీసు జారీ చేయనున్నది. కొబ్బరి బీమా వర్తింపజేయడానికి 2025 ఖరీఫ్‌లో ఏడు జిల్లాల్లోని మూడు క్లస్టర్లు, పొగాకు(ఎఫ్‌సీవీ)కు 2025-26 రబీలో ఆరు జిల్లాల్లోని మూడు క్లస్టర్లను అర్హత ప్రాంతంగా గుర్తించింది. బీమా ప్రయోజనాల కోసం నోటిఫైడ్ ఏరియాల్లోని రైతులు, కౌలు సాగుదారులు వివరాలు నమోదు చేసుకోవాలి. ప్రీమియంలో తన వాటాను రైతు చెల్లిస్తే.. సబ్సిడీ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరిస్తాయి.

నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా శేషారావు బాధ్యతలు

అమరావతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బూరుగుపల్లి శేషారావు గురువారం తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువతకు నైపుణ్యాల కల్పన ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రతి జిల్లాలో స్కిల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.



ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బూరుగుపల్లి శేషారావు

లాసెట్ రాసిన ఏబీవీ, ఎమ్మెల్యే సౌమ్య



ఒంగోలు లాసెట్ కేంద్రం వద్ద ఏబీ వెంకటేశ్వరరావు

ఒంగోలు క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు గురువారం లాసెట్ పరీక్ష రాశారు. ఒంగోలు రైజ్ కాలేజీలో జరిగిన పరీక్షకు హాజరైన వెంకటేశ్వరరావు అనంతరం మీడియాతో మాట్లాడారు. లాయర్‌గా ప్రాక్టీస్ చేయడం కంటే కూడా న్యాయశాస్త్రం చదవాలనే ఆసక్తితో లాసెట్ రాసినట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆయనపై పలు అభియోగాలు మోపడంతో కోర్టులో ఆయన వాదనలను ఆయనే వినిపించారు.

న్యాయశాస్త్రం చదవాలని..: ఎమ్మెల్యే సౌమ్య



నందిగామ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన ఉంటే పాలనకు తోడ్పాటుగా ఉంటుందని ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. బుధవారం ఏపీ లాసెట్‌కు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ, తన తండ్రి తంగిరాల ప్రభాకరరావు న్యాయవాదిగా పేదలకు సేవలందించారన్నారు. ఆయన స్ఫూర్తితో తాను న్యాయశాస్త్రం చదవాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- త్రివిధ దళాలు సహా వివిధ శాఖలతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

అమరావతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైరుతి రుతుపవన కాలంలో సంభవించే తుఫానులు, వరదలు వంటి ఎటువంటి విపత్తులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖలు తగిన కార్యాచరణ ప్రణాళికలతో సర్వసన్నద్ధమై ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. మాన్సూన్ సన్నద్ధతపై గురువారం సచివాలయం నుంచి ఆయన వివిధ ప్రభుత్వశాఖలతోపాటు ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, కోస్టు గార్డు, ఎన్డీఆర్ఎఫ్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నైరుతి రుతుపవన కాలంలో ఎక్కడైనా అధిక వర్షాలు, వాగులు, వంకలు పొంగి వరదలు సంభవించే పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉంటే, వాటిని ముందుగానే అంచనా వేయాలని ఇందుకు సంబంధించి వాసర్ ల్యాబ్స్‌తో సమన్వయం చేసుకోవాలని విపత్తుల నిర్వహణశాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్‌లు, ఇస్రోతో కలిసి సమన్వయంతో పని చేయాలని సీఎస్ చెప్పారు.

హజ్‌లో 1618 మంది రాష్ట్ర యాత్రికులు

- అరాఫత్ మైదానంలో ప్రార్థనలు పూర్తి : మంత్రి ఫరూక్

రాష్ట్రం నుంచి హజ్‌కు వెళ్లిన యాత్రికులందరూ గురువారం పవిత్ర అరాఫత్ మైదానంలో ప్రార్థనలు పూర్తి చేశారని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. మొత్తం 1618 మంది మక్కా నుంచి బయలు దేరి మీనా క్యాంపునకు, అక్కడి నుంచి అరాఫత్ మైదానానికి సురక్షితంగా చేరుకుని ప్రార్థనలు నిర్వహించారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం రాత్రికి ముజ్దలిఫాలో బస చేసి శుక్రవారం ఉదయం తిరిగి మీనాకు చేరుకుంటారని తెలిపారు.

ఏపీసీపీడీసీఎల్‌కు రూ.2400 కోట్ల బకాయిలు

- రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం: సీఎండీ

గుంటూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతితో పాటు ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో విస్తరించిన ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ సంస్థకు రూ.2400 కోట్ల బకాయిలు ఉన్నట్టు ఆ సంస్థ సీఎండీ పుల్లారెడ్డి తెలిపారు. సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీ కృష్ణయాదవ్ గురువారం గుంటూరులో పర్యటించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ సీపీడీసీఎల్ పరిధిలో ఎక్కువగా గ్రానైట్, ఆక్వా, స్పిన్నింగ్ మిల్స్ తదితర భారీ పరిశ్రమలు ఉండటంతో బకాయిలు పేరుకుపోయాయన్నారు. రికవరీకి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పీఎం సూర్యఘర్ పథకం అమలుకు లక్ష్యాలు నిర్దేశించామని చెప్పారు. ఈ నెలలో 75 వేలు పీఎం సూర్యఘర్ కనెక్షన్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. పీఎం సూర్యఘర్ కోసం రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించేందుకు సబ్ స్టేషన్ స్థాయిలో 33 కేవీ, 11 కేవీ ఇతర లైన్లను తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

10 నుంచి సమైక్య యాత్ర: సీపీఎం

న్యూఢిల్లీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మత విద్వేషాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈ నెల 10 నుంచి సమైక్య యాత్ర నిర్వహించనున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో పవన్ కల్యాణ్ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముస్లింలు వెళ్లిపోవాలని చెబుతున్నారని, అలా చెప్పే హక్కు ఆయనకు ఎక్కడిదని ప్రశ్నించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తప్పెవరిది...?

మాధ్యమాలు మనకు ఎంతగా వడబోసి చూపినా, బెంగుళూరు తొక్కిసలాట దృశ్యాలు మనలను కుదిపేస్తున్నాయి, మనసు కలిచివేస్తున్నాయి. కాళ్ళకింద నలిగిపోతున్న వారిని కాపాడుకోవడానికి కొందరు ప్రయత్నించి కూడా, ఆ తోపులాటల మధ్య ఏమీ చేయలేని నిస్సహాయత వారిది. పదిహేడు దండయాత్రల తరువాత, రాయల్ చాలెంజర్స్ ఆ ట్రోఫీ మీద తొలి సారిగా చెయ్యివేసిన ఆ సంతోషం బెంగుళూరు నగరానికి కానీ, ఆ రాష్ట్రానికి కానీ మిగలనివ్వకుండా చేసిందీ దారుణఘటన. కేరింతలు కొట్టిన ఆ గొంతులు వెంటనే కన్నీళ్ళు దిగమింగాల్సివచ్చింది. విజయోత్సవాలు విషాదంతం కావడం ఇది తొలిసారి కాదు, చివరిసారీ కాకపోవచ్చు. కానీ, రండి వేడుకచేసుకుందామని ప్రభుత్వ పెద్దలే పనిగట్టుకొని పిలిచి ప్రచారం చేసిన తరువాత, కప్పుకొట్టుకొచ్చిన ఆ వీరులను కళ్ళార్పకుండా చూడవచ్చునని నమ్మివచ్చిన వారి భద్రతను ఇలా గాలికివదిలేయడం సముచితం కాదు. భావి తరాన్ని పోగొట్టుకున్న ఆ కుటుంబాలకు ఇది తీరనిశోకం.

ఈ కార్యక్రమాన్ని ఎవరు నిర్వహించారని హైకోర్టు ప్రశ్నించింది కానీ, తెరమీద కనిపించాలన్న తాపత్రయంతో తెరవెనుకనుంచి కథ నడిపినవారెవ్వరో న్యాయమూర్తులకు తెలియకుండా ఉంటుందా? కీర్తికిరీటాలు ధరించాలని, తమదికాని విజయంలోనూ వాటా కొల్లగొట్టాలని నాయకుల తాపత్రయం. వారి అత్యుత్సానికి నిండైన జీవితాలను గడపాల్సిన యువతరం అర్ధంతరంగానే నిష్క్రమించాల్సివచ్చింది. ఒక భయానకమైన విషాదం జరిగి, ఈ పాపానికి కర్తలెవరు, కారకులెవ్వరన్న ప్రశ్నలు ఎదురైనప్పుడు మాత్రం ఈ సూత్రధారులు, పాత్రధారులు తెరమరుగైపోతారు. సన్మానాలు చేసినవారు, చేయించుకున్నవారు, విజేతలతో కలిసి ఊరేగినవారు వెనక్కుపోయి, ఓ నాలుగు కేసులు పెట్టడం ద్వారా తప్పు ఎదుటివారిమీదకు నెట్టేస్తారు.

మనిషి ప్రాణంమీద కాస్తంత ప్రేమ, బాధ్యత ఉంటే ఈ ఘటన జరిగేది కాదు. ఇదేమీ ప్రళయమో, ప్రకృతివైపరీత్యమో కాదు. ఉగ్రదాడులను సైతం ముందుగా పసిగట్టనందుకు నిఘావిభాగాలను, ప్రజలకు భద్రతనివ్వనందుకు పోలీసుల తప్పుబడుతూనే ఉన్నాం. ప్రకృతి ఆగ్రహాన్ని సైతం తట్టుకునిలబడేందుకు మనిషి ప్రయత్నిస్తున్న కాలంలో, ఒక వేడుకను సక్రమంగా నిర్వహించలేకపోవడం విషాదం. వరుస తప్పిదాలు, నిర్లక్ష్యాలు ఈ ఘటనకు దారితీశాయన్నది నిజం. తవ్వితీసినకొద్దీ పాపాలచిట్టా బయటకు వస్తూనే ఉంది. ముప్ఫైవేలమంది పట్టేచోటుకు పదిరెట్లజనం వచ్చేట్టుగా ప్రచారాలు చేయడం, విజేతల ఓపెన్‌టాప్ ఊరేగింపుల, ట్రోఫీల ప్రదర్శనలపై విస్తృత ప్రచారాలు కలగలసి చిన్నస్వామిస్టేడియం సామర్థ్యానికి నాలుగైదురెట్లమందితో చుట్టూవున్న ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోవడానికి కారణమైనాయి. కేవలం రెండుకిలోమీటర్ల దూరం ఉన్న రెండుచోట్లలో అతికొద్దినిముషాల తేడాలో ఒకదాని వెనుక మరో కార్యక్రమాన్ని, అదీ అతిభారీగా, బహిరంగంగా నిర్వహించాలన్న ఆలోచన ఎవరిదో బహుశా ఎప్పటికీ తెలియదేమో. ట్రోఫీ గెలిచిన మర్నాడే వీరుల ప్రదర్శన కూడదని, ఆనందంతో ఊగిపోతున్న అభిమానులను నియంత్రించడం కష్టమైపోతుందని చెప్పినా వినకుండా, ఆ వేడి మీదే వేడుక చేయాలంటూ పోలీసులను లొంగదీసిన నేతలెవరో ఎన్నటికీ వెలుగుచూడదేమో.

కప్పుచేతిలో పట్టుకున్న విరాట్‌కోహ్లీని ప్రత్యక్షంగా చూడబోతున్నామన్న ఆనందంతోపాటు, చూసితీరాలన్న కసి క్రికెట్ ప్రేమికులకు ఉండటం సహజం. ఈ దురదృష్టకర ఘటన జరగడానికి కనీసం నాలుగైదుగంటల ముందునుంచే పరిస్థితులు చేజారిపోతున్నాయని, పట్టరాని జనసంఖ్యతో నిర్వహణ మీద పట్టుకోల్పోతున్నామని పాలకులకు తెలియకుండా ఉండదు. స్టేడియం తలుపులు మూసినంతమాత్రాన ప్రవాహం నిలిచిపోదు. వినోదం కోసం వచ్చినవారు చివరకు భీతిల్లిన మొహాలతో ప్రాణాలు ఉగ్గబట్టుకొని ఎటూకదల్లేని దుస్థితికి చేరుకున్నారు. తొక్కిసలాట గురించి తెలిసి కూడా నాయకులు నటించారు, క్రీడాకారులు నవ్వు చెరగకుండా జాగ్రత్తపడ్డారు.

ఐపిఎల్ విజేతల సన్మాన కార్యక్రమాన్ని అత్యంత భారీగా, బహిరంగంగా నిర్వహించాలన్న ఆలోచన వెనుక రెండు రాష్ట్రాల, రెండు భాషల, రెండు రాజకీయపార్టీల పోటీ పనిచేసిందని కొందరంటారు. నిజానిజాలు అటుంచితే, కాస్తంత ప్రణాళికతో, మానవత్వంతో, అనవసరపు ఆర్భాటాలు, ప్రచారాలకు దూరంగా, నిబంధనలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించివుంటే అది కచ్చితంగా విజయవంతమయ్యేది, ట్రోఫీతోపాటు, ఇదీ అభిమానుల మనసుల్లో నిలిచిపోయేది.

సిందూర్: ఐక్యతా స్వరాలు, విరుద్ధ వాదాలు



వర్తమాన భారత రాజకీయాలు నిష్పాక్షికత కంటే పక్షపాతానికి ప్రాధాన్యమిస్తున్న మీడియా ధోరణులకు అనుగుణంగా నడుస్తున్నాయి. మరి మన ప్రజా జీవితంలో అర్థవంతమైన సంవాదాలకు ఆస్కారం క్రమేపీ తగ్గిపోతుండడంలో ఆశ్చర్యమేముంది? ఆపరేషన్ సిందూర్ మన నాయకులను అన్య దేశాలలోని ఆరోగ్యకరమైన వాతావరణంలో ఏకం చేసి ఉండవచ్చుగాని స్వదేశంలో మనం ఎప్పటి మాదిరిగానే ఐక్యత లేకుండా పరస్పరం ఘర్షించుకుంటూ వ్యతిరేక సమూహాలుగా ఉండిపోతున్నాం.

భారత జాతీయవాది అసదుద్దీన్ ఒవైసీ! మితవాద రాజకీయ శ్రేణులు ఇప్పుడు ఆయన్ను ఆ విధంగా గౌరవిస్తున్నాయి. హిందుత్వవాదుల నుంచి ఒవైసీకి ఆ ఆదరణ లభించేందుకు భయానక పహల్గాం ఉగ్రదాడి, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా 87 గంటలపాటు భారత్ సైనిక చర్య అవసరమయ్యాయి. ఒవైసీ రాజకీయాలు 'జాతి–వ్యతిరేక'మైనవిగా భారతీయ జనతా పార్టీ చాలా సంవత్సరాలుగా నిందిస్తోంది. ఆయన తన విలక్షణ మత అస్తిత్వాన్ని తాను నిత్యం ధరించే షేర్వాణీతో చాటుతున్నారు. భారతీయ ముస్లింలు భిన్నమైనవారు, అన్యులు అనే మనోవైఖరి, సైద్ధాంతిక విశ్వాసంతో వ్యవహరించే వారి రాజకీయాలు ఒవైసీని ఒక 'శత్రువు'గా పరిగణించాయి. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద ఘాతుకాలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ వేదికలపై భారత్ వాదనను ఘంటాపథంగా వినిపిస్తున్న అదే అసదుద్దీన్ ఒవైసీని 'దేశభక్తుడు'గా హిందుత్వ వర్గాలు నేడు కొనియాడుతున్నాయి. స్ఫుటంగా మాట్లాడే హైదరాబాద్ ఎంపీ రాజకీయాలు నిజానికి మారలేదు: గతంలో ఆయన చాలాసార్లు పాకిస్థాన్‌ను, 'ద్వి జాతి' సిద్ధాంతాన్ని తీవ్రంగా విమర్శించారు. బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించే ముస్లిం నాయకుడుగా ప్రఖ్యాతుడైన ఒవైసీని ముస్లింల సంకీర్ణ ప్రయోజనాల వకాల్తాదారుగా ముద్రవేయడం చాలా తేలిక. అయితే ఇప్పుడు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ వాదనను ప్రపంచానికి వినిపించడాన్ని ఆయన మౌలిక రాజకీయ వైఖరులలో వచ్చిన మార్పుగా కాకుండా పహల్గాం అనంతర రాజకీయ వాతావరణానికి అనుగుణ్యమైనదిగా భావించాలి. మరి ఈ రాజకీయ పరిస్థితులు ఇంట (స్వదేశం) విభజనలు, మితిమీరిన పక్షపాతంతో కొనసాగుతుండగా బయట (విదేశాలు) సమైక్యత, ఏకాభిప్రాయం ప్రాతిపదికన ఉన్నాయి.

హోం మంత్రి అమిత్ షా ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో చేసిన వ్యాఖ్యలను పరిశీలించండి. ఆపరేషన్ సిందూర్‌పై మమతా బెనర్జీ ప్రభుత్వం 'ఓటుబ్యాంకు రాజకీయాలు' చేస్తోందని ఆయన ఆరోపించారు. పాకిస్థాన్‌తో మోదీ ప్రభుత్వ 'యుద్ధాన్ని' చాలా ఇతర పార్టీల వలే తృణమూల్ కాంగ్రెస్ కూడా సమర్థిస్తోంది. కోల్‌కతాలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో అమిత్ షా ప్రసంగిస్తుండగా ఆ పార్టీ ఎంపీ అభిషేక్ బెనర్జీ అఖిలపక్ష ప్రతినిధి బృందం సభ్యుడుగా తూర్పు ఆసియాలో పాకిస్థాన్ సైనిక రాజ్యంపై మాటల పిడుగులు వర్షిస్తున్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ఒక ఏడాదిలో జరగనున్న నేపథ్యంలో మమత సర్కార్‌పై అమిత్ షా విమర్శనాత్మక వ్యాఖ్యలు రాబోయే ఎన్నికలకు సమర శంఖాన్ని పూరించడమేనని కచ్చితంగా చెప్పవచ్చు. అవిశ్రాంత రాజకీయవేత్త అయిన అమిత్ షా ప్రచార కార్యక్రమాలలో పాల్గొనేటప్పుడు హోం మంత్రికి తక్కువ, బీజేపీ కార్యకర్తకు ఎక్కువగాను వ్యవహరిస్తుంటారు.

ప్రధాన జాతీయ ప్రతిపక్షమైన కాంగ్రెస్‌లో గందరగోళ పరిస్థితులనూ చూడండి. పహల్గాం ఘటన సంభవించిన వెన్వెంటనే దేశ ప్రయోజనాలను పరిరక్షించేందుకు మోదీ ప్రభుత్వం చేపట్టే ఏ చర్యకు అయినా 'సంపూర్ణ మద్దతు'నిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. తిరువనంతపురం నుంచి నాలుగుసార్లు ఎన్నికైన పార్టీ ఎంపీ శశి థరూర్ ఆపరేషన్ సిందూర్‌ను బలపరిచిన వెంటనే స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన్ను బీజేపీ 'అగ్రగామి ప్రతినిధి' అని ఆక్షేపించారు. అసాధారణ వాక్పటిమ ఉన్న థరూర్ అమెరికాను సందర్శించిన మరో అఖిలపక్ష ప్రతినిధి బృందం నాయకుడుగా వ్యవహరించారు. పాకిస్థాన్‌తో కాల్పుల విరమణకు భారత్‌ను తానే ఒప్పించానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వైట్ హౌజ్‌లోను, విదేశీ పర్యటనల్లోనూ పదే పదే చేస్తున్న వాదనలను వాషింగ్టన్‌లో శశిథరూర్ ఖండిస్తున్న సమయంలోనే భోపాల్‌లో కాంగ్రెస్ ర్యాలీలో రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ అమెరికా ఒత్తిడికి నరేంద్ర మోదీ లొంగిపోయి, కాల్పుల విరమణకు అంగీకరించినట్టు ఆరోపించారు. పార్టీ అగ్రనేతల పరస్పర విరుద్ధ ప్రకటనలు కాంగ్రెస్ కార్యకర్తల్లో తీవ్ర అయోమయాన్ని సృష్టించాయి.

పాలకపక్షం బీజేపీ వైనాన్ని చూద్దాం. ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించినప్పుడు కాంగ్రెస్‌ను అధిక్షేపిస్తూ, ముంబైపై ఉగ్రదాడుల సందర్భంలో దేశ ప్రజలను రక్షించడంలో మన్మోహన్ సింగ్ విఫలమయ్యారని, ఆయన ఒక 'బలహీన' ప్రధానమంత్రి అని అపహసిస్తున్న వీడియో నొకదాన్ని బీజేపీ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ విడుదల చేసింది. వాచాలుడైన ఆ పార్టీ ఎంపీ నిశికాంత్ దూబే అఖిలపక్ష ప్రతినిధి బృందం సభ్యుడుగా విదేశాల్లో పర్యటిస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రధాన మంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ నాటినుంచీ 'భారత్ ప్రయోజనాలను విక్రయించారని' ఆరోపిస్తూ కటువైన ట్వీట్‌లు పోస్ట్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఒక 'గద్దర్ (దేశ ద్రోహి)' అని రాహుల్‌గాంధీ ఒక 'పాకిస్థానీ ఏజెంట్' అని దుయ్యబడుతూ బీజేపీ మీడియా విభాగం పదే పదే కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగా విమర్శనాస్త్రాలు సంధించింది.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

విదేశాలలో మాతృభూమి తరఫున దీక్షాదక్షతలతో వాదిస్తూ స్వదేశంలో ఐకమత్యాన్ని నిమజ్జనం చేసి, మర్యాద, ఔచిత్యం లేకుండా పరస్పర విరుద్ధ వాదనలతో పెట్రేగిపోతున్న రాజకీయ వాతావరణాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఈ వ్యవహారంలో ప్రధాన వ్యక్తులు అయిన ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడే ఈ అసంబద్ధ రాజకీయాలకు కీలక కారకులు. వారిదే ప్రథమ బాధ్యత, సందేహం లేదు. పరస్పర గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకోవడం మరచిపోయి, ప్రధాని మోదీ, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పరస్పరం పూర్తి తృణీకార భావంతో ప్రవర్తిస్తున్నారు. గాంధీ కుటుంబాన్ని కించపరిచేందుకు ప్రధానమంత్రి ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోవడం లేదు. తరచు ముతక భాషలో దూషిస్తున్నారు. మోదీ పట్ల కాంగ్రెస్ నాయకుడు అంతకంటే తీవ్ర తిరస్కార భావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమంత్రి పదవినధిష్ఠించేందుకు మోదీ అనర్హుడనే భావన రాహుల్ మాటల్లో స్పష్టంగా ద్యోతకమవుతోంది. అగ్రనాయకులు ఇంత అనాగరికంగా వ్యవహరిస్తున్నప్పుడు వారి అనుయాయులు భిన్నంగా ఎలా ప్రవర్తిస్తారు?

భారత ప్రజాస్వామ్య సంస్థాగత దృఢత్వం క్షీణించడం రెండో కారణం. ఫలితంగా కనీసమాత్రంగానైనా ప్రజాస్వామిక జవాబుదారీతనం మృగ్యమైపోతోంది. పార్లమెంటునే తీసుకోండి. గత దశాబ్దంలో ఈ మహోన్నత సంస్థను ఒక నోటీస్ బోర్డ్‌గా అధికార పక్షం కుదించివేయలేదూ? ప్రభుత్వ ప్రతినిధులు కీలక అంశాలపై ప్రతిపక్ష సభ్యులతో అర్థవంతమైన చర్చలు జరుపుతున్నారా? ఎవరినీ సంప్రదించకుండా పార్లమెంటులో బిల్లులు ప్రవేశపెట్టడం, వాటిపై చర్చ దాదాపుగా లేకుండానే ఆమోదించడం జరుగుతోంది. వివాదాస్పద అంశాలను ప్రస్తావించేందుకు అనుమతించరు. చైనా చొరబాట్లపై చర్చకు నోటీస్ ఇస్తే వెన్వెంటనే తిరస్కరించారు. ఆపరేషన్ సిందూర్‌పై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తే ప్రధానమంత్రి దానికి గైర్హాజరయ్యారు. పహల్గాం అనంతర పరిస్థితులపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్న అభ్యర్థనను ఆమోదించేందుకు ప్రభుత్వం ససేమిరా అంటోంది. చర్చను నిరాకరిస్తే ప్రజాస్వామ్యం ఎలా బలపడుతుంది?

మీడియా నిర్వహిస్తోన్న పాత్ర మూడో కారణం. పలు మీడియా సంస్థలు వ్యవహరిస్తున్న తీరుతెన్నులను నిశితంగా పరీక్షించి తీరాలి. ప్రభుత్వానికి లౌడ్ స్పీకర్‌గా మారి, ప్రతిపక్షాలను నిరంతరం నిర్దయగా ప్రశ్నిస్తుంటే జాతీయ అంశాలపై సంభాషణ సమరీతి అవకాశాలతో సంయమనంతో, నిష్పాక్షికంగా జరగడం సాధ్యమేనా? ఆపరేషన్ సిందూర్‌పై ప్రభుత్వాన్ని ఇబ్బందికరమైన ప్రశ్నలు అడగడానికి మీడియా ప్రయత్నించనే లేదు. ప్రయత్నించకపోగా ప్రభుత్వ ప్రచారాన్ని విపులీకరించడమే తన విధ్యుక్తధర్మంగా భావించింది. మరి యుద్ధం తొలి దశలో మన వాయుసేనకు నష్టాలు వాటిల్లాయన్న వాస్తవాన్ని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ తొలుత దేశ ప్రజలకు చెప్పకుండానే సింగపూర్‌లో విదేశీ మీడియా ప్రతినిధుల ఎదుట అంగీకరించడంలో ఆశ్చర్యమేముంది? దేశీయ మీడియా విశ్వసనీయతను కోల్పోవడం సమాచార శూన్యతను సృష్టిస్తోంది. ఈ పరిణామం ప్రజాప్రయోజనాల పరిరక్షణకు దోహదం చేయదు. జాతీయ భద్రతకు సంబంధించిన వాస్తవాలను తెలుసుకోవడం ప్రజల హక్కు. వారికి తప్పుడు సమాచారమివ్వడం క్షమించరాని నేరం.

తరచు కలహశీలంగా పరిణమిస్తూ ప్రజల ఉమ్మడి సమస్యల పరిష్కారంపై ఏకాభిప్రాయం కొరవడేలా చేస్తున్న మన రాజకీయాల సరళికి ఒక ప్రధాన కారణం సామాజిక మాధ్యమాల ప్రమాదకర ప్రభావమే. నియమ నిబంధనలు, అడ్డూ అదుపూ లేని ఈ అధునాతన భావ ప్రసార వేదికలు అబద్ధాల వెల్లువకు, దుర్భాషల దాడులకు ఆలంబనగా వర్ధిల్లుతున్నాయి. బహిరంగ చర్చల్లో సావధానత, సభ్యత కనీసమాత్రంగానైనా ఉండేందుకు శ్రద్ధ చూపని సోషల్ మీడియా ప్రజాభిప్రాయాన్ని ప్రబలంగా ప్రభావితం చేస్తున్న కాలంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ప్రప్రథమంగా చోటుచేసుకున్న యుద్ధమే ఆపరేషన్ సిందూర్. ఎలాంటి ఆంక్షలు లేని ఈ ప్రభావదాయక సామాజిక మాధ్యమాలు తీవ్ర స్వరాలు, దురుసు అభిప్రాయాలే అందరినీ ఆకట్టుకునేలా చేస్తుండగా సంయమన స్వరాలు భిన్న భావ రీతులు అంతకంతకూ ప్రాముఖ్యం కోల్పోతున్నాయి. బిగ్గరగా అరచుకోవడం, పరస్పరం తిట్టుకోవడమే పరమప్రమాణంగా చర్చలు జరుగుతున్నాయి. సంచలనశీలతే ఆమోదయోగ్యమైనప్పుడు వివేకశీల, అర్థవంతమైన చర్చలు ఎవరు కోరుకుంటారు? వర్తమాన భారత రాజకీయాలు నిష్పాక్షికత కంటే పక్షపాతానికి ప్రాధాన్యమిస్తున్న మీడియా ధోరణులకు అనుగుణంగా నడుస్తున్నాయి. మరి మన రాజకీయాలలో అర్థవంతమైన సంవాదాలకు ఆస్కారం క్రమేపీ తగ్గిపోతుండడంలో ఆశ్చర్యమేముంది? ఆపరేషన్ సిందూర్ మన నాయకులను అన్య దేశాలలోని ఆరోగ్యకరమైన వాతావరణంలో ఏకం చేసి ఉండవచ్చుగాని స్వదేశంలో మనం ఎప్పటి మాదిరిగానే ఐక్యత లేకుండా పరస్పరం ఘర్షించుకుంటూ వ్యతిరేక సమూహాలుగా ఉండిపోతున్నాం. ఎంత బాధాకరం!

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

రైతుకు కావల్సింది
సానుభూతి కాదు.. సహాయం

'రైతే రాజు', 'రైతు దేశానికి వెన్నెముక' ఇది దేశానికి ఆహార భద్రత ఇస్తున్న రైతన్నల గురించి తరచుగా వినిపించే ప్రశంసలు. అయితే రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలు సక్రమంగా వారికి అందుతున్నాయా? అసలు వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమం ఒక్కటేనా? అనే సందేహం వాస్తవ పరిస్థితులను గమనిస్తే కలుగుతోంది. భారత దేశ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 17 కోట్ల 43 వేల కుటుంబాలలో... 9 కోట్ల 30 లక్షల 94 వేల కుటుంబాలు (54 శాతం) వ్యవసాయ కుటుంబాలు. దేశంలో వ్యవసాయ కుటుంబానికి సగటున ఉన్న భూమి 0.876 హెక్టార్లు మాత్రమే. ఇంత చిన్న కమతాలతోనే దేశ ఆర్థికాభివృద్ధికి వెన్నుదన్నుగా నిలుస్తున్నాడు రైతన్న. భారత జీడీపీలో 2010లో 17 శాతంగా ఉన్న వ్యవసాయం వాటా, 2024 నాటికి 18.2 శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయాధార కుటుంబాలు 2016–17లో 48 శాతం నుంచి 2021–22నాటికి 56శాతానికి పెరిగాయి. 2018లో మొత్తం ఉపాధిలో 42శాతం ఉన్న సాగు రంగం వాటా, 2024 నాటికి 48శాతానికి పెరిగింది. వ్యవసాయం అభివృద్ధి చెందుతూనే ఉంది, దిగుబడి స్థాయి పెరుగుతోంది. కానీ ఎండనకా వాననకా శ్రమించి, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని పంటలు పండించి, దేశానికి ఆకలి తీర్చే అన్నదాతల ఆర్థిక స్థితి ఎందుకు నానాటికీ దిగజారిపోతోంది?

దేశంలోని వ్యవసాయ కుటుంబాల్లో సగానికి పైగా (50.2 శాతం) అప్పుల్లో కూరుకుపోయి ఉన్నాయని ఎన్ఎస్ఎస్ సర్వే 2019 చెప్తోంది. జాతీయ స్థాయిలో 2012–13లో ఒక్కో వ్యవసాయ కుటుంబం సగటు అప్పు రూ.47,000గా ఉంటే, ప్రస్తుతం అది రూ.74,121కి పెరిగింది. వ్యవసాయ కుటుంబాలకున్న భూమి విస్తీర్ణాన్ని బట్టి ఆయా కుటుంబాల ఆదాయాల్లో చాలా వ్యత్యాసాలు ఉన్నాయి. అతి తక్కువ భూమి ఉన్న కుటుంబాల సగటు నెలసరి ఆదాయం రూ.7,500గా ఉంటే, పది హెక్టార్లకు పైబడి ఉన్న కుటుంబాల సగటు నెలసరి ఆదాయం రూ.61,000 వరకూ ఉంది. 2012–13లో వ్యవసాయ కుటుంబాల సగటు నెలసరి ఆదాయం రూ.6,426గా ఉంటే, 2018–19 నాటికి అది రూ.10,218కి పెరిగింది. అదే సమయంలో వ్యవసాయ అప్పులు కూడా 59 శాతం పెరిగాయి. ఇక మొత్తం 28 రాష్ట్రాల్లో 11 రాష్ట్రాల్లో వ్యవసాయ కుటుంబాల సగటు అప్పులు జాతీయ సగటు కన్నా అధికంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, కేరళ, పంజాబ్ రాష్ట్రాలలో వ్యవసాయ కుటుంబాల సగటు అప్పు రూ.2 లక్షల కన్నా అధికంగా ఉంటే, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లో రూ. లక్ష కన్నా ఎక్కువ ఉంది. గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్నా కూడా విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు తదితరాల అధిక ఖర్చుల కోసం ఎక్కువ వడ్డీకి వ్యాపారుల వద్ద ఋణం తీసుకుని నిండా మునిగిపోతున్నారు. భారతదేశంలో మొత్తం అప్పుల్లో దాదాపు 70 శాతం బ్యాంకులు, కోఆపరేటివ్ సొసైటీల నుంచి తీసుకున్నవి కాగా, 20 శాతం మాత్రమే వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్నవి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో 47 శాతం అప్పులు, తెలంగాణలో 50 శాతం అప్పులు వడ్డీ వ్యాపారుల నుంచి చేసినవే కావటం ప్రమాదకర పరిణామం. ప్రకృతి విపత్తులు, పండిన పంటకు గిట్టుబాటు ధర దక్కక, పేరుకుపోతున్న అప్పుల భారాన్ని మోయలేక దేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 16 వేల మంది రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.



రైతు భూమిని నమ్ముకుంటాడు కానీ అమ్ముకోడు. ఆర్థిక ఇబ్బందులను, ఆకలిని భరిస్తాడు గాని స్వాభిమానానికి భంగం కలిగితే సహించలేడు. వ్యవసాయ అభివృద్ధి, రైతు భరోసా లేకపోవడానికి కారణాలు అధ్యయనం చేసిన ప్రభుత్వాలు రైతన్నల సంక్షేమానికి సత్వర చర్యలు తీసుకోవడం లేదు. ఆరుగాలం శ్రమించి దేశానికి ఆహార భద్రత కల్పించే కృషీవలులకు ఆర్థిక భద్రత, ఆత్మగౌరవం కల్పించాల్సిన ఆవశ్యకత, బాధ్యత ప్రభుత్వం మీద ఉంది.

రైతు ఎంత కష్టపడి పండించినా, చివరికి అతని మెడకు ఉరి, కుటుంబానికి అప్పు మాత్రమే మిగులుతున్నాయి. ఎందుకంటే పండించేది రైతు అయితే, లాభం గడించేది మాత్రం మధ్యవర్తులే. ఉత్పత్తి చేసే రైతు నుంచి రిటైలర్ వరకు ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ఆర్బీఐ కోసం ఓ నిపుణుల బృందం చేసిన అధ్యయనం ప్రకారం అన్నదాతలకు రూపాయిలో 33 నుంచి 37 పైసలు మాత్రమే దక్కుతోంది. రూపాయిలో 63 నుంచి 67 పైసల వరకు దిగుబడులు కొనుగోలు చేసే ట్రేడర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైలర్ల కమిషన్లు, రవాణా, నిల్వ ఛార్జీలు, లోడింగ్, అన్‌లోడింగ్ రూపంలో పోతోంది. అనేక వ్యవసాయ ఉత్పత్తులను వినియోగదారులు అధిక ధర చెల్లించి కొంటున్నా, మధ్యదళారులే లాభపడి రైతులు దగా పడుతున్నారు. ఇక ప్రభుత్వం నుండి రైతులకు అందే సాయం కూడా పక్కదారి పడుతోంది. కేంద్ర ప్రభుత్వ ఎన్.సి.ఆర్.బి నివేదిక ప్రకారం 1993 నుండి 2018 వరకు ప్రభుత్వ వ్యవసాయ సబ్సిడీలలో సింహభాగం రైతులకు కాకుండా విత్తనాలు, ఎరువుల ఉత్పత్తిదారులు, డీలర్లకు దక్కింది.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలంటే ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించి తీరాలి. డా. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం భూమి విలువ, కౌలు ధరతో సహా పంటల సమగ్ర ఉత్పత్తి వ్యయాన్ని లెక్కించి అదనంగా 50 శాతం (సి3+50) కలిపి కనీస మద్దతు ధర ఇవ్వాలి. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలను సరళతరం చేయాలి. వ్యవసాయ అభివృద్ధి, పరిశోధన పైన స్థూల వ్యవసాయ దేశీయోత్పత్తిలో భారత్ వెచ్చిస్తున్న 0.4 శాతం వ్యయాన్ని (ఇతర దేశాలు 1–2 శాతం) గణనీయంగా పెంచాలి. ఆధునిక సాంకేతికతలతో భారతీయ వ్యవసాయాన్ని రూపాంతరం చెందించడానికి అగ్రిస్టాక్, సేద్య నిర్ణయాల సహాయ వ్యవస్థలు మూలస్తంభాలుగా రూపొందుతున్న కేంద్రం 'డిజిటల్ అగ్రికల్చర్ మిషన్' ప్రాజెక్టును రాష్ట్రాలు వెంటనే చేపట్టాలి. డిజిటల్ పంటల సర్వే, రైతు గుర్తింపు కార్డులు తదితరాలు బృహత్తర డేటాబేస్ అయిన అగ్రిస్టాక్ డేటా ఆధారిత డిజిటల్ వ్యవసాయానికి పునాది అవుతుంది. కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వ్యవసాయ ఉపగ్రహ సమాచారం, డ్రోన్ల వినియోగానికి వీలు కల్పించే 'కిసాన్ సువిధ' యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. దేశ సాగు రంగంలో సుమారు 90శాతం ఉన్న చిన్న కమతాలను ఆధునిక సేద్యంలోకి తీసుకువచ్చి అధిక దిగుబడులు సాధించడానికి ప్రభుత్వాలు ఆర్థికంగా, సాంకేతికంగా అండదండలివ్వాలి. రైతులు సంఘటితంగా తమ పంటలను గిట్టుబాటు ధరలకు విక్రయించడానికి, ఎరువులు, విత్తనాలు, ఆధునిక సేద్య పరికరాలు తదితరాలు తక్కువ ధరలకు అందుబాటులోకి తేవడానికి ఎఫ్‌పీఓల సేవలను వినియోగించుకోవాలి.

రైతు భూమిని నమ్ముకుంటాడు కానీ అమ్ముకోడు. ఆర్థిక ఇబ్బందులను, ఆకలిని భరిస్తాడు గాని స్వాభిమానానికి భంగం కలిగితే సహించలేడు. వ్యవసాయ అభివృద్ధి, రైతు భరోసా లేకపోవడానికి కారణాలు అధ్యయనం చేసిన ప్రభుత్వాలు రైతన్నల సంక్షేమానికి సత్వర చర్యలు తీసుకోవడం లేదు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతూ "అభివృద్ధికి మొదటి ఇంజన్ వ్యవసాయం" అన్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మాటలు నిజం కావాలంటే ఆరుగాలం శ్రమించి దేశానికి ఆహార భద్రత కల్పించే కృషీవలులకు ఆర్థిక భద్రత, ఆత్మగౌరవం కల్పించాల్సిన ఆవశ్యకత, బాధ్యత ప్రభుత్వం మీద ఉంది.

● లింగమనేని శివరామప్రసాద్
రాజకీయ, సామాజిక విశ్లేషకులు


యాభైయ్యేళ్ల 'ప్రుడెన్షియల్ కప్'

అది జూన్ 7వ తేదీ 1975. లండన్‌లో క్రికెట్ ప్రపంచానికి మక్కాగా కొనియాడబడే లార్డ్స్ మైదానంలో ఉదయం పది గంటలకు భారత మీడియం పేసర్ మదన్‌లాల్, ఇంగ్లండ్ ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ జాన్ జేమ్సన్‌కు తొలి బంతిని విసిరాడు. అర్ధ శతాబ్దం క్రితం వేసిన ఆ తొలి బంతి, రెండవ బంతికి బ్యాట్స్‌మన్ తీసిన తొలి పరుగు ప్రపంచ కప్ క్రికెట్ చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి తెర లేపాయి. జూన్ 1975లో ఇంగ్లండ్ వేదికగా జరిగిన ప్రథమ క్రికెట్ ప్రపంచ కప్ టోర్నమెంట్– ప్రుడెన్షియల్ కప్ పోటీగా కూడా ప్రసిద్ధమైంది. ఆ టోర్నమెంట్‌లో తొలి మ్యాచ్ ఇంగ్లండ్–ఇండియాల మధ్య జరిగింది. క్రికెట్ చరిత్రను మలుపు తిప్పిన ఆ టోర్నమెంట్‌కు ఏభై ఏళ్ళు నిండిన సందర్భంగా దాని విశేషాలను ఒక్కసారి సింహావలోకనం చేసుకోవలసిన అవసరం ఉంది.

ఈఎస్‌పిఎన్, క్రిక్‌ఇన్ఫోలో 'ది బర్త్ ఆఫ్ ది వరల్డ్ కప్' వ్యాసంలో మార్టిన్ విలియమ్‌సన్ 1975 ప్రుడెన్షియల్ క్రికెట్ ప్రపంచ కప్ పోటీల నేపథ్యాన్ని చక్కగా వివరించాడు. 1972 లోనే ఐసీసీ వార్షిక సమావేశంలో ప్రపంచ కప్ పోటీల ప్రతిపాదన సాధ్యాసాధ్యాలు పరిశీలించడానికి నియమితమైన కమిటీ, అప్పటికి క్రికెట్ సంబంధాలు లేని భారత్, పాకిస్థాన్ల అంగీకారం లభించగానే పనులు మొదలుపెట్టింది. ఆ సమావేశంలోనే టెస్ట్ అండ్ కౌంటీ క్రికెట్ బోర్డు (టీసీసీబీ) టెస్ట్ క్రికెట్‌లో అనధికార హోదా కలిగిన శ్రీలంకను, నాలుగు తూర్పు ఆఫ్రికా దేశాలైన ఉగాండా, కెన్యా, టాంజానియా, జాంబియాల సంయుక్త జట్టైన తూర్పు ఆఫ్రికాను పోటీలో భాగస్వాములను చేయడానికి నిర్ణయించింది. ఈ నిర్ణయంతో ఎనిమిది దేశాలు టోర్నమెంట్‌లో పాల్గొనడానికి మార్గం సుగమమయ్యింది. ఈ టోర్నమెంట్‌కు 'ప్రుడెన్షియల్ అష్యూరెన్స్' (ఆర్థిక సేవల సంస్థ) లక్ష పౌండ్ల ఆర్థిక సహాయాన్ని చేసి ప్రాయోజిత సంస్థగా వ్యవహరించింది. టోర్నమెంట్ వల్ల ఆదాయం రెండు లక్షల పౌండ్లు రాగా, ఒక్క ఫైనల్ మ్యాచ్ నుంచే అరవై ఆరు వేల పౌండ్ల లాభం వచ్చింది. మ్యాచ్ నిడివి 60 ఓవర్లు కాగా, బాట్స్‌మన్ తల పైనుండి దూసుకువెళ్ళే బంతి వైడ్‌గా పరిగణించాలన్న నిబంధనలు జోడించబడ్డాయి. అప్పటికింకా పిచ్‌కు ముప్ఫయ్ గజాల లోపు ఫీల్డర్‌ల సంఖ్యపై ఆంక్షలు లేవు.

మొదటి మ్యాచ్‌లో ఇంగ్లండ్–భారత్ తలపడ్డాయి. ఎస్. వెంకటరాఘవన్, మైక్ డెన్నిస్ కెప్టెన్లు. లక్షలాది భారత క్రికెట్ అభిమానులు బీబీసీ రేడియో కామెంట్రీకి చెవులప్పగించారు. ఇంగ్లండ్ భారీ స్కోర్ (334–4)లో డెన్నిస్ అమిస్ ప్రపంచ కప్ తొలి శతకాన్ని (137) నమోదు చేసాడు. సమాధానంగా భారత జట్టు 60 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసి ఘోరంగా ఓడిపోయింది. ఈ ఓటమికి తోడు భారత దిగ్గజ బాట్స్‌మన్ సునీల్ గవాస్కర్ 174 బంతులతో 36 పరుగులే చేసి ఓటమికే మచ్చ తెచ్చాడు. భారత ప్లేయర్లే కాక ప్రేక్షకులు, ఇతర దేశాల ప్లేయర్లు కూడా అతని విచిత్ర వైఖరికి విస్తుబోయారు. తనకు కెప్టెన్సీ దక్కలేదన్న ఉక్రోషంతోనే ఆ విధంగా బ్యాటింగ్ చేసాడనే విమర్శ క్రీడాప్రపంచంలో మారుమోగింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా భారత్ పేలవంగా ఆడి ఓడింది. పసికూనలయిన ఈస్ట్ ఆఫ్రికాపై మాత్రం విజయం సాధించింది. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగిన ఈ పోటీ నుంచి సెమీఫైనల్‌కు చేరకుండానే భారత్ నిష్క్రమించింది.

సంవత్సరంలో అత్యంత సుదీర్ఘ పగటికాలం నాడు (జూన్ 21) క్రికెట్ చరిత్రలో అత్యంత సుదీర్ఘమైన ప్రథమ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జరగడం విశేషమే. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా, విజేత జట్టు కెప్టెన్‌గా క్లైవ్ లాయిడ్, ప్రిన్స్ ఫిలిప్ నుంచి అందుకున్న ట్రోఫీని పైకెత్తి చూపుతుంటే లార్డ్స్ మైదానంలో ఉన్న 26 వేల మంది ప్రేక్షకులే కాక, టీవీ–రేడియోల ద్వారా మ్యాచ్‌ను ఆస్వాదించిన లక్షలాది క్రికెట్ అభిమానులు పులకించిపోయారు.



జూన్ 7 నుంచి 21 వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ టోర్నమెంట్‌లో వెస్టిండీస్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, ఇంగ్లండ్, న్యూజిలాండ్ హోరాహోరీగా పోరాడాయి. బాహుబలుల్లాంటి బ్యాట్స్‌మెన్‌లైన క్లైవ్ లాయిడ్, కాళీచరణ్, కన్‌హాయ్, ఫ్రెడ్రిక్స్ గ్రెగ్ ఛాపెల్, ఇయాన్ ఛాపెల్, డెన్నిస్ అమిస్, టోనీ గ్రెయిగ్, మజీద్ ఖాన్, ఆసిఫ్ ఇక్బాల్, జహీర్ అబ్బాస్, గ్లెన్ టర్నర్‌లు; బడబాగ్నుల్లాంటి ఆండీ రాబర్ట్స్, డెనిస్ లిల్లీ, జెఫ్ థామ్సన్, గిల్మోర్, రిచర్డ్ హ్యాడ్లీ, సర్ఫరాజ్ నవాజ్, జాన్ స్నోలు; స్పిన్ మాంత్రికులైన గిబ్స్, బేడీ, అండర్‌వుడ్‌లు; అలాగే వికెట్ కీపర్‌లైన రాడ్నీ మార్ష్, డెరెక్ మర్రే, వసీం బారి, అలెన్ నాట్‌లు తమ ప్రతిభా పాటవాలతో క్రికెట్ ప్రపంచాన్ని అలరించారు. ఐదు రోజుల టెస్ట్ నుంచి ఒక రోజు పరిమిత ఓవర్ల మ్యాచ్ వైపు ప్రస్థానానికి తొలి మెట్టయిన ఈ టోర్నమెంట్‌ను ప్రత్యక్షంగా లక్ష ఏభై ఆరు వేల మంది తిలకించగా, టీవీ–రేడియోల ద్వారా కన్నవారు, విన్నవారు కనీసం కోటి మంది ఉంటారని కొన్ని వర్గాల అంచనా.

జూన్ 21న లార్డ్స్‌లో అంతిమ విజయం కోసం వెస్టిండీస్, ఆస్ట్రేలియా కొదమసింహాల్లా తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ త్వరితగతినే మూడు వికెట్లు కోల్పోగా, కళ్లజోడు ధరించిన కెప్టెన్ క్లైవ్ లాయిడ్ ప్రళయకాల రుద్రుడిలా విజృంభించి 85 బంతుల్లో 102 పరుగులు చేసి నాయకత్వ పటిమను రుజువు చేసుకున్నాడు. అతను లిల్లీ బౌలింగ్‌లో హుక్ చేసిన సిక్సర్‌ను నేటికీ క్రికెట్ అభిమానులు మరచిపోలేదు. 291 పరుగుల లక్ష్యంతో దిగిన ఆస్ట్రేలియా బాట్స్‌మన్‌లు విజయం వైపు దూసుకువెళుతున్న ప్రతిసారి రిచర్డ్స్ గురిచూసి విసిరిన బంతులు వికెట్లను తాకి రనౌట్ కావడం ఆ జట్టు దురదృష్టానికి తార్కాణం. చివరి వరకూ థామ్సన్–లిల్లీలు పోరాడినా, 17 పరుగుల తేడాతో ఓటమి తప్పలేదు. ఆ మ్యాచ్ జరుగుతున్నంత సేపూ ప్రేక్షకుల్లో నల్ల జాతి వారి ఆనందానికి హద్దులు లేవు. లాయిడ్ అవుట్ అయి వెనుదిరుగుతుంటే యావత్ ఆస్ట్రేలియా ఆటగాళ్ల చప్పట్లతో ఆయనను అభినందించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన మ్యాచ్ రాత్రి 8.43 గంటలకు ముగిసింది. సంవత్సరంలో అత్యంత సుదీర్ఘ పగటికాలం నాడు (జూన్ 21) క్రికెట్ చరిత్రలో అత్యంత సుదీర్ఘమైన మ్యాచ్ జరగడం విశేషమే. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా, విజేత జట్టు కెప్టెన్‌గా ఆరడుగుల మూడించుల గ్రానైట్ విగ్రహం లాంటి క్లైవ్ లాయిడ్, ప్రిన్స్ ఫిలిప్ నుంచి అందుకున్న ట్రోఫీని పైకెత్తి చూపుతుంటే లార్డ్స్ మైదానంలో ఉన్న 26 వేల మంది ప్రేక్షకులే కాక, టీవీ–రేడియోల ద్వారా మ్యాచ్‌ను ఆస్వాదించిన లక్షలాది క్రికెట్ అభిమానులు పులకించిపోయారు.


ఆ టోర్నమెంట్‌లో ఆడిన ఎందరో హేమాహేమీలు నేటికీ జీవించి ఉన్నారు. వారిలో వెస్టిండీస్ స్పిన్నర్ లాన్స్ గిబ్స్ అందరికంటే పెద్దవాడు(90) కాగా, ఆ టోర్నమెంట్‌లో తొలిసారి ఆడిన 18 ఏళ్ల మియాందాద్ అత్యంత పిన్న వయస్కుడు. క్రికెట్ దశ దిశలను మార్చిన ఆ టోర్నమెంట్‌లో పాల్గొన్నందుకు వారంతా గర్విస్తారు. ఆ పోటీల విశేషాలను, వ్యాసాలను క్రికెట్ అభిమానులు స్పోర్ట్స్ వీక్, నైట్ వాచ్‌మాన్, క్రికెట్ క్వార్టర్లీ, ది ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా లాంటి పత్రికల నుంచే కాక, దినపత్రికల నుంచి సంగ్రహించి భద్రపరచుకున్నారు. ఇప్పటికీ ఆ తరంవారు యూట్యూబ్‌లో ఆ మ్యాచ్‌లను వీక్షించి మురిసిపోతుంటారు. ఇంతింతై వటుడింతై అన్నట్లు వ్యాపార, ప్రతిభ, సాంకేతికతల పరంగా క్రికెట్ ఎంత విస్తరించినా, ఎదిగినా అసలు సిసలైన క్రికెట్ అభిమానుల గుండెల్లో గూడు కట్టుకుని మధుర స్మృతిగా మిగిలింది 1975 ప్రుడెన్షియల్ కప్ పోటీ మాత్రమే.

■ కొట్టు శేఖర్
ప్రొఫెసర్, మిజోరాం యూనివర్సిటీ





- మంగినపూడి సముద్రతీరంలో సందడి
- ఆకట్టుకున్న పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలీరైడ్
- మొదటిరోజు తరలివచ్చిన పర్యాటకులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఫుడ్ స్టాల్స్



అమరావతి స్థూపాన్ని తలపించేలా గ్రాండ్ ఎంట్రన్స్

అలా మొదలైంది

మసులా బీచ్ ఫెస్టివల్ ప్రారంభం



బీచ్ ఫెస్టివల్‌కు తరలివస్తున్న పర్యాటకులు

అల్లంతదూరాన ఎగసి పడుతున్న అలలు.. ఆకాశాన ఎగిరిపోతున్న ప్యారామోటార్ అందాలు.. తీరాన జన కేరింతలు.. మచిలీపట్నంలోని మంగినపూడి తీరంలో మసులా బీచ్ ఫెస్టివల్ గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉదయపు వేడిగాలులను కాసేపు పక్కకునెట్టి పర్యాటకులు తీరంలో చల్లటి వాతావరణాన్ని ఆస్వాదించారు. సముద్ర జీవుల బొమ్మలు, అమరావతి ఐకానిక్ టవర్, వంద అడుగుల ఎత్తులో ఏర్పాటుచేసిన జాతీయ జెండా, బోట్ల రైడింగ్.. అబ్బో ఒక్కటేమిటి మనసును కట్టిపడేసేలా మసులా బీచ్ ఫెస్టివల్ మైమరపింపజేసింది. సీ ఫుడ్ స్టాల్స్‌తో పాటు వస్త్ర, కలంకారీ, కొండపల్లి కొయ్యబొమ్మలు, పిల్లల ఆట వస్తువులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారుల ఆటల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాలుగురోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్‌ను మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్ తదితరులు జెండా ఎగురవేసి ప్రారంభించారు. - మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి



6

ఉత్కంఠరేపిన కబడ్డీ పోటీలు



మంగినపూడి సముద్రతీరంలో స్నానాల సందడి



జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ఉత్సవాలను ప్రారంభించి సెల్యూట్ చేస్తున్న మంత్రులు కొల్లు, దుర్గేష్

నోయిడా టు బెజవాడ

గిఫ్టు ప్యాక్‌లో ఎండీఎంఏ డ్రగ్ సరఫరా

- హైదరాబాద్ చిరునామాలకు కొరియర్
- అక్కడి నుంచి విజయవాడకు..
- ఏడాది నుంచి సాగుతున్న వ్యవహారం
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న డీసీపీ సరిత, సెంట్రల్ ఏసీపీ దామోదర్ తదితరులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇప్పటి వరకు వివిధ రకాలుగా మాదకద్రవ్యాలను చేతులు మార్చుకున్న డ్రగ్స్ మాఫియా తాజాగా గిఫ్ట్ ఆర్టికల్స్‌పై దృష్టిపెట్టింది. ఒక బాక్స్‌లో మాదకద్రవ్యాలను పెట్టి, గిఫ్ట్‌బాక్స్‌లా పార్శిల్ చేసి గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుబడిన ముఠాను విచారణ చేయగా, ఈ గిఫ్ట్ కోణం వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలోని నోయిడా నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను కొరియర్ ద్వారా రప్పించుకుంటున్నారని తెలుసుకున్నారు. పోలీసులకు చిక్కిన మిగతా 6లో..

ఇదేం తీరు?

మల్లవల్లిలో ఏపీఐఐసీ అధికారుల ద్వంద్వనీతి

పనులు మొదలు పెట్టని సంస్థల భూ కేటాయింపుల పునరుద్ధరణ

- పనులు మొదలుపెట్టిన వారికి సమయం ఇవ్వకుండా నిర్లక్ష్యం
- వైసీపీ హయాంలో నానా ఇబ్బందులు పడిన పారిశ్రామికవేత్తలు
- పరిహారం ఇవ్వలేదని నాడు దారులు కూడా మూసేసిన రైతులు
- ప్రభుత్వం మారడంతో తాజాగా పనుల ప్రారంభించిన సంస్థలు
- ఈవోటీ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న ఏపీఐఐసీ

మల్లవల్లిలో పారిశ్రామికవేత్తల విషయంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐఐసీ) అధికారులు ద్వంద్వ విధానాన్ని అనుసరిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం.. వైసీపీ హయాంలో యూనిట్లకు రద్దు చేసిన భూ కేటాయింపులనే పునరుద్ధరిస్తున్నారు. కానీ, గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో భూ కేటాయింపులు పొంది, పనులు చేపడుతున్న సంస్థల విషయంలో మాత్రం ఏపీఐఐసీ అధికారుల తీరు సరిగ్గా లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్ (ఈవోటీ) ఇవ్వటంపై వివాదాలు రేగుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో మల్లవల్లి భూముల వ్యవహారాలు వివాదాస్పదమయ్యాయి. టీడీపీ ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమం కావటంతో మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో భూ సంబంధిత సమస్యలను నాటి వైసీపీ ప్రభుత్వం పరిష్కరించలేదు. దీంతో తమకు పరిహారం అందలేదన్న పేరుతో రైతులు పనులను జరగనీయలేదు. ఫలితంగా అప్పటికే పనులు మొదలుపెట్టిన పారిశ్రామికవేత్తలు నానా ఇబ్బందులు పడ్డారు. పారిశ్రామికవాడలోకి వెళ్లే



దారులను సైతం రైతులు మూసేశారు. పలు రోడ్లకు గండ్లు కొట్టారు. రైతులు చేసిన ప్రయత్నాలను అప్పట్లో పలువురు పారిశ్రామికవేత్తలు అడ్డుకున్నారు. ఇది మంచి పద్ధతి కాదంటూ అడ్డుగోడలను తొలగించి పనులు చేపట్టే ప్రయత్నం చేశారు. దీంతో పలువురు భూ బాధితులు పారిశ్రామికవేత్తలపై పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టే వరకు వ్యవహారం వెళ్లింది. కొందరు పారిశ్రామికవేత్తలు ఎస్సీ, ఎస్టీల కేసులు కూడా ఎదుర్కొన్నారు. మొదలుపెట్టిన పనులు పూర్తి చేయలేక ఐదేళ్ల పాటు నానా ఇబ్బందులు పడిన పారిశ్రామికవేత్తల విషయంలో ఏపీఐఐసీ అధికారులు మరోలా ప్రవర్తిస్తున్నారు.

ఈవోటీ తాత్సారమెందుకు?

ఉదాహరణకు రత్నం మోటార్స్ లిమిటెడ్ మల్లవల్లిలో వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల తయారీ యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చింది. రైతుల అవసరాలు చెబితే, పరిశోధనలు చేసి ఆ అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో అధునాతనమైన యంత్రాలను తయారు చేసి ఇస్తుంది. అతి తక్కువ ఖర్చుతో వ్యవసాయ పనిముట్లను సిద్ధం చేస్తుంది. ఈ సంస్థ తాము పొందిన స్థలంలో నాలుగు యూనిట్లను మిగతా 6లో..

తప్పు ఎవరిది?

వైసీపీ హయాంలో రైతులతో నెలకొన్న సమస్యలను పరిష్కరించటంలో ఏపీఐఐసీ అధికారులు సరిగ్గా వ్యవహరించలేదన్న విమర్శలు ఉన్నాయి. నాడు రైతులు కోర్టులను ఆశ్రయించగా, వారితో సంప్రదింపులు జరిపి సమస్యలను పరిష్కరించుకోమని న్యాయస్థానాలు సూచించినా కూడా అధికారులు అంతులేని నిర్లక్ష్యాన్ని చూపించారు. ఫలితంగా పారిశ్రామికవేత్తలు నానా ఇబ్బందులు పడ్డారు.

నందనవనం



ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో మంత్రి సత్యకుమార్ మొక్కలు నాటారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, కలెక్టర్ లక్ష్మీశ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

6

ప్రమాణస్వీకారం



కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నెట్టెం రఘురాం గురువారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని బ్యాంకు కార్యాలయంలో ఆయన్ను ఎంపీ కేశినేని శివనాథ్ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సభలో మంత్రి కొల్లు రవీంద్ర సహా పలువురు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

8

ఆ నగదు ఎక్కడ?

బంగారం శ్రీను ఇంట్లో పోలీసు సోదాలు

- బంగారం, వెండి తప్ప కనిపించని డబ్బు
- పోలీసుల విచారణలో నోరు మెదపని నిందితుడు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : బంగారం చీటీలు నిర్వహించి ఒక్కొక్కరి నుంచి లక్షల రూపాయలు వసూలు చేశాడు. నగదు చీటీల నిర్వహణలోనూ ఇదే చేశాడు. ఇప్పుడు ఆ డబ్బంతా ఎక్కడుందో తెలియట్లేదు. పోలీసులకూ చెప్పట్లేదు. ఇదీ బంగారం చీటీలు నిర్వహించి వందల మందికి కోట్ల రూపాయలు టోకరా వేసిన ముచ్చెర్ల శ్రీనివాసరావు వ్యవహారం. హైదరాబాద్‌లో తలదాచుకున్న శ్రీనివాసరావును అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతడ్ని నగరానికి తీసుకొచ్చి పోలీసు స్టేషన్‌లో గంటల తరబడి విచారణ చేశారు. పోలీసులు అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా శ్రీనివాసరావు సమాధానం మిగతా 6లో..

బారికేడ్‌ను బైకుపై లాక్కెళ్తున్న యువకులు, డివైడర్‌పై ఉన్న మొక్కలు లాగేస్తున్న యువకులు, అర్ధనగ్నంగా యువకుడి నృత్యం







అరాచక అభిమానం

నగరంలో రెచ్చిపోయిన ఆకతాయిలు

- ఆర్‌సీబీ విజయంతో రోడ్లపై హల్‌చల్
- బారికేడ్లను లాక్కెళ్లిన ఇద్దరు యువకులు
- డివైడర్‌పై మొక్కలు ధ్వంసం చేసి అసభ్య నృత్యాలు
- సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్
- ఇద్దరు యువకుల అరెస్టు.. రిమాండ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అభిమానం ముసుగులో అరాచకం సృష్టించారు. పైశాచికానందంతో మొక్కల్ని ముక్కలు చేశారు. క్రికెట్ టోర్నీలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు టీమ్ విజయం సాధించడంతో ఆకతాయి గ్యాంగ్‌లు గత మంగళవారం రాత్రి నగరంలో బీభత్సం సృష్టించారు. విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న కొంతమంది యువకులు డ్రగ్స్ తీసుకున్న వారిలా, మద్యం తాగిన వారిలా ప్రవర్తించారు. ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ మిగతా 6లో..

దారిలో దందా..!

జగ్గయ్యపేటలో జాతీయ రహదారిపై 'రవాణా' వసూళ్లు

రవాణా శాఖ అధికారుల దారి దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండాపోతోంది. అంతర్రాష్ట్ర రవాణా చెక్‌పోస్టుల ఎత్తివేతతో కాసుల రుచి మరిగిన కొందరు అధికారులు టోల్‌ప్లాజాలే కేంద్రంగా దోచుకు తింటున్నారు. పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలోని టోల్‌ప్లాజాల వద్ద ఈ దోపిడీ అధికంగా జరుగుతోంది. పొరుగు రాష్ట్రాల వాహనాలే లక్ష్యంగా చేసుకుని అందినకాడికి దండుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం.. ఒక్కో సమయంలో ఒక్కోలా బీట్లు వేసుకుని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు.

పొరుగు రాష్ట్రాల వాహనాలే టార్గెట్‌గా దోపిడీ

- ఆన్‌లైన్‌లో అయితే ఎక్కువ.. తమకైతే తక్కువ చాలని బేరాలు
- ఏకంగా ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని వసూలు
- కార్యాలయంలో కంటే జాతీయ రహదారిపైనే ఎక్కువసేపు



జాతీయ రహదారిపై వాహనాలు ఆపుతున్న ప్రైవేట్ వ్యక్తి. పక్కన కారులో ఎంవీఐ

జగ్గయ్యపేట రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి గేట్‌వేగా ఉన్న జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జాతీయ రహదారి రవాణా శాఖ అధికారులకు కల్పతరువుగా మారింది. ఆఫీసులో 3 గంటలు, జాతీయ రహదారిపై 6 గంటలు అన్నట్టుగా పనిచేస్తున్నారు. వేకువజాము నుంచే చేపడుతున్న వసూళ్లపర్వంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. పొరుగు రాష్ట్రాల వాహనాలనే టార్గెట్ చేసుకోవటంతో కాసుల వర్షం మిగతా 6లో..

రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు

8

యమకింకర.. కంకర!

- హెవీ లోడ్లతో హైవేలపై జారుతున్న కంకర
- రోజూ నాలుగైదు ట్రాక్టర్ల కంకర తొలగింపు



8

యోగాతో జీవితం ఆనందం

- బీఆర్‌టీఎస్ రోడ్డులో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ

8

కనకదుర్గమ్మకు రూ.4.11 కోట్ల ఆదాయం

6

రోహిణి సెగలతో చిర్రెత్తిపోయిన నగర ప్రజలకు సాగర తీరంలో ఏర్పాటు చేసిన 'మసులా ఫెస్ట్' సాంత్వన చేకూర్చింది. బీచ్ ఫెస్టివల్ తొలిరోజునే సందర్శకుల తాకిడితో మచిలీపట్నం మంగినపూడి కొత్త కళ సంతరించుకుంది. బీచ్‌లో స్టాల్స్, సముద్ర జీవుల బొమ్మలతో పిల్లల అల్లరి మధ్య తల్లిదండ్రులు అలసటను మరిచిపోయారు. యువత కేరింతలతో సాగర తీరం మురిసిపోయింది.



విద్యుత్ కాంతుల్లో అమరావతి గేట్ వే




బీచ్ ఫెస్టివల్‌లో సందర్శకుల ఆనందోత్సాహం



మైమరపించేలా.. మసులా ఫెస్ట్

- సందర్శకులతో మంగినపూడి బీచ్‌కి కొత్త కళ
- ఆకట్టుకుంటున్న స్టాల్స్.. కనువిందు చేస్తున్న ఆకృతులు
- నగరానికి చేరుకున్న 4వేలకు పైగా క్రీడాకారులు
- తొలిరోజు ఆకట్టుకున్న పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలిరైడ్

విజయవాడ/మచిలీపట్నం టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో ఏర్పాటు చేసిన అందమైన ఆకృతులు, బొమ్మలు, అమరావతి ఐకానిక్ టవర్, వంద అడుగుల జాతీయ జెండా, బోట్ల రైడింగ్‌తో సాగరతీరం ఆహ్లాదకరంగా మారింది. మొదటి రోజు బీచ్‌లో పర్యాటకుల సందడి మొదలైంది. సుమారు ఆరేళ్ల తర్వాత బీచ్ ఫెస్టివల్ ఏర్పాటుతో పర్యాటకులతో మంగినపూడి కళకళలాడింది. ఈ ప్రాంతం పర్యాటకంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న స్టాల్స్

మంగినపూడి బీచ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వస్త్ర, కలంకారీ, కొండపల్లి కొయ్యబొమ్మలు, పిల్లలకు ఆటవస్తువులకు సంబంధించి పలు స్టాల్స్‌తో పాటు సీ ఫుడ్స్ స్టాల్స్ పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.

సాగర తీరానికి కొత్త అందాలు తెచ్చిపెట్టాయి.

తొలిరోజు సందర్శకుల తాకిడి

ఇటీవల పర్యాటకుల తాకిడి లేకపోవడంతో వెలవెలబోయిన మంగినపూడి బీచ్ 'మసులా ఫెస్ట్' సందర్శకులతో కళకళలాడింది. గురువారం నుంచి ఫెస్టివల్ మొదలవడంతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటకులు తరలివస్తున్నారు. ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన ఎనభై అడుగుల అమరావతి ఐకానిక్ టవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

22 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు

సుమారు 4 వేల మంది క్రీడాకారులు 22 రాష్ట్రాల నుంచి ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్నారు. మరి కొంతమంది త్వరలో రానున్నారు. బీచ్‌క్రీడలను చూసేందుకు పర్యాటకుల తాకిడి గురువారం నుంచే మొదలైంది.



ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లను చేసింది. 2018లో మొదటిసారి బీచ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన టీడీపీ ప్రభుత్వం నాడు స్టాల్స్, గుర్రపు స్వారీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ముగించినా.. ఈసారి మరింత పురోగతి సాధించేలా ఆసక్తికరమైన క్రీడలను ఫెస్టివల్‌లో భాగం చేసింది. బీచ్ వాలీబాల్, కబడ్డీ, కనోయింగ్, బోట్ రైడ్ లాంటి క్రీడలతో పర్యాటకులను అలరించడానికి సిద్ధమైంది. గురువారం హెలికాప్టర్ రైడింగ్, పారా గ్లైడింగ్, స్పీడ్ బోటింగ్‌ను నిర్వహించగా.. కార్యక్రమాలు ముగిసేవరకూ పర్యాటకులు కదలకుండా చూస్తూ మైమరిచిపోయారు.

చిలకలపూడి బీచ్‌లో..

మసులా ఫెస్టివల్ నేపథ్యంలో మంగినపూడితో పాటు కూతవేటు దూరంలో ఉన్న చిలకలపూడి బీచ్‌కు సందర్శకులు పోటెత్తారు. దీంతో ఎప్పటి నుంచో కళావిహీనంగా ఉన్న చిలకలపూడి బీచ్‌కు మసులా పుణ్యమా అని కళకళలాడింది.




జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తాం

- మంత్రులు కొల్లు రవీంద్ర, దుర్గేష్

మచిలీపట్నం టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లాలోని మంగినపూడి బీచ్‌ను జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకుని వచ్చేలా, పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే మసులా బీచ్ ఫెస్టివల్‌ను అంగరంగ వైభవంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి, కందుల దుర్గేష్, మంత్రి రవీంద్రలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. 100 అడుగుల జాతీయ పతాకను మంత్రులు దుర్గేష్ ఆవిష్కరించారు. తమిళనాడు, రాజస్థాన్ కబడ్డీ జట్ల పోటీలను మంత్రి రవీంద్ర ప్రారంభించారు. గేట్‌వే ఆఫ్ అమరావతి ముఖ ద్వారాన్ని మంత్రులు ప్రారంభించారు. వివిధ సముద్రపు జీవుల ఆకృతులను తిలకించారు. కయాకింగ్, కనోయింగ్, జలక్రీడల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, కేంద్ర పర్యాటక వాఖా మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి కావలసిన నిధులు మంజూరు చేయమని అడిగామన్నారు. వివిధ ప్రాజెక్టుల డీపీఆర్‌లను రూపొందించామన్నారు. 2026 డిసెంబర్ నాటికి బందరు పోర్టు నిర్మాణం పూర్తవుతుందని, పోర్టు పాటు మంగినపూడి బీచ్ అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ మాట్లాడుతూ, మంగినపూడి బీచ్‌ను అభివృద్ధి చేసేందుకు హోటల్స్, రిసార్ట్స్‌ను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, బందరు పోర్టు అభివృద్ధితో పాటు బీచ్ అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, దేశంలో రెండో మునిసిపాలిటీ అయిన మచిలీపట్నంకు గత ప్రాభవాన్ని పునరుద్ధరించేందుకు మంత్రి రవీంద్ర కృషి చేస్తున్నారన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ, కూచిపూడి నాట్యానికి మరింత వన్నె తెచ్చేలా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తానా మాజీ చైర్మన్ కోన జయరామ్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆంధ్రకబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు ప్రభావతి, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, కుంచే నాని, మోటమర్రి బాబాప్రసాద్, కాగిత వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం యువగళం కార్యక్రమంలో 1250 మంది విద్యార్థులు వేసిన చిత్రపటానికి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును మంత్రి దుర్గేష్, కలెక్టర్ బాలాజీ ఆవిష్కరించారు. ఎస్పీ ఆర్ గంగాధరరావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నాట్యప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


బీచ్ ఫెస్టివల్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్





దుర్గమ్మ సేవలో రాష్ట్ర మంత్రులు

ఇంద్రకీలాద్రి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను గురువారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లు దర్శించుకున్నారు. వీరికి ఈవో వీకే శీనానాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనంకల్పించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం, లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

కనకదుర్గమ్మకు రూ.4.11 కోట్ల ఆదాయం



ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మవారికి హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఈవో శీనానాయక్ పర్యవేక్షణలో జరిగిన లెక్కింపు కార్యక్రమంలో ఏఈవోలు, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, దేవదాయ శాఖ సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌పిఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు. 22 రోజులకు గాను రూ.4,11,96,190లు నగదు రూపంలో, 394 గ్రాముల బంగారం, 8కిలోల10 గ్రాముల వెండి సమకూరాయి.

అన్నదాన సేవ పూర్వజన్మ సుకృతం : ఢిల్లీరావు

వన్‌టౌన్: అన్నదాన సేవ పూర్వజన్మ సుకృతమని, భగవంతుని సేవామార్గానికి అన్నదానం అత్యుత్తమమని వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా, తాడేపల్లిలోని విజయవాడ క్లబ్ రోడ్డులో గల ఆర్ఎల్ గౌతమి రివర్ బ్రీజ్ అపార్టుమెంట్ నివాసితులు ఎన్.ఎస్.వి.ప్రసాద్, నన్నపనేని రేవతి దంపతులు, అక్షయితి శ్రీహిత, నన్నపనేని కుటుంబసభ్యుల సహకారంతో తిరుమలలో నిత్యాన్నదాన పథకానికి పది మెట్రిక్ టన్నుల కూరగాయల వాహనానికి గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి : డీఆర్ఎం

రైల్వే స్టేషన్ : ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ అన్నారు. స్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన స్టేషన్‌లో వ్యర్థాలను తొలగిస్తూ పరిశుభ్రమైన వాతావరణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీఈఎం ఎం.కిషోర్, ఎన్విరాన్‌మెంట్ అండ్ హౌస్ కీపింగ్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ విభాగాల అధికారి ఎస్.వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ కార్యాలయంలో

కమిషనర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్ మల్లారపు నవీన్, జి.సూర్యసాయిప్రవీణ్ చంద్ మొక్కలు నాటారు. ఆఫీసు మేనేజ్‌మెంట్ డైరెక్టర్ వల్లభనేని శ్రీనివాసరావు హరితాంధ్ర అభివృద్ధికి తోడ్పడతామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

స్టార్ హోటళ్ల యాజమాన్యాల సంఘం ఏర్పాటు

వన్‌టౌన్: బందరు రోడ్డులోని ఓ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ (ఆశా) ఏర్పడింది. అసోసియేషన్‌కు విజయవాడ హయ్యత్ ప్లేస్ యజమాని ఆర్.వి.స్వామి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా కాకినాడకు చెందిన వెంకి రెసిడెన్సీ జేఎండీ చిట్టూరి ఎస్.మూర్తి, కోశాధికారికిగా విజయనగరానికి చెందిన ఎస్‌వీఎన్ లేక్ ప్యాలెస్ ఎండీ గుడిసె శివకుమార్, ఉపాధ్యక్షులుగా తిరుపతి తాజ్ బ్రిస్ ఎండీ బాలకృష్ణారెడ్డి, విశాఖకు చెందిన దసపల్లా గ్రూప్ జేఎండీ ఘట్టమనేని వెంకట్, జాయింట్ సెక్రటరీగా ఎలిగాంట్ ఎండీ పవన్ కార్తీక్ ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని హోటళ్లలో చక్కని ఆతిథ్యం పరిశుభ్రత విషయంలో ప్రమాణాలను పాటించాలన్నారు.

ఉపాధి బకాయిలు విడుదలపై హర్షం

వన్‌టౌన్: ఉపాధి హామీ బకాయిలు విడుదలపై రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర ఉపాధి హామీ మండలి సభ్యులు వీరంకి వెంకట గురుమూర్తి మొవ్వా లక్ష్మీసుభాషిణి కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కలతోనే మనుగడ

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ఇబ్రహీంపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మానవుల మనుగడకు మొక్కలే ఆధారం అని.. వాటిని నాటడంతో పాటు పరిరక్షించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొత్తూరు తాడేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడతామని నేతలు, అధికారులు ప్రతిజ్ఞ చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు నేటినుంచి ఆగస్టు 15వరకు ప్రతి ఒక్కరు తమ మాతృమూర్తి పేరిట మొక్కనాటి దానిని పరిరక్షించాలన్నారు. ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ, మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ జి.లక్ష్మీశ, పలుశాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే వసంత తదితరులు



ఘాట్ రోడ్డులో మొక్కలు నాటుతున్న ఈవో

ఇంద్రకీలాద్రిపై పూలమొక్కలు

- ఈవో శీనా నాయక్

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై ఆహ్లాదకరంగా కనిపించేలా రంగు రంగుల పూలమొక్కలు ఏర్పాటు చేస్తున్నామని ఈవో వీకే శీనానాయక్ తెలిపారు. దేవస్థానం ఘాట్‌రోడ్డులో 'వనం-మనం' పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘాట్ రోడ్డులో వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ వర్షాకాలంలో ఇంద్రకీలాద్రిపై ఔషధ మొక్కలు, దేవతావృక్ష మొక్కలు, నక్షత్ర, రాశులకు చెందిన మొక్కలు విస్తృతంగా నాటే ప్రక్రియ మొదలైందన్నారు. దేవస్థాన ప్రాంగణం ప్లాస్టిక్ రహితంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఆ నగదు ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

చెప్పలేదని తెలిసింది. అయోధ్యనగర్‌లోని లోటస్‌లో ఉంటున్న శ్రీనివాసరావు ఇంట్లో పోలీసులు రెవెన్యూ అధికారుల సమక్షంలో సోదాలు చేశారు. ఇంట్లో 18 కిలోల వెండి, 600 గ్రాముల బంగారం ఆభరణాలు ఉన్నట్టు గుర్తించారు. వాటిని సీజ్ చేశారు. శ్రీనివాసరావు వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. అనంతరం అతడ్ని ప్రిన్సిపల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. శ్రీనివాసరావు పోలీస్‌స్టేషన్‌లో ఉండగా, వాసవీ క్లబ్‌కు చెందిన పలువురు అక్కడికి చేరుకున్నారు.

ఆ డబ్బు ఎక్కడ?

బాధితులంతా పోలీసులను ఆశ్రయించిన తర్వాత ముచ్చెర్ల శ్రీనివాసరావు ఆడియో వాయిస్‌ను చీటీల గ్రూపులో పోస్టు చేశాడు. రెండు రోజుల్లో వచ్చి బాధితులకు సర్దుబాటు చేస్తానని సందేశం పంపాడు. ఇప్పుడు పోలీసులు ఇంట్లో సోదాలు చేయగా, డబ్బు ఏమీ కనిపించలేదు. డబ్బు ఎక్కడ దాచాడో కూడా శ్రీనివాసరావు చెప్పట్లేదు. డబ్బు గురించి అడిగినప్పుడు తన వద్ద ఏమీ లేదని చెప్పినట్టు సమాచారం. బాధితుల నుంచి వసూలు చేసిన డబ్బుతో వేర్వేరు ప్రాంతాల్లో స్థిరాస్తులను కుటుంబ సభ్యుల పేరు మీద కూడగట్టాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అలాగే, కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో భద్రపరిచాడా.. అనే అనుమానం కూడా వ్యక్తమవుతోంది. వ్యాపారంలో నష్టాలు ఎలా వచ్చాయని పోలీసులు వేసిన ప్రశ్నకు శ్రీనివాసరావు నోరు విప్పలేదని తెలుస్తోంది. వాస్తవానికి పోలీసులకు శ్రీనివాసరావు చిక్కకపోతే కుటుంబం సహా ఇతర రాష్ట్రాలకు పారిపోవడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. తర్వాత కోర్టులో లొంగుబాటు పిటిషన్ వేసుకుని పోలీసులకు చిక్కకుండా మార్గం సుగమం చేసుకోవాలనుకున్నాడు. దీనికి కోర్టు బ్రేక్ వేయడంతో పారిపోవడానికి రెండో ప్రణాళిక వేసుకున్నాడు. దీనికి కూడా పోలీసులు అడ్డుకట్ట వేశారు. త్వరలో శ్రీనివాసరావును కస్టడీలోకి తీసుకుని డబ్బు, ఆస్తుల వివరాల లెక్కలు తేల్చాలని పోలీసులు భావిస్తున్నారు.

ఇదేం తీరు?

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తోంది. ఒకదాని పనులు పూర్తయ్యాయి. రెండు, మూడు, నాలుగు యూనిట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీఐఐసీ, రైతుల మధ్య నెలకొన్న సమస్య కారణంగా ఐదేళ్ల పాటు ఈ పనులు ముందుకు తీసుకెళ్లలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారటంతో ఆ సంస్థ పనులు కూడా ప్రారంభించింది. పనులు ప్రారంభించే సంస్థకు ఏపీఐఐసీ ఈవోటీ ఇవ్వాలి. అలా ఇస్తేనే నిర్ణీత సమయంలోపు ఆ సంస్థ పనిచేయగలదు. ఇలాంటి వాటికి ఈవోటీలు ఇవ్వటం వల్ల ఇప్పటికే మొదలైన పనులను త్వరగా పూర్తి చేస్తాయి. కానీ, అసలు పనులే ప్రారంభించని సంస్థల భూ కేటాయింపులను పునరుద్ధరించి, పనులు చేస్తున్న సంస్థలకు సమయం ఎందుకు ఇవ్వట్లేదో అర్థం కావట్లేదు. పనులు మొదలుపెట్టిన సంస్థలకు కూడా తగిన అవకాశాలు కల్పిస్తే అవి కూడా త్వరగా ఉత్పాదకతను ప్రారంభిస్తాయి. ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తాయి. కాబట్టి ఈ అంశాలపై ఏపీఐఐసీ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నోయిడా టు బెజవాడ

(5వ పేజీ తరువాయి)

తిరుమలశెట్టి జీవన్‌కుమార్ (సనత్‌నగర్), బొంతు నితీష్‌కుమార్ (ఫన్‌టైం క్లబ్ రోడ్డు), తూలిమెల్లి తరుణ్‌ప్రసాద్ (యనమలకుదురు)ను విచారణ చేయగా, అనేక కోణాలు వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది.

రప్పించేది ఒకరు.. విక్రయించేది మరొకరు..

నిందితుల్లో జీవన్‌కుమార్ అనే వ్యక్తి ఎండీఎంఏ డ్రగ్‌ను విద్యార్థులకు అందజేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. బీటెక్ చదివిన జీవన్‌కు ఇంటర్ నుంచే డ్రగ్ అలవాటు ఉంది. ఆ తర్వాత దాన్ని కొనసాగించాడు. ఉత్తరప్రదేశ్‌లో ఉంటున్న స్నేహితుడు మనోహర్.. నోయిడాకు చెందిన రింకీ అనే యువకుడ్ని పరిచయం చేశాడు. ఆ తర్వాత జీవన్ దందా కొత్త మలుపులు తిరిగింది. కృష్ణాజిల్లా గంగూరులోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న నితీష్‌కుమార్‌కు డ్రగ్‌ను అలవాటు చేశాడు. తర్వాత అతడ్ని తన సహాయకుడిగా మార్చుకున్నాడు. ఇలా ఇద్దరూ కలిసి ఓ పద్ధతి ప్రకారం సరుకు రాబట్టే ప్లాన్ చేశారు. నోయిడాలో ఉన్న రింకీకి హైదరాబాద్‌లో ఉంటున్న స్నేహితుల ఇళ్లు, హాస్టళ్ల చిరునామాలు ఇస్తాడు. అక్కడికి నోయిడా నుంచి ఎండీఎంఏను పార్శిల్ ద్వారా రప్పించుకుంటాడు. ట్రాకర్ ఆన్, డీటీడీసీ అనే రెండు కొరియర్ సంస్థల ద్వారా సరుకు హైదరాబాద్ చేరుతోంది. చిరునామా వేర్వేరుగా ఉన్నా ఫోన్ నెంబర్ మాత్రం జీవన్‌దే ఇచ్చేవాడు. పార్శిల్ ఇవ్వడానికి వెళ్లిన బాయ్స్ ఈ నెంబర్‌కు ఫోన్ చేసేవారు. తాను వేరేచోట ఉన్నానని, మర్నాడు తీసుకుంటానని చెప్పేవాడు. ఆ తర్వాత విజయవాడ నుంచి రైల్లో కానీ, బస్సులో కానీ, బైక్‌పై కానీ హైదరాబాద్ వెళ్లి తీసుకునేవాడు. ఇలా విజయవాడకు చేర్చిన పార్శిల్‌లోని డ్రగ్‌ను నితీష్‌కుమార్ ద్వారా విక్రయించేవాడు. ఏడాదిగా జీవన్ ఇలాగే డ్రగ్‌ను తెప్పిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. జీవన్, నితీష్ సెల్‌ఫోన్లను పరిశీలించగా, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో పాటు గుంటూరు జిల్లాలోని డీమ్డ్ వర్సిటీ విద్యార్థుల ఫోన్ నెంబర్లు ఉన్నట్టు గుర్తించారు. రింకీ అనే వ్యక్తి జీవన్‌కు సరుకును పంపుతున్నప్పటికీ దానికి సంబంధించిన చెల్లింపులు మాత్రం వేరే వ్యక్తికి చేసేవాడు. ఢిల్లీకి చెందిన బంధోపాధ్యాయ చౌదరి అనే వ్యక్తి జీవన్‌కు క్యూఆర్ కోడ్‌ను పంపేవాడు. దానికి పేమెంట్ సర్వీస్ యాప్‌ల ద్వారా చెల్లింపులు చేసేవాడు. గ్రాము ఎండీఎంఏను రూ.4 వేలకు కొని ఇక్కడి విద్యార్థులకు మాత్రం గ్రాము రూ.6 వేలకు విక్రయిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ ముగ్గురు నిందితులకు విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో గురువారం వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం వారిని నాల్గో ఏసీఎంఎం కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి రామ్మోహన్‌నాయుడు 14 రోజుల రిమాండ్ విధించారు.

దారిలో దందా..!

(5వ పేజీ తరువాయి)

కురుస్తోంది. ఇక ఓవర్‌లోడ్ వాహనాలు వస్తే పండగే పండగ.

అంతర్రాష్ట్ర రవాణా చెక్‌పోస్టుల ఎత్తివేతతో..

కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోని రవాణా తనిఖీ కేంద్రాలను ఎత్తివేయటంతో జగ్గయ్యపేట కేంద్రంగా ఉన్న కార్యాలయంలో పనిచేసే మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐలు) జాతీయ రహదారిపై ఎక్కువకాలం గడుపుతున్నారు. కార్యాలయాల్లో ఏటీఎస్ సిస్టం ద్వారా ఫిట్‌నెస్‌లు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంతో వారి ఆదాయానికి గండి పడింది. ఈ నేపథ్యంలో ఇక్కడ పనిచేసే ఎంవీఐ, అసిస్టెంట్ ఎంవీఐలు వంతులవారీగా జాతీయ రహదారిపై పడుతున్నారు. తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకు ఒకరు, సాయంత్రం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు మరొకరు టోల్‌ప్లాజాను కేంద్రంగా చేసుకుని రాష్ట్రంలోకి వచ్చే వాహనాలను దండుకుంటున్నారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే టార్గెట్లు అని చెబుతున్నారు. కార్యాలయంలో ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకుని దండుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. జగ్గయ్యపేటలో సిమెంట్, ఫ్లయాష్ రవాణా చేసే ట్యాంకర్లు 300 వరకు ఉన్నాయి. ఇలాంటి వాహనాలు రాష్ట్రానికి చెందినవైతే రూ.2,500 నుంచి రూ.3 వేలు, తెలంగాణ అయితే రూ.4 వేలు వసూలు చేస్తున్నారు. సిమెంట్, బొగ్గు, తేలికపాటి ఇటుకలను రవాణా చేసే వాహనాలకు 25 ట్రాన్స్‌పోర్టు కంపెనీలుండగా, 200 నుంచి 300 వరకు చిన్న కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలన్నీ నెలవారీ ముడుపులు చెల్లించాలని హుకుం జారీచేశారు. అనుమతికి మించి టన్ను అధికంగా ఉన్నా ముడుపులు ముట్టజెప్పాల్సిందే. అధిక లోడుపై 5 నుంచి 10 శాతం మార్జిన్ ఉంటే.. ఆన్‌లైన్‌లో రూ.21,500 అపరాధ రుసుం చెల్లించాలని డ్రైవర్లను బెదరగొడుతున్నారు. అలాకాకుండా తమకైతే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఇస్తే సరిపోతుందని చెబుతున్నారు.

అరాచక అభిమానం

(5వ పేజీ తరువాయి)

అవుతున్నాయి. బందరురోడ్డు, ఏలూరురోడ్డులో వీరు చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. బందరురోడ్డులోని తాజ్ వివంతా వద్ద ప్రమాదాలు జరగకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేయగా, బైకులపై ఊరేగింపుగా వచ్చిన ఇద్దరు యువకులు వాటిని లాక్కుపోయారు. ఒకరు బైక్ నడుపుతుండగా, వెనుక కూర్చున్న యువకుడు బారికేడ్‌ను లాక్కుని వెళ్లాడు. కొంతదూరం వెళ్లాక దానిపై ఎక్కి గంతులు వేశారు. మరో గ్యాంగ్ బందరు రోడ్డులో ఎంఅండ్ఎం ఎదురుగా ఉన్న సెంటర్ డివైడర్‌పై నాటిన మొక్కలను విరిచేసింది. కొంతమంది ఎత్తుగా ఎదిగిన మొక్కలు పీకేసి వాటితో ర్యాలీలు చేశారు. ఈ వీడియోలను చిత్రీకరించిన ఇంకొందరు యువకులు సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. ఈ వీడియోలు పోలీసులకు చేరాయి. యువకుల బైక్ నెంబర్ల ఆధారంగా వారి చిరునామాను గుర్తించారు. విధ్వంసం సృష్టించినవారు రామలింగేశ్వరనగర్‌కు చెందిన సాయి, పవన్‌గా నిర్ధారించారు. వారిపై కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ యువకులిద్దరూ బీటెక్ చదువుతున్నట్టు తెలిసింది. వారిని స్పెషల్ కోర్టులో హాజరుపరచగా, న్యాయాధికారి రిమాండ్ విధించారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

కైవల్యకు ఎంపీ అభినందన



విజయవాడ(స్పోర్ట్స్): తైవాన్ లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ ఆర్టిస్టిక్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ 2025 లో నాలుగు బంగారు, ఒక వెండి పతకం సాధించిన కొప్పరపు కైవల్యను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. గురునానక్ కాలనీ లోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఎంపీ కేశినాథ్‌ను కైవల్య మర్యాదపూర్వకంగా కలి శారు. రాష్ట్ర ఖ్యాతి ఇనుమడింప చేసిన కైవల్యను ఆదర్శంగా తీసుకుని యువత క్రీడల్లో రాణించాలని అన్నారు. కైవల్య తండ్రి శశికుమార్ పాల్గొన్నారు.

కూటమి వచ్చిన తర్వాతే రోడ్ల అభివృద్ధి

ఎంపీ కేశినేని శివనాథ్

భారతీనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే కాలనీల్లో రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. నాల్గో డివిజన్ పరిధి సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో రూ.70లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథులుగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నగరంలోని ప్రధాన రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరిస్తున్నామని తెలిపారు. రైల్వేస్టేషన్‌ను పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు రూ.850 కోట్లను మంజూరు చేయడానికి నీతిఆయోగ్ ఆమోదం తెలిపిందని తెలిపారు. వచ్చే నెలలోనే రైల్వేస్టేషన్ అభివృద్ధికి టెండర్లు పిలుస్తామని అన్నారు.

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని కాలనీల్లోని ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలను పరిష్కారిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివ రావు, ముమ్మనేని ప్రసాద్, టీడీపీ నేతలు గొల్లపూడి నాగేశ్వరావు, కాలనీ వాసులు, ఈఈ సామ్రాజ్యం, ఏఈ దీక్షిత్, తదితరులు పాల్గొన్నారు.



వెటర్నరీ కాలనీలో మొక్క నాటి నీరు పోస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, రాణిగారితోటలో, కృష్ణలంక డొంకరోడ్డులో, పీబీ సిద్దార్థ కళాశాలలో, మాచవరం సబ్‌స్టేషన్‌లో, 12వ డివిజన్‌లో

ప్లాస్టిక్ వాడకానికి స్వస్తి పలకండి

కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో జరిగిన పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో కలెక్టర్ లక్ష్మీశ

మొగల్రాజపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం తగ్గించి మొక్కల పెంపకంపై సమాజంలోని ప్రతి ఒక్కరూ దృష్టిపెడితే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. స్థానిక కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం డ్రీమ్స్ వర్క్స్ ఆర్ట్ అకాడమీ సహకారంతో మన ప్రకృతిని మనమే కాపాడుకోవాలి అనే అంశంపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ లక్ష్మీశ హాజరై మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకానికి పూర్తిగా స్వస్తి పలకాలన్నారు. భూమిలో కలిసిపోయే పేపర్ కవర్లు, పల్చటి కాటన్ క్లాత్ కవర్లను మాత్రమే వాడాలని చెప్పారు. మొక్కల పెంపకంపై యువతను చైతన్య వంతులను చేయడానికి వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు దోహద పడతాయని చెప్పారు. లయన్స్‌క్లబ్ ఏరియా లీడర్ ఉపేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచంట సునీత, జి.నారాయణరావు, గాడ్విన్ గ్రూప్ అధినేత డాక్టర్ కిరణ్‌కుమార్, మా జ్యూయలరీస్ అధినేత కె.సుధాకర్, డాక్టర్ సి. రామ్‌చంద్, డాక్టర్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత: ఎమ్మెల్యే గద్దె

భారతీనగర్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నాల్గో డివిజన్ పరిధి లయోలా కళాశాల రోడ్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కమిషనర్ ధ్యానచంద్ర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ భూమిపై కాలుష్యం అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యాగ్‌లను ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మెప్మా అధికారి వెంకటేశ్వరావు, అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ఈ సత్యవతి, సిటిప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఈఈ సామ్రాజ్యం పాల్గొన్నారు.

● ఏపీఐఐసీ కాలనీలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం కాలనీ వాసులకు మొక్కలు, జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఈఈ శ్రీనివాస రావు, డిజెడ్ ఎం. సీతమహాలక్ష్మి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నాల్గో డివిజన్ వెటర్నరీ కాలనీలో చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కాలనీవాసులతో కలిసి కాలనీలోని పలు రోడ్లలో మొక్కలు నాటారు. డిపార్టుమెంట్ సభ్యులు పాల్గొన్నారు.



లయోలా కళాశాల రోడ్లో మొక్క నాటి మట్టి పోస్తున్న ఎమ్మెల్యే గద్దె , కమిషనర్ ధ్యానచంద్ర , కార్పొరేటర్లు

రాణిగారితోట: ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో రాణిగారితోట 17, 18 డివిజన్ల ఫీడర్ రోడ్డులో, కృష్ణలంక పోలీస్ స్టేషన్ రోడ్డు పక్కన గురువారం మొక్కలు నాటారు. పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి రాణిగారితోట వరకు దాదాపు 200 మొక్కలు నాటేందుకు కార్యచరణ సిద్ధం చేసిన సిబ్బంది 60పైగా మొక్కలు నాటారు. జూన్ నెల నుండి ఆగస్టు వరకు ఈ కార్యక్రమం నిరంతర ప్రకియగా నిర్వహించి 5వేల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. **కృష్ణలంక:** కృష్ణలంక 20వ డివిజన్ డొంకరోడ్డులో స్థానిక కార్పొరేటర్ అడపా శేష స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. సురేష్ వర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు. **గుణదల:** పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సౌజన్యంతో మొక్కలు నాటడం గర్వించదగిన అంశం అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు కూడా పరిపూర్ణంగా నిర్వర్తిస్తేనే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.వెంకటేశ్వర్లు, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యూలరీస్ మేనేజర్ మహ్మద్ ఖాసిం పాల్గొన్నారు.

సబ్‌వేతో పాటు సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

రోడ్ సేఫ్టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు



సత్యం హోటల్ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న స్థానికులు

కృష్ణలంక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక జాతీయ రహదారిపై సత్యం హోటల్ జంక్షన్ వద్ద నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఆ ప్రాంతంలో సబ్‌వేతో పాటు ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేసి, ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని రోడ్డు సేఫ్టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు తెలిపారు. గురువారం ఆయన స్థానికులతో కలిసి సత్యం హోటల్ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై నిరసన ప్రదర్శన చేశారు. జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించే విధంగా ఈ ప్రాంతంలో ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను డ్యూటీల వారీగా ఏర్పాటు చేయాలని ఆయన పోలీసు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీవీ తారక, పులి రమణారెడ్డి, బొంగు వాసు, టి.సాయి, బీఎస్ గుప్తా, పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణ పనుల పరిశీలన

లబ్బీపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): లబ్బీపేటలో ఆగిన షాదీఖానా నిర్మాణ పనులను గురువారం కార్పొరేషన్ అధికారులు, స్థానిక టీడీపీ నేతలు పరిశీలించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అటకెక్కిన షాదీఖానా కథనానికి స్పందించిన టీడీపీ డివిజన్ అధ్యక్షుడు భాగం ప్రసాద్ సంబంధిత అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సాంకేతిక కారణాల వలన పనులకు అంతరాయం కలిగిందని, ఈ నిర్మాణం కోసం గద్దె రామ్మోహన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఈ షాదీఖానా ఫంక్షన్‌లకు సరిపోదని అభిప్రాయం అనేక మంది నుంచి వ్యక్తం కావడంతో దీనిని మరింతగా పొడిగించేందుకు జరుగుతున్న పనుల్లో భాగంగానే ఆలస్యం అవుతుందని తెలిపారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారని, మరో 15 రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.



షాదీఖానా నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు, టీడీపీ నేతలు



ఓపెన్ డ్రెయినేజీ నిర్మాణ పనుల వల్ల పటమటలంక, దర్శిపేటలో రోడ్డు మీదే వాహనాల పార్కింగ్, వ్యాపారాలు లేక బోసిపోయిన షాపులు

నత్తనడకన ఓపెన్ డ్రెయినేజీ నిర్మాణ పనులు

ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యాపారులు, వాహనదారులు, స్థానికులు

రామలింగేశ్వర్‌నగర్, ఆంధ్రజ్యోతి: పటమట లంక పూజిత అపార్టుమెంట్ వద్ద నుంచి పడవల రేవు వంతెన వరకు ఓపెన్ డ్రెయినేజీ నిర్మాణం పనులు నత్త నడకన సాగుతున్నాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అక్కడున్న షాపు యజమానులు, స్థానికులు, వాహనదారులు అంటున్నారు. నిర్మాణ పనులు చేపట్టి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నిర్మాణ పనులు పూర్తికాకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తి కాకపోవడం వల్ల వ్యాపారాలు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, బెంజిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాల్లోని నిలిచిన వర్షపు నీరు వెళ్లేందుకు ఎన్టీఆర్ సర్కిల్, పూజిత అపార్టుమెంట్ మీదుగా రామలింగేశ్వరనగర్ పడవల రేవు వంతెన వరకు ఓపెన్ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనుల వల్ల పటమట లంక, దర్శిపేట ప్రాంత వాసులతో పాటు రామలింగేశ్వర నగర్ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఓపెన్ డ్రెయినేజీ నిర్మాణం పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నగరంలో పర్యావరణ దినోత్సవ ర్యాలీ

విజయవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడ మహాత్మా గాంధీ రోడ్‌లోని ఇందిగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సుమారు 100 మంది సీటీజీ సభ్యులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి వివిధ స్లోగన్లు, ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. ఈ ర్యాలీలో సీటీజీ గ్రూపు అడ్మిన్‌లు కోగంటి శ్రీదేవి, జె.జయలక్ష్మి, ఎంవీకె పద్మజ, జీ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

9న సమ్మెను జయప్రదం చేయండి

స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్

బస్టేషన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ 9వ తేదీన జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాల వల్ల కార్మిక, ఉద్యోగులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. ఉద్యోగ, కార్మికుల సమస్యలపై పలు దఫాలు సంబంధిత ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించకపోవటంతో విధిలేక సమ్మెకు పిలుపు నిచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు.

త్వరలో తీరనున్న భ్రమరాంబపురం ఇళ్ల పట్టాల సమస్య

కృష్ణలంక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక 22వ డివిజన్ ప్రాంతంలోని భ్రమరాంబపురంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్యకు త్వరలో తెరపడనుంది. భ్రమరాంబపురంలో ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ జరిపే విధంగా జీవో 107ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సందర్భంగా గురువారం సీపీఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్, పుప్పాల కృష్ణ తదితరులు భ్రమరాంబపురం ప్రాంతంలో పర్యటించి స్థానికులతో కలిసి మాట్లాడారు.

వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బత్తుల చిన్నారావు, కాయల లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలు 25 నుంచి

కార్పొరేషన్ : యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని వార్డు, సర్కిల్‌స్థాయి యోగా పోటీలు జరుగుతాయని కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్డు స్థాయి విజేతలు సర్కిల్‌కి, సర్కిల్ స్థాయి విజేతలు జిల్లా కి, జిల్లా స్థాయి విజేతలు రాష్ట్రస్థాయికి అర్హత సాధిస్తారన్నారు. వివిధ విభాగాల్లో పోటీలు 26 నుంచి 30వరకు జరిగాయన్నారు. ప్రస్తుతం సర్కిల్ స్థాయి పోటీలను నగర పాలకసంస్థ నిర్వహి స్తోందని కమిషనర్ తెలిపారు.

గంజాయి పట్టివేత

అజిత్‌సింగ్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిపై అజిత్‌సింగ్ నగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు న్యూ రాజరాజేశ్వరిపేటలో తనిఖీలో చేపట్టారు. పసుపులేటి భాను, తమ్మిన నాగ దర్గారావులను సోదా చేయగా వారి వద్ద గంజాయి ఉండటాన్ని గుర్తించారు. రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే యార్లగడ్డతో టీడీపీ సౌతాఫ్రికా అధ్యక్షుడి భేటీ

గన్నవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును టీడీపీ సౌతాఫ్రికా అధ్యక్షుడు, పీఆర్కే ఫౌండేషన్ చైర్మన్ పారా రామకృష్ణ గురువారం మర్యాదపూర్వకంగా కలశారు. దుశ్శాలువ కప్పి పూలబొకే అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు సహాయం చేయటంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని రామకృష్ణ తెలిపారు.


ఎమ్మెల్యే యార్లగడ్డకు పూల బొకే ఇస్తున్న రామకృష్ణ

మిస్ తెలుగు అమెరికా విజేత నిహారిక

పెడన, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) నిర్వహించిన మిస్ తెలుగు అమెరికా పోటీల్లో పెడనకు చెందిన బవిరిశెట్టి ఆనందరావు, పావని దంపతుల కుమార్తె నిహారిక విజేతగా నిలిచి కిరీటం కైవసం చేసుకున్నారు. నిహారిక అమెరికాలోని న్యూయార్క్ నగరంలోని లాగ్ ఐలాండ్ వర్శిటీలో ఎంఎస్ చదువుతోంది. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా, వాసవీ క్లబ్ అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు తమ్మన లక్ష్మీతాయారు నిహారికను అభినందించారు.



ఖయ్యూంను రేషన్ కార్డులో నమోదు చేస్తాం

● తహసీల్దార్ రామకోటేశ్వరరావు

గుడివాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే మానసిక వికలాంగుడైన ఖయ్యూం పేరును రేషన్ కార్డు నుంచి వలంటీర్ నిర్లక్ష్యం కారణంగా తొలగించిన విషయాన్ని

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం 'పాపం ఖయ్యూం' కథనం ప్రచురితమైంది. దీనిపై స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం స్పందించి గురువారం వెంటనే విచారణ చేపట్టాలని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావుకు ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టగా ఖయ్యూం పేరును తొలగించారని గుర్తించారు. వెంటనే కార్డులో అతడి పేరును పునరుద్ధరించేలా, తల్లి రేషన్ కార్డులో ఖయ్యూం పేరును చేర్చేందుకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు తెలిపారు. రేషన్ కార్డులో పేరు తొలగించడంతో బాధపడుతున్న ఖయ్యూం తల్లి ప్యారీజాన్ సంతోషం వ్యక్తం చేశారు. కార్డులో పేరును పునరుద్ధరించేలా చొరవ చూపిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యంకు 11వ వార్డు ఇన్‌చార్జ్ సయ్యద్ జబీన్ ధన్యవాదాలు తెలిపారు.

పారదర్శకంగానే బదిలీలు

హనుమాన్‌జంక్షన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పౌర గ్రంథాలయ శాఖల్లో నిర్వహించిన బదిలీలు పారదర్శకంగానే సాగాయని ప్రముఖ దినపత్రికల్లో వాస్తవాలను వక్రీకరిస్తూ రాసిన కథనాలను గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి. రాంబాబు, నాదెండ్ల బాబ్జీ గురువారం ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు మే 31న కౌన్సెలింగ్ ద్వారా అధికారులు బదిలీలు నిర్వహించారన్నారు. నిజాయితీగా, పారదర్శకంగా నిబంధనలు మేరకు బదిలీలు జరిగాయన్నారు. రూ.లక్షలు ముడుపులు చెల్లించి బదిలీలు చేయించుకునే ఆర్థిక పరిస్థితి గ్రంథాలయ ఉద్యోగులకు లేదన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయండి

● ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు ఏపీఎంపీఏ శుభాకాంక్షలు

విజయవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీ రాఘవాచారి ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆలపాటి సురేష్ కుమార్‌ను గురువారం ఉదయం నగరంలోని సీఆర్ ప్రెస్ అకాడమీలో ఏపీఎంపీఏ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించి, వారి సంక్షేమానికి కృషి చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేమినేని వెంకట రమణ, రాష్ట్ర కోశాధికారి మత్తి శ్రీకాంత్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పసుపులేటి చైతన్య, నేతలు రాజా, గుర్రం శ్రీనివాసరావు, వేల్పుల ప్రశాంత్, ఎన్ఎస్ఆర్‌డీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మెగా డీఎస్సీకి పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్

కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మెగా డీఎస్సీ - కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)ను ఈనెల 6 నుంచి 30 వరకు నిర్వహించనుందని, జిల్లాలో డీఎస్సీ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లాకు తెలంగాణలో ఒక కేంద్రంతో పాటు మొత్తం 11 కేంద్రాలను కేటాయించినట్టు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. సెషన్-1కు 16,964 మంది, సెషన్-2కు 15,287 మంది అభ్యర్థులను కేటాయించినట్లు వివరించారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను 10 మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాల్‌టికెట్‌లో ఏవైనా తప్పులుంటే ధ్రువీకరణ పత్రాల ఆధారంగా కేంద్రాల వద్ద సరిదిద్ది పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. అభ్యర్థుల సందేహాల నివృత్తికి, సహాయానికి కంట్రోల్ రూం నెంబర్ల (7981456441, 9440506411)లో సంప్రదించవచ్చన్నారు. డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఈవో యూవీ సుబ్బారావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీసీపీ కేజీవీ సరిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలు: అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాల (అనంతగిరి, కోదాడ మండలం, నల్గొండ జిల్లా), శ్రీ వాహిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (తిరువూరు), లక్కిరెడ్డి బాలిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (మైలవరం)తో పాటు విజయవాడ అయాన్ డిజిటల్ జోన్ - కండ్రిక, పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఎస్‌వీటీ ఇన్ఫోటెక్-గవర్నరుపేట, లైఫ్ బ్రిడ్జ్ ఇన్ఫో టెక్నాలజీస్ ఆఫ్ టెక్నాలజీ, ఎన్నారై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీలక్ష్మి కంప్యూటర్స్-గొల్లపూడి, శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్-కానూరు.

అనుమానాస్పద స్థితిలో హోంగార్డు మృతి

బంటుమిల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఓఎన్‌జీసీలో హోంగార్డుగా పనిచేస్తున్న లేళ్ల రవిబాబు (39) అనుమానాస్పదరీతిలో మృతి చెందారు. కలిదిండి మండలం భాస్కరరావుపేటకు చెందిన లేళ్ల రవిబాబు కృత్తివెన్ను మండలం చినపాండ్రాక ఓఎన్‌జీసీలో కొంతకాలంగా హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు. బంటుమిల్లిలోని నటరాజ్ థియేటర్ వెనుక అద్దెకుంటున్నారు. గురువారం ఉదయం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉండడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు పాల్పడే నాటికి కుటుంబ సభ్యులు స్వగ్రామమైన భాస్కరరావుపేటలో ఉన్నారు. అనారోగ్య కారణంగా తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డారని భార్య రజినీ కుమారి బంటుమిల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హుందాతనానికి మారుపేరు నెట్టెం

● రఘురాం నాయకత్వంలో కేడీసీసీబీ మరింత అభివృద్ధి ● పలువురు వక్తల ప్రశంస

వన్‌టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఓర్పునకు, హుందాతనానికి మారుపేరు టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ అని, ఆయన నాయకత్వంలో కేడీసీసీ బ్యాంకు మరింత అభివృద్ధిలోకి పయనిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం బందరు రోడ్డులోని కేడీసీసీ బ్యాంకులో చైర్మన్‌గా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సభకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నీతికి, నిజాయితీకి నిలబడి పార్టీకి అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు ఉందనడానికి నిదర్శనమే రఘురామ్‌కు ఈ పదవి అన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ నెట్టెం రఘురామ్‌కు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి అలంకారం మాత్రమేనన్నారు. తన అనుభవంతో బ్యాంకును మరింత వృద్ధిలోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ నెట్టెం రఘురామ్ పెద్ద మనిషి అని అటువంటి వ్యక్తికి ఒక సముచిత స్థానాన్ని సీఎం చంద్రబాబు కల్పించారన్నారు. రాష్ట్రంలోనే ప్రతిష్ఠాత్మకమైన బ్యాంకు కేడీసీసీ బ్యాంక్ అని, రూ.13 వేల కోట్ల టర్నోవర్ గల బ్యాంకుకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నెట్టెం నాయకత్వంలో బ్యాంకు మరింత వృద్ధిలోకి వస్తుందన్నారు. గన్నవరం ఎమ్మెల్యే, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి రఘురామ్‌కు చిన్నదని భావిస్తున్నానన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ దేశ సహకారంగ చరిత్రలో కృష్ణాజిల్లా సహకార బ్యాంకుకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన బ్యాంకు కేడీసీసీ బ్యాంకు అని కొనియాడారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ నెట్టెం రఘురామ్ జిల్లాలోనే జంటిల్‌మెన్ లీడర్ అని కొనియాడారు. ఆయనకు ఆప్కాబ్ చైర్మన్ ఇస్తారని అనుకున్నామని, కానీ పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలి కాబట్టి ముందుకు పోతున్నామన్నారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ తన ఆత్మీయ సభకు ఇంతమంది ప్రముఖులు, నేతలు రావటం ఊహించలేదన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న వెంటనే ఉద్యోగులతో రివ్యూ చేశానన్నారు. 1915లో ప్రారంభమైన ఈ బ్యాంకు ప్రతిష్ఠకు భంగం కలగకుండా మరింతగా అభివృద్ధి చేస్తానన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు వసంత వెంకట కృష్ణప్రసాద్, కొలికలపూడి శ్రీనివాసరావు, కాగిత కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తదితరులు నెట్టెం రఘురామ్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయన్ను గజమాలతో ఘనంగా సత్కరించారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు కొమ్మారెడ్డి పట్టాభిరామ్, రావి వెంకటేశ్వరరావు, వీరంకి గురుమూర్తి, జి.రఘురామరాజు, ఎస్.దేవదత్, గుమ్మడి గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, యువ నేత బోడే వెంకట్రావు, పార్టీ సీనియర్ నేతలు గన్నె అన్న, కార్పొరేటర్లు పాల్గొన్నారు


కేడీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నెట్టెం రఘురామ్‌ను అభినందిస్తూ మాట్లాడుతున్న ఎంపీ చిన్ని

ఎస్ఎల్‌వీ గ్రూప్ చైర్మన్ అభినందన

గవర్నర్‌పేట: కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కేడీసీసీబీ) చైర్మన్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన మాజీ మంత్రి నెట్టెం రఘురామ్‌ను ఎస్ఎల్‌వీ గ్రూప్ చైర్మన్ పెన్మెత్స శ్రీనివాసరాజు అభినందించారు. ఎంజీ రోడ్డులోని కేడీసీసీ బ్యాంకులో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఆయన పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. నిత్య కృషీవలుడు నెట్టెం రఘురామ్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, బ్యాంకు చైర్మన్‌గా రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చేందుకు బ్యాంకు మరింత పురోగతి సాధించేలా కృషి చేయాలని శ్రీనివాసరాజు ఆకాంక్షించారు.



అంగన్వాడీల అభివృద్ధికి కృషి

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

పటమట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల సమస్యలను పరిష్కరించేందుకు ఎంపీగా బాధ్యతలు చేపట్టనప్పటి నుంచి కృషి చేస్తున్నానని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఇప్పటికే ఢిల్లీలో కేంద్ర శిశు సంక్షేమశాఖ అన్నపూర్ణాదేవిని కలిసి వినతిపత్రం ఇచ్చానన్నారు. ఈ సమస్యలన్నీ త్వరలో పరిష్కారం అవుతాయన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈఈఎఫ్ఎస్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు ఇండెక్షన్ స్టౌల పంపిణీ చేపట్టారు. స్థానిక ఫన్ టైమ్‌క్లబ్‌లో అంగన్వాడీ టీచర్లకు స్టౌ పంపిణీకి మహిళా, అభివృద్ధి, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు కోటి మొక్కలు నాటాలనే సంకల్పంలో ఉన్నారన్నారు. ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని 55,607 అంగన్వాడీ కేంద్రాల్లో తొలిదశగా 11,400 అంగన్వాడీ సెంటర్లకు ఇండెక్షన్ స్టౌవ్‌ను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. 25 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. టీచర్ల సమస్యలపై ఎమ్మెల్యేతో కలిసి పరిష్కరిస్తామన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి సూర్యకుమారి, ఈఈఎస్ఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్, అన్వేష్ మిశ్ర, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, ముమ్మనేని ప్రసాద్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులను అప్‌గ్రేడ్ చేయాలి

● సచివాలయాల శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం


కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రికార్డు అసిస్టెంట్ క్యాడర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు అప్‌గ్రేడ్ చేయాలని సచివాలయాల శాఖ డైరెక్టర్ ఎం.శివప్రసాద్‌కు గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ గురువారం వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగులకు డేట్ ఆఫ్ జాయినింగ్ నుంచి నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, తక్షణం బదిలీలు ఇవ్వాలని, అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో బత్తుల అంకమ్మ రావు, పాషా తదితరులున్నారు.

7న స్టేడియంలో బహిరంగ నమాజ్

లబ్బీపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న బక్రీద్ నమాజ్ మహా ప్రవక్త సంప్రదాయం ప్రకారం ముస్లిం ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బహిరంగ ఈదుల్ అజ్ హ నమాజ్ నిర్వహిస్తున్నట్టు ఈద్గా కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ మునీర్ అహ్మద్ తెలిపారు. గురువారం స్టేడియం ఆవరణలో ఈద్గా నమాజ్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 7న ఉదయం 7 గంటలకు ప్రసంగం, 7.30 గంటలకు నమాజ్ ప్రారంభమవుతుందని, ముస్లిం సోదరులు పాల్గొనాలని కోరారు. కమిటీ సభ్యులు ఎండీ ఇర్ఫాన్, ఎండీ అన్వర్ పాషా, షేక్ వలి, ముక్తార్ అలీ పాల్గొన్నారు

ప్రముఖ పారిశ్రామికవేత్త, నవత ట్రాన్స్‌పోర్టు వ్యవస్థాపకుడు

పర్వతనేని అస్తమయం



ఆటోనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కేంద్రంగా డైలీ ట్రాన్స్‌పోర్టు రంగంలో భారత దేశంలోనే పేరెన్నికగన్న నవత ట్రాన్స్‌పోర్టు సంస్థ వ్యవస్థాపకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త పర్వతనేని కోటేశ్వరరావు (87) వృద్ధాప్య సమస్యలతో గురువారం సాయంత్రం కన్నుమూశారు. తన సోదరుడు పర్వతనేని సుభాష్ చంద్రబోస్‌తో కలిసి ఆయన 1982లో విజయవాడ కేంద్రంగా నవత ట్రాన్సుపోర్టు కంపెనీని స్థాపించారు. అప్పటి నుంచి నవత వారింటిపేరుగా మారిపోయింది. రవాణా రంగంలో ఆయన సేవలు విలువకట్టలేనివి. నవత ట్రానుపోర్టుతో వేలాది మందికి ఉపాధి చూపించిన దార్శనికుడు. డ్రైవర్ల పట్ల ఎంతో ప్రేమాభిమానాలతో వారి సంక్షేమానికి కృషి చేశారు. ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ప్రభుత్వ సంక్షేమ విధానాలతో ట్రాన్సుపోర్టు రంగంలో అత్యున్నత స్థానాన్ని అధిరోహించారు. సరుకు రవాణా వాహనంలో ప్యాసింజర్ల రవాణాకు అనుమతి లేకుండా సరుకు రవాణాలో భద్రతా నియమాలను కఠినంగా పాటించారు. రవాణా రంగానికి ఆయన చేసిన సేవల్లో ప్రప్రమథంగా చెప్పుకునేది నందిగామ ప్రాంతంలో వంద ఎకరాలకు పైగా అతిపెద్ద స్థలంలో రోడ్ సిగ్నలింగ్ వ్యవస్థతో అత్యాధునిక డ్రైవింగ్ స్కూల్‌ను దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేశారు. ఆసియాలోనే అతిపెద్ద ఆటోనగర్ ఏర్పాటు, ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఏర్పాటు, ఐలా ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్, ఆటోనగర్ పెద్దల కమిటీలో, ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా పోటీ లేకుండా ఏకగ్రీవం చేసి నేతల మధ్య సామరస్యపూరిత ఎంపికలో ఆయన పాత్ర ప్రముఖమైంది. 1982లో ప్రారంభించిన నవత రోడ్ ట్రాన్సుపోర్టు నేడు దేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, పాండిచ్చేరి, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలో దాదాపు 668 బ్రాంచిలుగా విస్తరిస్తూ దేశంలో మిగిలిన ప్రాంతాలకూ విస్తరించే ఏర్పాట్లు చేయడంలో ఆయన కృషి ఉంది. ఉమ్మడి కుటుంబ విలువలకు ప్రాధాన్యత ఇస్తూ కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వరిస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిన ఆయన మరణం తీరనిలోటని బంధుమిత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన పార్థివ దేహాన్ని బంధుమిత్రుల సందర్శనార్థం క్రీస్తురాజపురంలో స్వగృహంలో ఉంచారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు అంతిమయాత్ర మొదలవుతుందని బంధువులు తెలిపారు.

యమకింకర.. కంకర!

● కంకర కష్టాలు కడతేరేదెన్నడో
● హెవీ లోడ్లతో హైవేలపై జారుతున్న కంకర
● రోజుకు నాలుగైదు ట్రాక్టర్ల కంకరను తొలగిస్తున్న రోడ్డు భద్రతా సిబ్బంది

ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి: కంకరే కదా అని కొట్టిపారేయకండి. యమకింకర కంకర ఇది. ఈ కంకరే అనేక రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. కుటుంబాల్లో విషాదాలను నింపుతోంది. ఇంకొందరిని మంచానికే పరిమితం చేస్తుంది. రహదారులపై ఆదమరిచి వాహనాలు నడిపారా అంతే. కంకర కాస్త కింకరుడిలా మారడం ఖాయం. హైవేలపై కారుతున్న కంకరతో తస్మాత్ జాగ్రత్త. నిబంధనలు తుంగలో తొక్కి కనీసం పట్టాలు కట్టుకోకుండా అడ్డగోలుగా కంకర రవాణా చేస్తున్న టిప్పర్ల నుంచి కంకర (చిప్స్) రహదారులపై జారిపోతోంది. ముఖ్యంగా విజయవాడ - హైదరాబాద్ 65వ జాతీయ రహదారి, ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ జాతీయ రహదారిపై టిప్పర్లలో నుంచి కంకర గుట్టలు గుట్టలుగా పడిపోతుంది. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, జి.కొండూరు మండలాల్లోని వందలాది రాతి క్వారీల సమీపంలోని పెద్ద క్రషర్ల నుంచి రోజే వందల సంఖ్యలో టిప్పర్లు కంకరను ఉమ్మడి కృష్ణాజిల్లాల్లోని పలు గ్రామాలకు రవాణా చేస్తుంటాయి. ఈ క్రమంలో టిప్పర్లలో కంకరను ఓవర్‌లోడు చేస్తున్నారు. డ్రైవర్ క్యాబిన్‌పై కూడా కంకరను పోసి రవాణా చేస్తున్నారు. కనీసం పట్టాలు కూడా కట్టకుండా రవాణా చేస్తున్నారు. దీంతో హైవే-65, హైవే-30పై పలు కూడళ్ల వద్ద, జంక్షన్లు ఉన్న చోట పెద్ద ఎత్తున కంకర టిప్పర్ల నుంచి కింద జారుతోంది. పశ్చిమ ఇబ్రహీంపట్నం జంక్షన్, రింగ్ సెంటర్లలో ప్రతిరోజు 4 నుంచి 5 ట్రాక్టర్ల మేర కింద పడిపోయిన కంకరను రోడ్డు భద్రతా సిబ్బంది తొలగిస్తున్నారంటే కంకర ఎంతలా జారుతుందో అర్థం చేసుకోవచ్చు. పైగా టిప్పర్ యజమానులు, డ్రైవర్లు రాత్రి వేళల్లో నిబంధనలు మరింతగా విస్మరించి రవాణా చేయడంతో తెల్లవారేసరికి రహదారుల నిండా కంకరే. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధిక లోడుతో అడ్డగోలుగా కంకర రవాణా జరగకుండా ఉండాలంటే నిబంధనలు మరింత కఠినతరం చేయాలి. రాజకీయనేతల ఒత్తిడో లేక మరే కారణం చేతనో నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలకు అధికారులు పూనుకోవడం లేదు. వీరి తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భద్రత లేని కంకర, బండ రాళ్ల రవాణాపై చర్యలు తీసుకోవాలని, ప్రజలు ప్రాణాలకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు.



పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద రహదారిపై పడిన కంకరను ట్రాక్టర్‌కు ఎత్తుతున్న రోడ్డు భద్రతా సిబ్బంది



అధిక లోడుతో పట్టా లేకుండా వెళుతున్న వాహనం



యోగాతో జీవితమంతా ఆనందమయం: కలెక్టర్

సత్యనారాయణపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాను ఆరోగ్యజిల్లాగా తీర్చిదిద్దేందుకు చేయీ చేయీ కలుపుదామని, యోగా తోడైతే జీవితమంతా ఆనందమేనని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో ఆయుష్‌శాఖ, జిల్లా అధికారులు, పరిశ్రమలు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగాంధ్రలో భాగంగా గురువారం విద్యార్థులు, పరిశ్రమల ప్రతినిధులు, యోగా ఔత్సాహికులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. దీంతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం చేకూరి ఉత్సాహంగా పని చేసేందుకు వీలు ఉంటుందన్నారు. రుగ్మతల నుంచి రక్షణ పొందేందుకు యోగాసనాలు ఆచరించడం ఉత్తమ మార్గమన్నారు. కాలుష్య నియంత్రణమండలి ఈఈ పి.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, వన్‌ఎర్త్ వన్‌లైఫ్ ప్రతినిధులు ఏలూరి లీలాకుమారి, ఆయుష్ అధికారులు డాక్టర్ వీ రాణి, నర్సింగ్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీఐ కౌన్సెలింగ్‌లో 93 మందికి అడ్మిషన్లు

భారతీనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మొదటి విడత అడ్మిషన్ల కొరకు గురువారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన మొదటిరోజు కౌన్సెలింగ్‌లో 187 మంది అభ్యర్థులను ఆహ్వానించగా 101 మంది హాజరవగా 93 మంది విద్యార్థులకు వివిధ ట్రేడ్లలో అడ్మిషన్లు కేటాయించినట్టు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు.



రాజధాని రైతులకు ప్లాట్ల పత్రాలను అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ వసంత రాయుడు

రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు

కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన 15 గ్రామాలకు చెందిన 116 మంది రైతులకు గురువారం విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ విధానంలో 294 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 197 నివాస ప్లాట్లు కాగా 97 వాణిజ్య ప్లాట్లు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కృష్ణాయపాలెం, నవులూరు 1, 2, కురగల్లు 1, 2, నిడమర్రు 1, 2, పెనుమాక గ్రామ రైతులకు ఈ లాటరీ నిర్వహించగా, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తుళ్లూరు 1, 2, నెక్కల్లు, అనంతవరం, రాయపూడి 1, 2, కొండమరాజుపాలెం, శాఖమూరు, వెంకటపాలెం, వెలగపూడి, మందడం 1, 2, పిచ్చుకలపాలెం గ్రామ రైతులకు ఈ లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ప్లాట్లను కేటాయించడం జరిగింది. లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్ రన్‌వేసి తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందచేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్) ఎన్ఎస్‌వీబీ వసంతరాయుడు మాట్లాడుతూ ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ప్లాట్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎలాంటి రుసుము వసూలు చేయబడదన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు, ఎం.శేషిరెడ్డి, ఏజీ చిన్నికృష్ణ, పి.పద్మావతి, జి.రవీందర్, కె.స్వర్ణమేరీ, బి.సాయిశ్రీనివాస్ నాయక్, కెఎస్ భాగ్యరేఖ, ఇతర అధికారులు, సీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

సందేశం

ఆ త్యాగం అనుపమానం

లోకం అసాధ్యాలుగా పరిగణించే ఎన్నో కార్యాలు కొందరి త్యాగ ఫలంతో సుసాధ్యమైన ఉదాహరణలు చరిత్రలో అనేకం. వాటిలో దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం గాథ ఒకటి. మనిషి దైవానికి ప్రీతిపాత్రుడు కావాలన్నా, తోటి మానవుల హృదయాల్లో కొలువు తీరాలన్నా త్యాగమే ఉత్తమ మార్గమని ఆయన చరిత్ర చెబుతుంది.

త్యాగమయులను లోకం చిరకాలం గుర్తుంచుకుంటుంది. సమాజ శ్రేయస్సులో వారి త్యాగాలే కీలకం అవుతాయి. త్యాగం నుంచే సమర్థవంతమైన నాయకత్వం ఉద్భవిస్తుంది. హజ్రత్ ఇబ్రహీం జీవితం ఏ కాలానికైనా ఆదర్శప్రాయం. ఆయన సత్యాన్ని నిలబెట్టడానికి పాటుపడ్డాడు.

దేవుడి ఆదేశం మేరకు తన ఒక్కగానొక్క కుమారుణ్ణి త్యాగం చేయడానికి సైతం వెనుకాడలేదు. 'త్యాగం' (ఖుర్బానీ) అనే మాట వినగానే గుర్తుకువచ్చే పేరు ఆయనదే. ఒక విశ్వ సత్యాన్ని లోకానికి చాటిచెప్పడం కోసం కన్న వారిని, ఉన్న ఊరును ఇబ్రహీం విడిచిపెట్టాడు. దేశదేశాలు తిరిగాడు. నిరుపమానమైన త్యాగాలకు పూనుకున్నాడు. ఈ మహా ప్రయాణంలో ఆయనపై కష్టాలెన్నో విరుచుకుపడ్డాయి. అయినా అధైర్యపడలేదు. దైవం తనకు పెట్టిన ప్రతి పరీక్షలోనూ నెగ్గుకుంటూ వచ్చాడు. అప్పుడు దైవం ప్రసన్నుడయ్యాడు. ధర్మాన్ని నిలబెట్టే నాయకత్వ బాధ్యతలను అప్పగించాడు.

ధర్మ సంస్థాపన కార్యంలో తనకు తోడ్పడడం కోసం తనకు ఉత్తమ సంతానం కావాలని దైవాన్ని ఇబ్రహీం వేడుకున్నాడు. ఆ మొరను ఆలకించిన దైవం సచ్ఛీలుడైన కుమారుణ్ణి ప్రసాదిస్తున్నానని ప్రకటించాడు. కొంతకాలానికి అతనికి ఒక కుమారుడు... హజ్రత్ ఇస్మాయిల్ జన్మించాడు. లేకలేక కలిగిన సంతానం ముద్దు ముచ్చట్లతో సంతోషంగా ఉన్న ఇబ్రహీంకు ఒక కల వస్తుంది. అందులో తన కుమారుణ్ణి బలి ఇస్తున్నట్టు కనిపిస్తుంది. అది దైవం తనకు ఇచ్చిన ఆదేశంగా ఇబ్రహీం భావిస్తాడు. ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి సిద్ధపడతాడు. దీనికి ఇస్మాయిల్ కూడా సంతోషంగా అంగీకరిస్తాడు. బలికి ఇబ్రహీం ఉపక్రమించబోతూ ఉండగా... ఆయన పట్ల ఎంతో దయ కలిగిన అల్లాహ్... ఒక గొర్రెపోతును పంపిస్తాడు. ఇస్మాయిల్ స్థానంలో ఆ గొర్రెను దైవానికి ఇబ్రహీం సమర్పిస్తాడు. అప్పుడు "నా ఆజ్ఞను శిరసావహించిన ఇబ్రహీం తన కుమారుణ్ణి బలి చెయ్యడానికి సంకోచించలేదు. కాబట్టి ఈ రోజు నుంచి ప్రళయదినం వరకూ ఖుర్బానీని సంప్రదాయంగా పాటించాలి" అని అల్లాహ్ ఆదేశించాడు. అనంతరం తన గృహమైన కాబాను ఇబ్రహీం చేతుల మీదుగా అల్లాహ్ నిర్మింపజేశాడు. ఇస్లాం ధర్మంలో హజ్ ఒక విధిగా అప్పటి నుంచి స్థిరపడింది.

ఖుర్బానీ ఇవ్వడం అంటే... దేవుడి ఆజ్ఞలను పాటించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించడమే. ఈ విధమైన స్ఫూర్తి, భక్తి పరాయణత విశ్వాసుల్లో కనిపించకపోతే... పుణ్యాన్ని, దైవానుగ్రహాన్ని పొందలేరు. బక్రీద్ రోజున అల్లాహ్‌కు ఎంతో ప్రీతిపాత్రమైన ఆరాధన... ఖుర్బానీ. దాని వల్ల పాప ప్రక్షాళన జరిగి, దేవుడి అనుగ్రహం లభిస్తుంది. కాబట్టి ఖుర్బానీని సంతోషంగా ఇవ్వాలని దైవ ప్రవక్త మహమ్మద్ సూచించారు.


ఈ పండుగ సందర్భంగా హజ్రత్ ఇబ్రహీం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. దైవమార్గంలో పయనిస్తున్నప్పుడు... మనకు ప్రీతికరమైన వాటిని ఏమేరకు త్యాగం చేస్తున్నామనే విషయాన్ని విశ్వాసుల్లో ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

• మహమ్మద్ వహీదుద్దీన్

రేపు బక్రీద్



"ఖుర్బానీ ఇవ్వడం అంటే... దేవుడి ఆజ్ఞలను పాటించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించడమే. ఈ విధమైన స్ఫూర్తి, భక్తి పరాయణత విశ్వాసుల్లో కనిపించకపోతే... పుణ్యాన్ని, దైవానుగ్రహాన్ని పొందలేరు. బక్రీద్ రోజున అల్లాహ్‌కు ఎంతో ప్రీతిపాత్రమైన ఆరాధన... ఖుర్బానీ. దానివల్ల పాప ప్రక్షాళన జరిగి, దేవుడి అనుగ్రహం లభిస్తుంది. కాబట్టి ఖుర్బానీని సంతోషంగా ఇవ్వాలని దైవ ప్రవక్త మహమ్మద్ సూచించారు."



సద్బోధ

అజ్ఞాతంలోనే ఆనందం

చైనాలో ఉద్భవించిన తావో మతంలో లావోట్జు తరువాత పేర్కొనదగినవాడు... ఆయన శిష్యుడైన చువాంగ్ ట్జూ. అతను మహాజ్ఞాని అని దేశంలో అందరూ చెప్పుకొనేవారు. ఈ సంగతి ఆ దేశపు చక్రవర్తి విన్నాడు. అలాంటి వ్యక్తి తన కొలువులో, తనకు సలహాదారుగా ఉండే బాగుంటందనుకున్నాడు. వెంటనే చువాంగ్‌ను తనవద్దకు తీసుకురావాలని భటుల్ని ఆజ్ఞాపించాడు.

అయితే... అతి సామాన్యమైన జీవితాన్ని గడిపే చువాంగ్ ఎల్లప్పుడూ అజ్ఞాతంగా ఉండాలని భావించేవాడు. ఎక్కడా స్థిరంగా ఉండకుండా తిరిగేవాడు. ఏదైనా గ్రామంలో కొన్నాళ్ళు గడిపాక... అక్కడి ప్రజలు అతని గొప్పతనాన్ని గుర్తించి, ప్రత్యేక గౌరవాన్ని కనబరచడం మొదలుపెట్టగానే... మరో గ్రామానికి వెళ్ళేవాడు. అక్కడ కూడా ఇంతే. ఎప్పుడూ అనామకుడుగా ఉండడానికే ఇష్టపడేవాడు. అలాంటి వ్యక్తిని తన సమక్షానికి తీసుకురావాలని చక్రవర్తి ఆజ్ఞాపించాడు. భటులు ఊరూరా తిరిగారు, మూలమూలలు వెతికారు. కనబడినవారందరినీ అడిగారు. కానీ చువాంగ్ జాడ ఎన్ని రోజులైనా వారికి తెలియలేదు. వారు వెతికి వెతికి, అలసిపోయారు. నిరాశకు గురయ్యారు. "చువాంగ్‌ను ఎలా గుర్తించాలి?" అని అతని శిష్యుల్ని అడిగారు.

"చువాంగ్ అత్యంత సామాన్యుడిగా ఉంటాడు. జనానికి దూరంగా... ఏమూలో ఒక మామూలు పని చేస్తూ ఉంటాడు" అని వాళ్ళు రాజభటులకు చెప్పారు.

చివరకు... ఒక గ్రామంలో చువాంగ్ ఉన్నాడని భటులకు తెలిసింది. వారు ఆ గ్రామానికి వెళ్ళి, "ఇక్కడికి కొత్త వ్యక్తి ఎవరైనా వచ్చారా?" అని అడిగారు. "అవును. అదిగో... అక్కడున్నాడు. నదిలో చేపలు పడుతున్నాడు" అంటూ గ్రామస్తులు అతణ్ణి చూపించారు. భటులు చువాంగ్ దగ్గరకు వెళ్ళి "మిమ్మల్ని తన సభకు తీసుకురమ్మని చక్రవర్తి మమ్మల్ని పంపారు. ఆయన కొలువులో ముఖ్య సలహాదారుగా నియమిస్తారట" అని చెప్పారు. ఇంకెవరైనా అయితే ఎగిరి గంతేసేవారే! అయితే... భటుల మాట విన్న చువాంగ్ "ఈ రాత్రి నన్ను కాస్త ఆలోచించనివ్వండి. రేపు ఉదయం నా నిర్ణయం చెబుతాను. తెల్లారిన తరువాత చక్రవర్తి దగ్గరకు వెళ్దాం" అన్నాడు. భటులు సంతోషంగా సమ్మతించారు. ఆ రాత్రి అక్కడే విశ్రమించారు.

మర్నాడు ఉదయం చూస్తే... వారికి చువాంగ్ కనిపించలేదు. రాత్రికి రాత్రే ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్ళిపోయాడు. చక్రవర్తికి ఈ సంగతి భటులు తెలిపారు. "స్వాతంత్ర్యాన్ని, ఏకాంతాన్ని కోరుకొనే సాధువులు, సన్యాసులు ఎలాంటి పదవులకు, హోదాలకు, సత్కారాలకు ఆకర్షితులు కారు. అజ్ఞాతంగా ఉండడమే వారికి ఆనందదాయకం" అని చక్రవర్తి గ్రహించాడు.

• రాచమడుగు శ్రీనివాసులు

చింతన



శాంతిని అన్వేషిద్దాం

మనం ఒకటో తరగతిలో ఉన్నప్పుడు మనకు ఎన్ని బాధ్యతలు ఉండేవి? చాలా తక్కువ. రెండో తరగతికి, మూడో తరగతికి వెళ్ళాక బాధ్యతలు తగ్గాయా, పెరిగాయా? బాధ్యతలు పెరుగుతూనే మన హైస్కూల్ చదువు పూర్తవుతుంది. కాలేజీలో చేరాక... ఆ బాధ్యతలు ఇంకా ఎక్కువవుతాయి. పెళ్ళి చేసుకున్నాక బాధ్యతల భారం పెరగడం తప్పితే తగ్గదు. అలాగే ఉద్యోగంలో పదోన్నతులు వచ్చిన కొద్దీ బాధ్యతలు అధికమవుతాయి. అంటే... వయసు పెరుగుతున్నకొద్దీ బాధ్యతలు కూడా పెరుగుతాయని అర్థం. ఈ బాధ్యతలన్నీ తీరిపోయే రోజు ఒకటి వస్తుందని చాలామంది పగటికలలు కంటూ ఉంటారు. కానీ ఆ బాధ్యతలు ఎన్నటికీ తీరవు. వాటి మధ్యనే మనిషి మనుగడ సాగిస్తున్నాడు.

ఊరట పొందాలంటే...

బాధ్యతలు ఎన్ని ఉన్నా, ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరించే వ్యక్తి అయినా... ఆహారం తీసుకోకపోతే ఆకలితో అలమటిస్తాడు. ఆకలి వేస్తే ఆహారం తినాలి, దాహం తీరాలంటే నీరు తాగాలి. ఎందుకంటే ఇవన్నీ మానవుడి మౌలిక అవసరాలు. శ్వాస తీసుకోవడానికి కూడా నాకు సమయం లేదు ఎవరైనా అంటే, నిజంగానే వారికి ఆ సమయం లేకపోతే... మూడు నాలుగు నిమిషాల తరువాత ఆ వ్యక్తి లోకాన్ని విడిచిపోతాడు. మనకు శ్వాస ఎంతో అవసరం. అలాగే ఎన్నో బాధ్యతలున్నాయని ఎవరైనా నిద్రపోకుండా ఉంటే ఏమవుతుంది? గొప్ప గొప్ప దేశాల నాయకులు ఎంతో ముఖ్యమైన సమావేశాల మధ్యలో నిద్రపోవడం నేను చాలాసార్లు గమనించాను. ఎందుకంటే నిద్ర రావడం మనిషికి సహజం. ఈ ఒత్తిడుల నుంచి ఊరట పొందాలంటే శాంతి ఎంతో అవసరం.

ఈ ప్రశ్నలు వేసుకోవాలి...

శ్వాస తీసుకోవడం, ఆహారం తినడం, నీరు తాగడం... ఇవన్నీ జరగకపోతే మనం అసంపూర్తిగా మిగిలిపోయినట్టే శాంతి లేకపోతే, మనల్ని మనం గుర్తించుకోకపోతే కూడా అసంపూర్తిగా మిగిలిపోతాం. ఈ స్థితిలో 'నేను ఎవరిని? నా జీవితం ఏమవుతుంది?' అనే రకరకాల ప్రశ్నలు వేధిస్తూ ఉంటాయి. తాము ఎన్నో ఏళ్ళు బతుకుతామని చాలామంది భావిస్తూ ఉంటారు. మీరు ఎన్ని రోజులు ఉన్నప్పటికీ... ఆ రోజుల్లో ఏం సాధించారు? రాబోయే రోజుల్లో ఏం సాధిస్తారు? హృదయం కోసం ఏదైనా సంపాదిస్తున్నారా? శాంతిని పొందే దిశలో ఏ విధమైన అడుగులు వేస్తున్నారు? జీవన సాఫల్యతకు ఏం చేస్తున్నారు? అందరూ ఈ ప్రశ్నలు వేసుకోవాలి. ప్రతి మనిషిలో శాంతి నిక్షిప్తమై ఉంది. ఆ శాంతిని స్వయంగా అనుభూతి చెందడం ప్రతి ఒక్కరికీ అవసరం. తనలో ఉన్న శాంతిని అనుభూతి చెందకపోతే... మనిషికి తాను ఎవరో, ఏం చేస్తున్నాడో ఎన్నటికీ అర్థం కాదు. మనిషి అన్నిటి గురించీ తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. తన స్నేహితులు, కుటుంబ సభ్యుల గురించి తెలుసుకుంటున్నాడు. తనను తాను తెలుసుకోడానికి ప్రయత్నించడం లేదు. తానెవరో గుర్తించడం లేదు. బయటి గమ్య స్థానాలను చేరుకోగలిగాడు కాని... తన అసలైన గమ్యమేమిటో తెలుసుకోలేదు, చేరుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏమవుతుంది? నేను నా సందేశాన్ని యావన్మందికీ తెలియజేయడానికి ప్రయత్నిస్తున్నాను. తద్వారా అందరూ వారి జీవితాల్లో శాంతిని స్వయంగా అనుభూతి చెందాలని కోరుకుంటున్నాను. మీరు శాంతిని అన్వేషించండి. అది ఎక్కడ మీకు దొరికినా గొప్ప విషయమే. మీరు ఎక్కడ లభిస్తుందో అక్కడికి వెళ్ళి, మీ దాహాన్ని తీర్చుకోండి. మీ జీవితాన్ని సఫలీకృతం చేసుకోండి.



ప్రేమ్‌రావత్

గీతాసారం

సుఖమైనా, దుఃఖమైనా అనిత్యమే!

జీవితంలో మనకు రకరకాల పరిస్థితులు ఎదురవుతాయి. ఎంతోమంది వ్యక్తులను కలుసుకుంటూ ఉంటాం. ఆ పరిస్థితులలో కొన్ని ఆహ్లాదకరమైనవని, మరికొన్ని బాధాకరమైనని అభిప్రాయాలు ఏర్పరచుకుంటాం. వ్యక్తుల విషయంలోనూ అంతే. 'వీరు మంచివారు, వారు చెడ్డవారు' అనే నిర్ధారణలు చేసుకుంటాం. ఈ భావాలను విడిచిపెట్టాలని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు.



'మనకు ఏది మంచిది, ఏది చెడ్డది' అనే వాస్తవాలను తెలుసుకోవడంలో చేసే పొరపాట్ల కారణంగా మోహానికి గురి అవుతామనీ, దాని నుంచి బయటపడాలని అర్జునుడికి శ్రీకృష్ణుడు పదేపదే బోధించాడు. మనం ఇంద్రియాల ద్వారా సుఖం పొందగలమనేది అతి పెద్ద భ్రమ. ఇంద్రియ సుఖాలను పట్టించుకోనివారు దివ్యమైన ఆనందాన్ని తమ ఆత్మలోనే పొందుతారని, యోగం ద్వారా పరమాత్మలో లీనమైనవారు అనంతమైన ఆనందాన్ని అనుభవిస్తారని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. "విషయేంద్రియ సంయోగం వల్ల ఉత్పన్నమయ్యే భోగాలన్నీ భోగలాలసులకు సుఖాలుగా కనిపిస్తాయి. కానీ అవి నిస్సందేహంగా దుఃఖహేతువులే. అవి అనిత్యాలు. కాబట్టి అర్జునా! అలాంటి వాటిపట్ల వివేకి అయినవాడు ఆసక్తి చూపించడు" అని చెప్పాడు.

"ఇంద్రియాలు తమతమ ఇంద్రియ విషయాలతో కలిసినప్పుడు సుఖదుఃఖాలనే ద్వంద్వాలు కలుగుతాయి. వాటిని మనం భరించాలి. ఎందుకంటే అవి అనిత్యమైనవి" అని 'భగవద్గీత' ఆరంభంలోనే శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. అనిత్యం అంటే... సుఖమైనా, దుఃఖమైనా వాటికి ఒక ప్రారంభం ఉంటుంది, ముగింపు సైతం తప్పనిసరిగా ఉంటుంది. సుఖాలు దక్కనప్పుడు దుఃఖాన్ని, దుఃఖం తొలగిపోయినప్పుడు సుఖాన్ని మనం అనుభూతి చెందుతాం. వీటిని అధిగమించడం కోసం మనం గడిపిన ఆహ్లాదకరమైన క్షణాలను గుర్తు తెచ్చుకుంటాం, నెమరువేసుకుంటాం. లేదా దుఃఖానికి మరొకరు కారణమని నిందిస్తూ ఉంటాం. సుఖదుఃఖాలను అనుభూతి చెందుతున్నప్పుడే అవి అశాశ్వతమైనవనే అవగాహన కలిగినప్పుడు... ఆ భావనలను అధిగమించగలం. క్రమంగా వాటి పట్ల ఆసక్తి నశిస్తుంది.



కె.శివప్రసాద్

సహజయోగ

శక్తి కేంద్రాల జాగృతే ఆనందమార్గం

మన అంతర్గత సూక్ష్మ వ్యవస్థ లేదా యంత్రాంగం మనలో ఏడు పొరలుగా పని చేస్తుంది. ఈ ఏడు పొరలే మనలోని శక్తి కేంద్రాలు. వాటినే చక్రాలు అంటాం. అదే మన శరీరంలో మనకు కనిపించని కేంద్రీయ నాడీ వ్యవస్థ. ఆత్మ సాక్షాత్కారం పొంది వాటిని జాగృతం చేసుకోవడమే మానవులు ఆనందాన్ని పొందే మార్గం.ఈ శక్తి కేంద్రాల గురించి మరింత వివరంగా తెలుసుకుందాం.

మూలాధార చక్రం: మొదటి శక్తి కేంద్రమైన మూలాధార చక్రం మన విసర్జనావయవాల మీద ప్రభావం చూపుతుంది. అది మనకు ఒక రకమైన ఆనందాన్ని ఇస్తుంది. మిగిలిన లోతైన, సున్నితమైన విషయాల వల్ల కలిగే అనుభూతులు ఈ ఆనందాన్ని అధిగమించకూడదంటే... మనలో అమాయకత్వం ఉండాలి. అది గణేశుడి సహజమైన లక్షణం. అదే మనలో ఉండాల్సిన మొదటి లక్షణం. ఈ అమాయకత్వం కావాలనుకుంటే వచ్చేది కాదు. అది అంతర్గతంగా నిర్మితమై ఉండాలి. కానీ సహజయోగ సాధనతో మూలాధార చక్రాన్ని శుద్ధి చేసుకోవడం ద్వారా దాన్ని పెంచుకోవచ్చు.

స్వాధిష్ఠాన చక్రం: రెండో శక్తి కేంద్రమైన స్వాధిష్ఠాన చక్రం... సృజనాత్మకత వల్ల కలిగే ఆనందానికి ప్రతీక. కొందరు దేన్నయినా సృష్టించాలని ఆరాటపడతారు. పుస్తకం రాయడం, చిత్రాన్ని గీయడం లాంటివి ఎంతో ముఖ్యంగా భావిస్తారు. ఈ సృజనాత్మకతకు హేతుబద్ధమైన మెదడు తోడైతే... తమ గొప్పతనం వల్లే మంచి సత్ఫలితాలు, విజయం చేకూరుతున్నట్టు భావిస్తారు. కానీ ఈ ఆలోచన సరికాదు. దీన్ని అధిగమించాలంటే నిర్విచార స్థితిలోకి వెళ్ళాలి. మీ అవగాహన ప్రకాశవంతమైనప్పుడు ఇది జరుగుతుంది. అప్పుడు మీరు దేన్ని సృష్టించినా... దాన్ని కేవలం గమనిస్తూ ఉంటారు. ఆ నిర్విచారమైన స్థితిలో దేన్ని సృష్టించినా దాన్ని ఆనందించగలుగుతారు. మనలోనే ఉన్న శ్రీబ్రహ్మదేవ సరస్వతీతత్త్వాన్ని జాగృతపరచడం వల్లే ఇది సాధ్యమవుతుంది.

నాభి లేదా మణిపుర చక్రం: ఆకలితో ఉన్నప్పుడు ధ్యానంలో కూడా సరిగ్గా కూర్చోలేం. ఆహారాన్ని తిన్నప్పుడు మనకు ఎంతో ఆనందం కలుగుతుంది. అయితే ఈ ఆనందం తాత్కాలికం. ఎందుకంటే దేన్నైనా సంపూర్ణంగా ఆనందించగలిగితే... దాన్ని మళ్ళీ మళ్ళీ కోరుకోం. ఈ స్థితికి చేరుకోవడానికి సంతృప్తి ఒక్కటే సాధనం. రెండు ముద్దలు తిన్నా సంతృప్తి చెందగలగాలి. నాభీ చక్రాన్ని సరిచేసుకొనే మార్గం ఈ సంతృప్తే. నిత్య ధ్యాన సాధన ద్వారా మనలోని శ్రీలక్ష్మీనారాయణ శక్తిని జాగృతం చేసుకోవడం ద్వారా ఇది సాధ్యపడుతుంది. సంతృప్తి అనేది ఆత్మసాక్షాత్కారం లేకుండా లభించదు. ఆత్మసాక్షాత్కారం పొందితే... మీ ఆత్మను ఏది సంతృప్తిపరుస్తుందనేది తెలుస్తుంది. అప్పుడు మీ ప్రాధాన్యాలు మారుతాయి.

అనాహత చక్రం: అనాహత (హృదయ) చక్రం చాలా ముఖ్యమైనది. ఉదార స్వభావులైన వారు ప్రపంచమంతటినీ తమ కుటుంబంగా భావిస్తారు. అందరి సమస్యను తమదిగానే పరిగణిస్తారు. ఈ గుణం హృదయంలోంచీ వస్తుంది. హృదయ చక్రంలోని విశిష్టత... భద్రత. మీలోని సంపూర్ణ భద్రత మీ ఆత్మ మాత్రమే. మీరు భద్రతా భావం కలిగినవారైతే... మీ పిల్లలు కూడా భద్రత అనేది తమలోనే ఉన్నదని గ్రహిస్తారు. వారు నిజమైన ధైర్యవంతులుగా ఉంటారు. భద్రతాభావం వల్ల కలిగే ఆనందం మిమ్మల్ని ఆధ్యాత్మికమైన లోతులకు తీసుకువెళుతుంది. ఎవరిలో భగవంతుడు ఉంటాడో, ఎవరికి భగవంతుడు ఆశీస్సులు ఉంటాయో... వారికి ఇక కావలసింది మరేముంటుంది? కాబట్టి భగవంతుడి మీద విశ్వాసాన్ని మీ హృదయ చక్రంలో పదిలరపచుకోండి. దీని కోసం దుర్గామాతను మీ హృదయంలో స్థిరపరచుకోండి.

విశుద్ధి చక్రం: విశుద్ధి చక్రాన్ని రెండుగా విభజించవచ్చు. అవి విశుద్ధి, హంస చక్రాలు. విశుద్ధ చక్రం విరాట్ స్వరూపుడి చక్రం. అది విశ్వవ్యాపితమైన మాధుర్యత. సంబంధ బాంధవ్యాలలో ఉండే మాధుర్యత. మీరు పుష్పంలోని మాధుర్యాన్ని, సువాసనను ఆస్వాదించినట్టు... ఇతరులలోని మంచి లక్షణాలను ఆస్వాదించాలి. ఈ సామూహిక చేతనను, విశ్వజనీనతను మీరు అనుభూతి చెందినప్పుడే విరాట్ స్వరూపంలో భాగం అవుతారు. కాబట్టి మొదటగా ఇతరుల పట్ల ప్రేమను మీలో పెంచుకోండి. అప్పుడు మీ ప్రవర్తనలో, ముఖకవళికల్లో ఎంతో మృదుత్వం ప్రస్ఫుటమవుతుంది. సహజయోగ సాధన ద్వారా... విరాట్ స్వరూపుడైన కృష్ణుడి గుణగణాలను మీరే స్థిరపరుచుకోవడం ద్వారా ఇది మీకు లభిస్తుంది. ఇక హంస చక్రం మీలో విచక్షణా భావాన్ని పెంపొందిస్తుంది. దాన్ని పరిశుభ్రంగా, చైతన్యవంతంగా ఉంచుకుంటే... మంచి, చెడుల మధ్య వ్యత్యాసాన్ని మీ అంతట మీరే గుర్తించగలరు.



ఆజ్ఞా చక్రం: ఆజ్ఞా చక్రం తాలూకు తత్త్వం... కాంతి లేదా ప్రకాశం. ఇది మీ చిత్తాన్ని తేజోవంతం చేస్తుంది. ఆత్మ సాక్షాత్కారం అయిన తరువాత మీరు ప్రతిదాన్నీ ఈ కాంతి ద్వారానే చూస్తారు. మీరే కాంతి అని, శాశ్వతమైన ప్రకాశం అని తెలుసుకుంటారు. ఈ సంగతి మీరు అర్థమైనప్పుడు మీలోని భయాలు, విమ్మల్ని ఆధీనంలో ఉంచుకోవడానికి ప్రయత్నించే శక్తులు క్షణంలో అదృశ్యమవుతాయి. అప్పుడు మీలో ఎలాంటి భయం ఉండదు. ఎలాంటి త్యాగాన్నయినా ఆనందంగా చేస్తారు. ఈ లక్షణం మీలో శాశ్వతంగా నిలిచి ఉంటుంది. ఇది సహజయోగ సాధన ద్వారా సాధ్యపడుతుంది.

సహస్రార చక్రం: మన సూక్ష్మ నాడీ వ్యవస్థలో ఆఖరి చక్రం... సహస్రారం. ఇది చాలా ముఖ్యమైన చక్రం. మొత్తం ఏడు చక్రాలు వాటి పీఠాలను సహస్రారంలో కలిగి ఉంటాయి. ఈ పీఠాలు ఆనందాన్ని స్వీకరించి, హృదయానికి అందిస్తాయి. మీరు ధ్యానం ద్వారా సహస్రార చక్రాన్ని చేరుకోగలగాలి. లలితా సహస్రనామాల్లో చెప్పినట్టు... దేవి ఇక్కడే 'మహామాయ'గా ఉంటుంది. ఆత్మసాక్షాత్కారం పొందిన తరువాత ఈ చక్రం జాగృతం అవుతుంది.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



దైవమార్గం

తొలి సువార్తికుడు

ఏసు క్రీస్తు జీవిత విశేషాలు కలిగిన గ్రంథాలను 'కొత్త నిబంధన'గా పేర్కొంటారు. ఈ కొత్త నిబంధన గ్రంథావళికి శ్రీకారం చుట్టినవాడు మత్తయి. కొత్త నిబంధనలోని నాలుగు సువార్తలను తొలి గ్రంథాలుగా పరిగణిస్తారు.

ఈ సువార్తా చతుష్టయంలో 'మత్తయి సువార్త' మొదటి గ్రంథం. క్రీస్తు జననం మొదలు ఆయన పునరుత్థానం, మోక్షావరోహణల వరకూ అన్ని విషయాలు ఈ గ్రంథంలో నిక్షిప్తమయ్యాయి.

మత్తయి సువార్త రచన ప్రాథమికంగా గ్రీకు భాషలో జరిగింది. అది కూడా అప్పటి సాధారణ ప్రజల భాష అయిన కోయిన్ గ్రీకు భాషలో.

మత్తయి... ఇశ్రాయేలీయ కపెర్నాం ప్రాంతానికి చెందినవాడు. ఒక సంపన్నుడు. ప్రజలను బాధించి పన్నులు వసూలు చేసే వ్యక్తి. ఒక రోజు ఆ ప్రాంతానికి వచ్చిన ఏసు క్రీస్తు... మత్తయిని 'లేవీ' అని పిలిచాడు. ఆ చల్లటి పిలుపునకు పరవశించిన మత్తయి... తన సంపదలన్నీ విడిచిపెట్టాడు. ప్రభువును అనుసరించాడు. తన మనసు మార్చుకున్నాడు. ఏసుకు శిష్యుడై పోయాడు. తను రచించిన గ్రంథంతో క్రీస్తు జీవన రేఖలను లోకానికి అందించాడు.



మత్తయి సువార్త 29 అధ్యాయాల గ్రంథం. దీనిలో ఏసును ముఖాముఖిగా పటం గీసినట్టు అనిపిస్తుంది. క్లిష్టమైన వేదాంతంతో సహా అందులో ఎన్నో విషయాలున్నాయి. చక్కటి కథన శైలితో... సామాన్యులకు కూడా సులువుగా అర్థమయ్యేలా కథల రూపంలో, చక్కటి ఉపమానాలతో ఇది నడుస్తుంది. ఏసు శిష్యులను ఏర్పరచుకోవడం, కొండపై ప్రసంగించడం, అద్భుతాలు చేయడం, లోకం కోసం తనను తాను సమర్పించుకోవడం, శిష్యులను వాక్యబోధకు పంపడం లాంటి ఎన్నో అంశాలు ఈ సువార్తలో కనిపిస్తాయి.

సౌవార్తికులైన నలుగురిలో ఒక్కొక్కరికీ ఒక్కొక్క ప్రత్యేక చిహ్నం ఉండడం విశేషం. మత్తయికి పవిత్రమైనమ మహా మానవ మూర్తి చిహ్నం. మిగిలినవారిలో మార్కుకు రెక్కల సింహం, లూకాకు వృషభం, యోహానుకు ఎగురుతున్న గ్రద్ద చిహ్నాలుగా ఉన్నాయి. ఈ చిహ్నాల గురించి 'యెహెజ్కేలు' గ్రంథంలో పేర్కొన్నారు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

బిజినెస్

విజయవాడ ● శుక్రవారం 6 జూన్ 2025

టాటాకు ఐఫోన్ల మరమ్మతు బాధ్యతలు

న్యూఢిల్లీ: అమెరికన్ టెక్ దిగ్గజం యాపిల్ భారత మార్కెట్లో టాటా గ్రూప్‌తో తనకున్న భాగస్వామ్యాన్ని మరింత విస్తరించింది. దేశంలో ఐఫోన్లు, మ్యాక్ బుక్‌ల మరమ్మతుల బాధ్యతలను కూడా టాటాకు అప్పగించింది. టాటా గ్రూప్ ఇప్పటికే యాపిల్‌కు కీలక సరఫరాదారుల్లో ఒకటిగా ఉంది. దక్షిణాదిలోని మూడు ప్లాంట్లలో టాటా గ్రూప్.. యాపిల్ కోసం ఐఫోన్ల అసెంబ్లింగ్ చేస్తోంది. ఒక ప్లాంట్‌లో ఐఫోన్ల విడిభాగాలనూ తయారు చేస్తోంది. యాపిల్ ఉత్పత్తుల కాంట్రాక్ట్ తయారీదారుల్లో ఒకటైన తైవాన్ కంపెనీ విస్ట్రాన్‌కు చెందిన భారత అనుబంధ విభాగం ఐసీటీ సర్వీస్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ నుంచి ఇక మరమ్మతు ఆర్డర్లనూ పొందనుంది. కర్ణాటకలోని ఐఫోన్ అసెంబ్లింగ్ క్యాంపస్ ద్వారా టాటా మరమ్మతు సేవలను అందించనుంది.

బీఎస్ఈకి కంట్రోల్ఎస్ సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన కంట్రోల్ఎస్ డేటా సెంటర్.. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ)తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా కంపెనీ బీఎస్ఈకి చెందిన 11 కోట్లకు పైగా మదుపరులకు కీలకమైన డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సేవలు అందించనుంది. దీంతో బీఎస్ఈ రోజూ 700 కోట్లకుపైగా లావాదేవీలను సురక్షితంగా నిర్వహించగలుగుతుంది. ఈ భాగస్వామ్య ఒప్పందం సాంకేతికంగా సవాళ్లతో కూడుకున్నదైనప్పటికీ, దేశ ఆర్థిక సార్వభౌమత్వం, అభివృద్ధికి బాధ్యతతో పని చేస్తామని కంట్రోల్ఎస్ సీఈఓ శ్రీధర్ తెలిపారు.

గ్రావ్‌టన్‌కు 10,000 ఈ-టూ వీలర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీ సంస్థ హైపర్ ఎలక్ట్రిక్‌కు భారీ ఆర్డర్ లభించింది. గ్రావ్‌టన్ మోటార్స్‌కు విద్యుత్ బ్యాటరీలతో పనిచేసే 10,000 ద్విచక్ర వాహనాలను సరఫరా చేయనుంది. గ్రావ్‌టన్ మోటార్స్ ఈ వాహనాలను గిగ్ వర్కర్ల కోసం వినియోగించనుంది. వచ్చే రెండేళ్లలో ఈ వాహనాల సరఫరా పూర్తి చేస్తామని హైపర్ ఎలక్ట్రిక్ సీఈఓ సాయి రాహుల్ తెలిపారు.

హైపర్ ఎలక్ట్రిక్

యూకే కంపెనీతో ఏజీఐ గ్లాస్‌ప్యాక్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గ్లాస్ ప్యాకేజింగ్ కంపెనీ ఏజీఐ గ్లాస్‌ప్యాక్.. బ్రిటన్ కేంద్రంగా పనిచేసే గ్లాస్ ఫ్యూచర్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద యూకే కంపెనీ తన అధునాతన పర్యావరణహిత గ్లాస్ తయారీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏజీఐ గ్లాస్‌ప్యాక్‌కు అందిస్తుంది. భారత్-బ్రిటన్ మధ్య ఇటీవల కుదిరిన ఎఫ్‌టీఏ నేపథ్యంలో బ్రిటన్‌లో తయారయ్యే స్కాచ్ విస్కీ పెద్దఎత్తున భారత్‌కు ఎగుమతి కానుంది. అయితే ఈ విస్కీని పూర్తిగా గాజు సీసాల్లోనే ప్యాక్ చేయాల్సి ఉంటుంది. ఇది ఏజీఐ గ్లాస్‌ప్యాక్ కంపెనీకి మరింత కలిసి రానుంది.

ఔరా.. కుబేర!

- దేశంలో 3.79 లక్షల మంది మిలియనీర్లు
- వారి మొత్తం ఆస్తి రూ.129 లక్షల కోట్లు
- ఏడాది కాలంలో 8.8 శాతం సంపద వృద్ధి
- 'వరల్డ్ వెల్త్ రిపోర్ట్ 2025'లో వెల్లడి



న్యూఢిల్లీ: గత ఏడాది (2024) దేశంలోని సిరిమంతుల సంఖ్యతో పాటు వారి సంపద కూడా గణనీయంగా పెరిగింది. క్యాప్‌జెమినీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన 'వరల్డ్ వెల్త్ రిపోర్ట్ 2025' ప్రకారం.. గత సంవత్సరం దేశంలోని మిలియనీర్లు లేదా హైనెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్ఎన్‌డబ్ల్యూఐ) సంఖ్య 33,000కు పైగా పెరిగి మొత్తం 3,78,810కి చేరింది. 2023లో నమోదైన 3.45 లక్షల మందితో పోలిస్తే ఏడాది కాలంలో వీరి సంఖ్య 5.6 శాతం పెరిగింది. అంతేకాదు, 2024లో మన మిలియనీర్ల మొత్తం సంపద వార్షిక ప్రాతిపదికన 8.8 శాతం వృద్ధితో 1.5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. ప్రస్తుత మారకం రేటు ప్రకారం మన కరెన్సీలో ఈ విలువ దాదాపు రూ.129 లక్షల కోట్లు. దీంతో భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సంపద కేంద్రాల్లో ఒకటిగా నిలిచిందని, ఈ విషయంలో చైనాను విుంచిపోయిందని నివేదిక పేర్కొంది. మరిన్ని విషయాలు..

- కొత్తగా మిలియనీర్లుగా అవతరించిన వారిలో చాలా మంది మిలియనీర్ నెక్స్ట్ డోర్ విభాగం పరిధిలోకి వస్తారని రిపోర్టు వెల్లడించింది. ఒక మిలియన్ డాలర్ల (10 లక్షల డాలర్లు= రూ.8.58 కోట్లు) నుంచి 5 మిలియన్ డాలర్ల (50 లక్షల డాలర్లు= రూ.42.9 కోట్లు) పెట్టుబడి ఆస్తులు కలిగిన వారు ఈ పరిధిలో వస్తారు. గత ఏడాది వీరి సంఖ్య 3,33,340కు పెరిగిందని, వీరి మొత్తం సంపద 62,893 కోట్ల డాలర్లకు (రూ.53.96 లక్షల కోట్లు) చేరిందని రిపోర్టు తెలిపింది.
- కనీసం 30 మిలియన్ డాలర్ల (3 కోట్ల డాలర్లు= రూ.257 కోట్లు) పెట్టుబడి ఆస్తులు కలిగిన కుబేరులు లేదా అల్ట్రా హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (యూహెచ్ఎన్‌డబ్ల్యూఐ) సంఖ్య గత ఏడాది చివరినాటికి 4,290కి పెరిగింది, వారి మొత్తం సంపద 53,477 కోట్ల డాలర్ల (రూ.45.88 లక్షల కోట్లు)కు చేరిందని నివేదిక వెల్లడించింది.
- గత ఏడాది ప్రపంచ మిలియనీర్ల సంఖ్య 2.6 శాతం పెరిగింది. స్టాక్ మార్కెట్లు, కృత్రిమ మేధ (ఏఐ) బూమ్‌తో అల్ట్రా హైనెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ 6.2 శాతం పెరగడం ఇందుకు దోహదపడింది.

సంపద వృద్ధికి చోదకాలు

ఈక్విటీ మార్కెట్ల వృద్ధి, దేశీయ వినియోగం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంఖ్య పెరగడం, వేగంగా డిజిటలీకరణ, స్టార్టప్‌ల బూమ్ సహా టెక్నాలజీ, ఫిన్‌టెక్, ఇన్‌ఫ్రా తదితర రంగాల వివిధీకరణ వంటి అంశాలు దేశంలో మిలియనీర్ల సంఖ్యతో పాటు వారి సంపద వృద్ధికి దోహదపడుతున్నాయని క్యాప్‌జెమినీ రీసెర్చ్ నివేదిక పేర్కొంది.

అల్వోటెక్‌తో డాక్టర్ రెడ్డీస్ జట్టు

క్యాన్సర్ చికిత్స కోసం బయో సిమిలర్ తయారీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పలు రకాల క్యాన్సర్ల చికిత్సలో ఉపయోగించే బయోసిమిలర్ ఔషధ అభివృద్ధి, వాణిజ్యపరమైన ఉత్పత్తి కోసం ప్రపంచ బయోటెక్ సంస్థ అల్వోటెక్‌తో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద బయోసిమిలర్ ఔషధం కీట్రూడాను (పెంబ్రోలిజుమాబ్) ప్రపంచ మార్కెట్ల కోసం ఉభయ సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేస్తాయి. కీట్రూడా అభివృద్ధి, తయారీ, వాణిజ్యపరమైన విడుదల కోసం తాము ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్టు డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. కొన్ని పరిమితులకు లోబడి ఉభయులకు ప్రపంచ మార్కెట్లలో ఉత్పత్తి వాణిజ్యీకరణ హక్కులుంటాయని డాక్టర్ రెడ్డీస్ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ చెప్పారు.

అదానీ గ్రూప్ పన్ను చెల్లింపులు రూ.75,000 కోట్లు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో తమ లిస్టెడ్ కంపెనీల ద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపంలో రూ.75,945 కోట్లు చెల్లించినట్టు అదానీ గ్రూప్ ప్రకటించింది. అంతకు ముందు సంవత్సరం చెల్లించిన రూ.58,104 కోట్లతో పోలిస్తే ఇది 29 శాతం ఎక్కువ. ఇందులో రూ.28,720 కోట్లు ప్రత్యక్ష పన్నులు, రూ.45,407 కోట్లు పరోక్ష పన్నులు, రూ.818 కోట్లు ఉద్యోగుల సామాజిక భద్రతా పథకాల రూపంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించింది. గత ఆర్థిక సంవత్సరం తాము పన్నులు, ఇతర రూపాల్లో చెల్లించిన మొత్తం ముంబై మెట్రో నెట్‌వర్క్ నిర్మాణానికి ఖర్చు చేసిన మొత్తానికి లేదా ఒక ఒలింపిక్ క్రీడల నిర్వహణకు అయ్యే ఖర్చుకు సమానమని అదానీ గ్రూప్ తెలిపింది.

ఇక ఫ్లిప్‌కార్ట్ రుణాలు

ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్ మంజూరు



ముంబై: వాల్‌మార్ట్ నిర్వహణలోని దేశీయ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఇక రుణాలు కూడా మంజూరు చేయనుంది. ఇందుకోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నుంచి బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) లైసెన్సును అందుకుంది. దీంతో ఫ్లిప్‌కార్ట్ ఇక నేరుగా ఖాతాదారులు, తన ప్లాట్‌ఫామ్ ద్వారా వస్తువులు విక్రయించే సంస్థలకు రుణాలు మంజూరు చేసేందుకు అవకాశం ఏర్పడింది. ఫ్లిప్‌కార్ట్ ప్రస్తుతం బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల బాగస్వామ్యంతో ఈ రుణాలు అందజేస్తోంది. దేశంలో ఒక ఈ-కామర్స్ సంస్థకు ఆర్‌బీఐ ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సు జారీ చేయడం ఇదే మొదటిసారి. డిపాజిట్లు సేకరించకుండా ఖాతాదారులు, అమ్మకందారులకు రుణాలు మాత్రమే మంజూరు చేయాలని ఆర్‌బీఐ తన లైసెన్సు పత్రంలో స్పష్టం చేసింది. ఫ్లిప్‌కార్ట్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఈ ఎన్‌బీఎఫ్‌సీ వచ్చే కొద్ది నెలల్లో తన కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఈ లైసెన్సు కోసం ఫ్లిప్‌కార్ట్ 2022లోనే ఆర్‌బీఐకి దరఖాస్తు చేసింది.

అదే బాటలో అమెజాన్: అమెజాన్.ఇన్ కూడా ఫ్లిప్‌కార్ట్ బాటలోనే పయనిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే బెంగళూరు కేంద్రంగా పనిచేసే 'యాక్సియో' అనే ఎన్‌బీఎఫ్‌సీను కొనుగోలు చేసింది. అయితే ఆర్‌బీఐ నుంచి ఇందుకు ఇంకా అనుమతి లభించాల్సి ఉంది. మిగతా ఈ-కామర్స్ సంస్థలు కూడా ఇదే బాట పట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.

రెండేళ్లలో 1.7 లక్షల కోట్లకు..

జోరుగా క్విక్ కామర్స్ వ్యాపారం.. చిన్న నగరాలకు విస్తరణ : కెర్నీ

న్యూఢిల్లీ: దేశంలోని వినియోగదారుల అభిరుచులు వేగంగా మారిపోతున్నాయి. గతంలోలా ఇంటికి దగ్గర్లో ఉన్న చిల్లర దుకాణాలకు వెళ్లి సరుకులు కొనేందుకు ఇష్టపడడం లేదు. మొబైల్ ఆన్ చేయడం.. జెప్టో, బ్లింకిట్, బిగ్ బాస్కెట్ వంటి క్విక్ కామర్స్ సైట్లు ఓపెన్ చేసి కావాల్సిన సరుకుల కోసం ఆర్డర్ చేస్తున్నారు. చిరుతిళ్లు, గిఫ్టింగ్, పర్సనల్ కేర్, నిత్యావసరాల విషయంలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో మరో రెండేళ్లలో మన దేశంలో ఈ సంస్థల వ్యాపారం రూ.1.5 లక్షల కోట్ల నుంచి రూ.1.7 లక్షల కోట్ల వరకు నమోదయ్యే అవకాశం ఉందని కెర్నీ అనే సంస్థ అంచనా. ముఖ్యంగా ప్రీమియం ఉత్పత్తుల విషయంలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.



వేగంగా డెలివరీ: పది పదిహేను నిమిషాల్లోనే కావాల్సిన సరుకులు ఇంటికి చేరడం, క్విక్ కామర్స్ సంస్థలు ఆఫర్ చేస్తున్న డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్లు ఇందుకు ప్రధానంగా దోహదం చేస్తున్నట్టు కెర్నీ నివేదిక తెలిపింది. హైదరాబాద్‌తో సహా ప్రధాన నగరాల్లో ఇటీవల అనేక రిటైల్ కంపెనీల మాల్స్ మూతపడడానికి ఇది కూడా కారణం. ఐదు లక్షలు అంతకు మించి జనాభా ఉన్న ప్రధాన నగరాలన్నిటిని క్విక్ కామర్స్ సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ నగరాల్లో వార్షిక ఆదాయం రూ.6 లక్షలు అంతకు మించి ఉన్న కుటుంబాలు ఎక్కువగా తమ నిత్యావసరాలు, చిరుతిళ్లు, గిఫ్టులు, పర్సనల్ కేర్ ఉత్పత్తుల కోసం క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌ను ఆశ్రయిస్తున్నాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,600 ▲	91,300 ▲	1,14,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,00,350 ▲
విశాఖపట్నం	1,01,120 ▲	91,300 ▲	1,14,000 ▲
రాజమండ్రి	99,600 ▲	91,200 ▲	1,04,300 ▲
ప్రొద్దుటూరు	96,800 ▲	89,060 ▲	1,00,500 ▲
ముంబై	98,163 ▲	89,917 ▲	1,04,675 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	535
వరంగల్	527	గోదావరి	515
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	105
కర్నూలు	110	నెల్లూరు	110
విశాఖపట్నం	101	అనంతపురం	110
గోదావరి	114		

రెండో రోజూ అదే జోరు

- సెన్సెక్స్ 444 పాయింట్లు అప్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా రెండో రోజూ లాభాల్లో పయనించాయి. రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్లతో పాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఇందుకు దోహదపడ్డాయి. గురువారం ఒక దశలో 913 పాయింట్ల వరకు ఎగబాకిన సెన్సెక్స్.. మదుపరుల లాభాల స్వీకరణ కారణంగా చివరికి 443.79 పాయింట్ల లాభంతో 81,442.04 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 130.70 పాయింట్ల వృద్ధితో 24,750.90 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 రాణించాయి. ఎటర్నల్ స్టాక్ 4.50 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 8 పైసలు పెరిగి రూ.85.79 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు పీపా ధర ఒక దశలో 0.35 శాతం పెరిగి 65.14 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.
- ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,000 పెరుగుదలతో సరికొత్త ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి రూ.1,04,100కు చేరింది. పది గ్రాముల మేలిమి బంగారం రూ.430 పెరుగుదలతో రూ.99,690 పలికింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ఒక దశలో 3,393 డాలర్లు, సిల్వర్ 35.80 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

బజాజ్ ఫిన్‌సర్వ్‌లో 1.6% వాటా విక్రయం: బజాజ్ ఫిన్‌సర్వ్‌లో 1.6 శాతం వాటాను ప్రమోటర్ కంపెనీలైన బజాజ్ హోల్డింగ్స్, జమన్‌లాల్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ విక్రయించనున్నట్లు తెలిసింది. శుక్రవారం బ్లాక్ డీల్స్ రూపంలో జరగనున్న ఈ విక్రయం ద్వారా ప్రమోటర్ కంపెనీలకు రూ.4,750 కోట్ల వరకు సమకూరవచ్చని అంచనా.




స్పోర్ట్స్

పోలీసులు వద్దన్నా ససేమిరా ?

వారి సూచనలు పాటిస్తే ఈ ఘోరం జరిగేది కాదేమో!

బెంగళూరు : రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు ఐపీఎల్ టైటిల్ గెలవడమేమోగానీ..చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగి 11 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ గాయపడ్డారు. ఆర్‌సీబీ జట్టు ఐపీఎల్ విజేతగా నిలిచిన తర్వాత...ఆ రాత్రి చాలా సమయం వరకు అహ్మదాబాద్‌లో ఆ జట్టు వేడుకల్లో మునిగిపోయింది. అనంతరం ప్రత్యేక విమానంలో బెంగళూరు వచ్చింది. అయితే భద్రతా కారణాల రీత్యా విజయోత్సవ పరేడ్ వద్దని, జట్టు ఆటగాళ్ల సన్మాన కార్యక్రమం కూడా వద్దని, తర్వాత తీరిగ్గా.. అంటే ఆదివారం ఏర్పాటు చేసుకోవాలని కర్ణాటక ప్రభుత్వానికి, ఆర్‌సీబీ యాజమాన్యానికి పోలీసులు సూచించినట్టు తెలిసింది. 'బుధవారం విజయోత్సవాలు వద్దని మంగళవారమే సూచించాం. అభిమానులు చాలా ఉద్వేగంగా ఉన్నారని, అందువల్ల సన్మానాన్ని నాలుగు రోజుల అనంతరం పెట్టుకోవాలని సర్కారుకు, ఆర్‌సీబీ యాజమాన్యానికి సలహా ఇచ్చాం. ర్యాలీ వద్దని, వేడుకను ఒకే ప్రాంతానికి పరిమితం చేయాలని కూడా సూచించాం' అని పోలీసులను ఉటంకిస్తూ జాతీయ మీడియా గురువారం వెల్లడించింది. కానీ ఆదివారం వరకూ విదేశీ క్రికెటర్లు ఉండరని భావించిన మేనేజ్‌మెంట్ బుధవారంనాడే సంబరాలను నిర్వహించింది. అయితే పోలీసుల సూచనలను పెడచెవిన పెట్టి విజయోత్సవం నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఉత్సవాలకన్నా..ప్రాణాలు మిన్న : కపిల్‌దేవ్

బెంగళూరు జట్టు విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోవడంపట్ల దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్ విచారం ప్రకటించాడు. 'పలువురు ప్రాణాలు కోల్పోయారన్న వార్త ఎంతో బాధ కలిగించింది. సంబరాల కన్నా ప్రాణాలు ముఖ్యం' అని వ్యాఖ్యానించాడు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండి.. జాగ్రత్తలు తీసుకోవాలని కపిల్ హితవు పలికాడు.

ఘటన కలిచివేసింది : కోహ్లీ

తొక్కిసలాట ఉదంతం తనను కలచి వేసిందని కోహ్లీ అన్నాడు. 'ఈ ఘటనతో నాకు మాటలు రావడంలేదు. తీవ్ర విషాదంతో విచారంలో మునిగిపోయా' అని సోషల్ మీడియాలో విరాట్ పోస్ట్ చేశాడు.

అంత తొందరేల : మదన్‌లాల్ మండిపాటు

ఫైనల్ మరునాడే విజయోత్సవాన్ని నిర్వహించేందుకు ఆర్‌సీబీ యాజమాన్యం ప్రయత్నించడాన్ని 1983 వన్డే వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టు సభ్యుడు మదన్‌లాల్ తప్పుపట్టాడు. 'అంతకుముందు రోజు రాత్రే అహ్మదాబాద్‌లో సంబరాలు నిర్వహించుకున్నారు. మరునాడే బెంగళూరులో విజయోత్సవ ర్యాలీ పెట్టుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది. సరైన ప్రణాళిక లేకుండా కార్యక్రమం నిర్వహించడంవల్ల అమాయకులు బలయ్యారు' అని మదన్‌లాల్ ఆగ్రహం వ్యక్తంజేశాడు.

రోడ్‌షోలు కూడదు : గంభీర్

ఆర్‌సీబీ విజయోత్సవ ర్యాలీని భారత జట్టు కోచ్ గంభీర్ కూడా తప్పుబట్టాడు. 'ఎప్పుడూ రోడ్‌షోలు నిర్వహించకూడదు. ప్రజల ప్రాణాలు ఎంతో విలువైనవి. ఇలాంటి కార్యక్రమాలు తెరవెనుక జరగాలి. మేము 2007 టీ20 వరల్డ్ కప్ గెలిచినప్పుడు కూడా రోడ్‌షో చేయకుండా ఉంటే బావుండేది' అని గంభీర్ అన్నాడు.

విరాట్‌కు తెలిసుండదు : వాసన్

తొక్కిసలాట జరిగి పలువురు మృతి చెందిన విషాదం గురించి కోహ్లీకి తెలిసివుండదని టీమిండియా మాజీ ఆటగాడు అతుల్ వాసన్ అభిప్రాయపడ్డాడు. 'తొక్కిసలాట జరిగి ఫ్యాన్స్ మరణించారనే విషయం సంబరాలు జరుగుతున్న సమయంలో కోహ్లీకి తెలియకపోయి ఉండొచ్చు. రాజకీయ నాయకులకు, ఆర్‌సీబీ ఫ్రాంచైజీకి తెలిసినా..వారు స్వప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తారు. విరాట్, ఇతర ఆటగాళ్లకు తెలియకపోయి ఉండొచ్చు. ఒకవేళ ఆ దారుణ ఘటన గురించి కోహ్లీకి తెలిస్తే విజయోత్సవాల్లో పాల్గొనకుండా అక్కడ నుంచి వెళ్లిపోయి ఉండేవాడు' అని వాసన్ అన్నాడు.

బుమ్రా ఆడేది..3 టెస్టులే

టీమిండియా కోచ్ గంభీర్



ముంబై : ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్‌లో జస్‌ప్రీత్ బుమ్రా మూడు టెస్ట్‌ల్లోనే బరిలోకి దిగుతాడని టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్ వెల్లడించాడు. కొత్త సారథి శుభ్‌మన్ గిల్‌తో కలిసి గంభీర్ గురువారం మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. 'ఐదు టెస్ట్‌ల్లో ఏ మూడు మ్యాచ్‌ల్లో బుమ్రా ఆడతాడో మేం ఇంకా నిర్ణయించలేదు. సిరీస్‌లో వచ్చే ఫలితాలను బట్టి బుమ్రాతో చర్చించాక తుది నిర్ణయం తీసుకుంటాం. అయితే తాను అన్ని టెస్టులూ ఆడబోవడంలేదని బుమ్రాకు కూడా తెలిసి ఉండొచ్చు' అని గంభీర్ తెలిపాడు. 'బుమ్రా స్థానాన్ని భర్తీ చేయడం కష్టం. అయితే జట్టులో నాణ్యమైన పేసర్లున్నారు. తమకు వచ్చిన అవకాశాలను యువ బౌలర్లు అందిపుచ్చుకోవాలి' అని గంభీర్ అన్నాడు.

సింధుకు నిరాశే!

క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్



జకార్తా: స్టార్ షట్లర్ పీవీ సింధు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతూనే ఉంది. తాజాగా ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 టోర్నమెంట్‌లోనూ పరాజయమే ఎదురైంది. గురువారం ఉత్కంఠభరితంగా సాగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో సింధు 22-20, 10-21, 18-21 తేడాతో థాయ్‌లాండ్ క్రీడాకారిణి పోర్న్‌పవి చౌచువాంగ్ చేతిలో ఓడింది. చివరి గేమ్‌లో 18-18తో హోరాహోరీగా కనిపించినా.. వరుసగా మూడు పాయింట్లు కోల్పోవడంతో సింధుకు ఓటమి తప్పలేదు. అలాగే మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీష్ కరుణాకరన్-ఆద్య జోడీ, మహిళల డబుల్స్‌లో గాయత్రి-ట్రీసాలకు కూడా రెండో రౌండ్‌లో ఓటమి ఎదురైంది.

గాయం తర్వాత కేవలం రెండో టోర్నీ ఆడుతున్న సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి అదరగొట్టింది. రెండేళ్ల క్రితం ఇక్కడ చాంపియన్‌గా నిలిచిన వీరు పోటాపోటీగా సాగిన రెండో రౌండ్‌లో 16-21, 21-18, 22-20తో రాస్మస్ జార్-ఫ్రెడెరిక్ సొగార్డ్ (డచ్)పై నెగ్గి క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

వోక్స్, ఒవర్టన్‌కు చోటు

భారత్‌తో తొలి టెస్టుకు ఇంగ్లండ్ జట్టు



స్టోక్స్ (కెప్టెన్)

లండన్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య ఈనెల 20 నుంచి ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది. దీనిలో భాగంగా హెడింగ్లేలో జరిగే తొలి టెస్టు కోసం 14 మందితో కూడిన ఇంగ్లండ్ జట్టును ప్రకటించారు. 2022లో చివరి టెస్టు ఆడిన పేసర్ జేమీ ఒవర్టన్‌తో పాటు ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్‌కు పిలుపందింది. గత నెల 29న వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో ఒవర్టన్ గాయపడ్డాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ మెడికల్ టీమ్ పర్యవేక్షణలో ఉండగా.. మ్యాచ్ సమయానికి అందుబాటులో ఉంటాడని జట్టు ఆశిస్తోంది. అలాగే గాయాల నుంచి కోలుకున్న పేసర్లు బ్రైడన్ కార్స్, క్రిస్ వోక్స్‌లతో పాటు లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ జేకబ్ బెథెల్ జట్టులోకి వచ్చారు. కాగా కాగా, జోఫ్రా ఆర్చర్ రెండో టెస్టుకు అందుబాటులో ఉంటాడని సమాచారం.

తొలి టెస్టుకు ఇంగ్లండ్ జట్టు: బెన్ స్టోక్స్ (కెప్టెన్), హ్యారీ బ్రూక్, బెన్ డకెట్, ఒల్లీ పోప్, జో రూట్, బ్రైడన్ కార్స్, సామ్ కుక్, ఒవర్టన్, జాక్ క్రాలే, బెథెల్, జేమీ స్మిత్, టోంగ్, క్రిస్ వోక్స్, షోయబ్ బషీర్.

హెచ్‌సీఏ కమిటీలను కొనసాగించాలి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు నేతృత్వంలోని ఏక సభ్య సంఘం నియమించిన సెలక్షన్ కమిటీలు, లీగ్ మ్యాచ్‌ల పర్యవేక్షణకు హైకోర్టు నియమించిన జస్టిస్ నవీన్‌రావు నేతృత్వంలోని సూపర్‌వైజరీ కమిటీని కొనసాగించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)ను హైకోర్టు ఆదేశించింది. గత ఏడాది నుంచి హెచ్‌సీఏ ఏజీఎం నిర్వహించలేదని, ఏజీఎంలో నిర్ణయాలు తీసుకునే వరకు పాత సెలక్షన్ కమిటీలను కొనసాగించాలని జై హనుమాన్ క్రికెట్ క్లబ్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు హెచ్‌సీఏ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసే వరకు ఈ కమిటీలు యథాతథంగా కొనసాగుతాయని మధ్యంతర ఉత్తర్వులను ఇచ్చింది.

స్వియటెక్‌కు షాక్

26 వరుస విజయాలకు బ్రేక్

- ఫైనల్లో సబలెంక
- గాఫ్‌తో అమీతుమీ
- ఫ్రెంచ్ ఓపెన్



సబలెంక

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో ఈసారి నయా చాంపియన్ రానుంది. ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ ఫైనల్‌కు చేరిన వరల్డ్ నెంబర్‌వన్ ఎరీనా సబలెంక-రెండో సీడ్ కోకో గాఫ్ శనివారం టైటిల్ కోసం తలపడనున్నారు. అటు వరుసగా మూడుసార్లు ఫ్రెంచ్ ఓపెన్‌లో చాంపియన్‌గా నిలుస్తూ వస్తోన్న ఐదో సీడ్ ఇగా స్వియటెక్‌కు చుక్కెదురైంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఎరీనా సబలెంక (బెలారస్) 7-6 (7-1), 4-6, 6-0 తేడాతో గెలిచి తొలిసారి ఫైనల్లో అడుగుపెట్టింది. అలాగే రొలాండ్ గారోస్‌లో స్వియటెక్ 26 వరుస విజయాలకు కూడా ఈ ఓటమితో బ్రేక్ పడినట్టయ్యింది. 2020లో తొలిసారి ఇక్కడ విజేతగా నిలిచిన స్వియటెక్ ఆ తర్వాత 2022, 2023, 2024లోనూ గ్రాండ్‌స్లామ్ అందుకుంది. పైగా క్లే కోర్టుల్లో సబలెంకపై 5-1తో ఆధిక్యంలో ఉండడంతో ఈ మ్యాచ్ ఫలితంపై ఆసక్తి ఏర్పడింది.

గాఫ్ అలవోకగా..: వైల్డ్‌కార్డ్ ప్లేయర్ లూయిస్ బోయిసన్ సంచలన ప్రదర్శన ముగిసింది. రెండో సీడ్ కోకో గాఫ్ (యూఎస్‌ఏ) 6-1, 6-2 తేడాతో బోయిసన్‌పై సునాయాసంగా గెలిచి ఫైనల్లో అడుగుపెట్టింది. ఫ్రాన్స్‌కు చెందిన ప్రపంచ 361వ ర్యాంకర్ బోయిసన్ మేటి క్రీడాకారిణులను మట్టి కరిపిస్తూ కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌కు చేరింది. అయితే గాఫ్‌కు ఏమాత్రం పోటీనివ్వలేకపోయింది.

జ్వెరెవ్‌ను ఓడించి జొకో: పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ జొకోవిచ్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. బుధవారం రాత్రి జరిగిన ఈ పోరులో తను జ్వెరెవ్ (జర్మనీ)పై 4-6, 6-3, 6-2, 6-4 తేడాతో నెగ్గాడు. దీంతో శుక్రవారం జరిగే సెమీస్‌లో సిన్నర్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు.

కోహ్లీ 18...కానీ సచిన్ 22

● వీరేంద్ర సెహ్వాగ్



న్యూఢిల్లీ: సచిన్ టెండూల్కర్ వన్డే వరల్డ్‌కప్ నిరీక్షణతో పోలిస్తే ఐపీఎల్ ట్రోఫీ కోసం విరాట్ కోహ్లీ ఎదురు చూసింది తక్కువేనని మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. ఐపీఎల్ ట్రోఫీ కోసం కోహ్లీ 18 ఏళ్లు ఎదురు చూస్తే, వన్డే వరల్డ్‌కప్ కోసం సచిన్ 1989 నుంచి 2011 (22 ఏళ్లు) వరకు నిరీక్షించాల్సి వచ్చిందని అన్నాడు. సచిన్ సుదీర్ఘకాలం వేచి చూశాడే కానీ ఎప్పుడు తన నమ్మకాన్ని కోల్పోలేదని చెప్పాడు. 'డబ్బులు వస్తుంటాయ్.. పోతుంటాయ్.. కానీ ట్రోఫీలు సాధించడం సులువు కాదు. మొత్తానికి కోహ్లీ నిరీక్షణ కూడా ఫలించింది. ఆర్‌సీబీ ట్రోఫీ సాధించడంలో కోహ్లీ పాత్ర విలువైనది. ఇక తను ఎప్పుడు అనుకుంటే అప్పుడు ఐపీఎల్‌నుంచి ఆనందంగా తప్పుకోవచ్చు' అని చెప్పుకొచ్చాడు.

అథ్లెట్ వర్షపై మూడేళ్ల నిషేధం

న్యూఢిల్లీ : లాంగ్‌డిస్టెన్స్ రన్నర్ వర్ష టీకమ్‌పై మూడేళ్ల నిషేధం విధించారు. అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఏఐయూ) డోప్ టెస్ట్‌కు నమూనాలను ఇచ్చేందుకు నిరాకరించడంతో ఆమెపై ఈ చర్య తీసుకున్నారు. నిరుడు జరిగిన పుణె హాఫ్ మారథాన్‌లో వర్ష రెండో స్థానంలో నిలిచింది. గత నెల 26న ఆమెపై తాత్కాలిక సస్పెన్షన్ విధించారు. డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించినట్టు ఆమె అంగీకరించడంతో తాజాగా మూడేళ్ల నిషేధం విధించినట్టు ఏఐయూ గురువారం వెల్లడించింది. గత నెల 20 నుంచి వర్షపై నిషేధం అమలులోకి వచ్చినట్టు పేర్కొంది.










చిత్రజ్యోతి
SINCE 1965

సంక్రాంతి బరిలో..



రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. గురువారం ఈ చిత్రాన్ని ప్రారంభించి పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రవితేజ ఓ విమానం సీటులో సూట్ ధరించి స్టైలిష్ లుక్‌లో కనిపించారు. 'ఆర్‌టీ76' వర్కింగ్ టైటిల్. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. "దర్శకుడు కిశోర్ తిరుమల అద్భుతమైన స్క్రిప్ట్ సిద్ధం చేశారు. ఈ సినిమా రవితేజ మార్క్ కామెడీతో పూర్తి స్థాయి కుటుంబ కథా చిత్రంగా ఉండనుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది" అని మేకర్స్ తెలిపారు. ఈ నెల 16 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెడుతున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, డీఓపీ: ప్రసాద్ మూరెళ్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

పళని దేవాలయంలో పూజలు



సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ చిత్రం (సూర్య 46-వర్కింగ్ టైటిల్) ప్రారంభమైన విషయం తెలిసిందే. టాలీవుడ్ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నాయి. వెంకీ అట్లూరి, నిర్మాత నాగవంశీతో కలసి హీరో సూర్య గురువారం పళని మురుగన్ ఆలయాన్ని దర్శించారు. మురుగన్ స్వామికి స్క్రిప్ట్‌ను సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ వీరికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. 'లక్కీ భాస్కర్' ఘన విజయం తర్వాత వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న చిత్రమిది. సూర్యకు తొలి తెలుగు స్ట్రెయిట్ చిత్రం ఇదే. 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

ఆమిర్‌ఖాన్‌తో లోకేశ్ సినిమా




విలక్షణ నటుడు ఆమిర్‌ఖాన్ బాస్కెట్ బాల్ కోచ్‌గా నటించిన 'సితారే జమీన్ పర్' చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఇందులో జెనీలియా కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా తర్వాత తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ సూపర్ హీరో కథాంశంతో రూపొందించే చిత్రంలో నటించడానికి ఆమిర్ అంగీకరించారు. 'భారీ స్థాయిలో రూపుదిద్దుకొనే యాక్షన్ సినిమా ఇది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో షూటింగ్ మొదలవుతుంది. ఇంతకు మించిన వివరాలు ఇప్పుడు చెప్పలేను' అని ఓ ఆంగ్ల మీడియాకు గురువారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమిర్‌ఖాన్ వెల్లడించారు. గతంలో తను నటించిన 'పీకే' చిత్రానికి సీక్వెల్ రాబోతోందన్న వార్తల్లో నిజం లేదనీ, అటువంటి ఆలోచన లేదని ఆమిర్ స్పష్టం చేశారు. భారతీయ సినిమా పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్‌లో తను నటించనున్నానని, దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీతో కలసి ఆ సినిమా కోసం పని చేస్తున్నట్లు ఆమిర్ చెప్పారు.

కొత్త పాటతో రీ రిలీజ్



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన బ్లాక్‌బస్టర్ హిట్ 'లక్ష్మీనరసింహ' చిత్రం మరోసారి ప్రేక్షకులను థియేటర్లలో అలరించనుంది. జయంత్ సీ పరాన్జీ దర్శకత్వంలో బెల్లంకొండ సురేశ్ నిర్మించిన ఈ చిత్రం 2004లో విడుదలైంది. ఈ చిత్రాన్ని ఈ నెల 8న రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నిర్మాత బెల్లంకొండ సురేశ్ మాట్లాడుతూ '21 ఏళ్ల తర్వాత 'లక్ష్మీ నరసింహ'ను విడుదల చేస్తున్నాం. అప్పట్లో చిత్రీకరించిన ఒక పాటను నిడివి దృష్ట్యా పక్కనపెట్టాం. ఆ నెగిటివ్‌ను వెతికిపట్టుకొన్నాం. అయితే ఆడియో మాత్రం దొరకలేదు. దాంతో చంద్రబోస్‌కు, భీమ్స్ సిసిరోలియోకు చూపించి, కొత్త పాటను రాయించి, రికార్డ్ చేశాం. 'మందేసినోడు' అంటూ సాగే ఈ పాట రీ రిలీజ్‌లో ప్రత్యేకాకర్షణ అవుతుంది' అన్నారు. జయంత్ సీ పరాన్జీ మాట్లాడుతూ 'పాత ఫుటేజ్‌కు ఆడియోను యాడ్ చేసి, అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు సురేశ్‌గారు' అని అన్నారు.

విశాల్‌కు మద్రాసు హైకోర్టు ఆదేశం



- రూ.21.29 కోట్లను 30 శాతం వడ్డీతో చెల్లించండి

లైకా సంస్థకు రూ.21.29 కోట్లను 30 శాతం వడ్డీతో చెల్లించాలని నటుడు విశాల్‌ను మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. 'విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ' చిత్ర నిర్మాణ సంస్థ కోసం సినీ ఫైనాన్షియర్ అన్బుచెళియన్ నుంచి విశాల్ రూ.21.29 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ రుణాన్ని వివిధ కారణాలతో 'లైకా ప్రొడక్షన్' సంస్థ ఫైనాన్షియర్‌కు చెల్లించింది. అయితే లైకా సంస్థకు విశాల్ ఆ రుణం తిరిగి చెల్లించలేదు. దాంతో ఆ రుణం పూర్తిగా చెల్లించే వరకు విశాల్ చిత్ర నిర్మాణ సంస్థ నిర్మించే అన్ని చిత్రాల హక్కులు లైకా సంస్థకు చెందేలా ఒప్పందం కుదిరింది. అయితే ఒప్పందాన్ని అతిక్రమించి, విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ చిత్రాలు విడుదల చేస్తోందని, రుణం చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ గతంలో లైకా సంస్థ నిర్వాహకులు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు లైకా సంస్థకు రూ.21.29 కోట్లను 30 శాతం వడ్డీతో చెల్లించాలని విశాల్‌ను ఆదేశించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ప్రేక్షకులను మెప్పించే ప్రేమకథ



అమర్‌దీప్ చౌదరి, సుప్రీతా నాయుడు జంటగా నటిస్తున్న చిత్రం 'చౌదరిగారి అబ్బాయితో నాయుడుగారి అమ్మాయి'. మాల్యాద్రిరెడ్డి దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. ఇటీవలె నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ 'షూటింగ్ పూర్తి చేశాం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. గాఢతతో నిండిన ప్రేమకథాంశంతో రూపొందించిన చిత్రమిది. హీరో హీరోయిన్ల అభినయం మా సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తుంది. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగులతో దర్శకుడు చిత్రాన్ని రూపొందించారు' అని చెప్పారు. మంచి పాటలు, ఆకట్టుకునే రొమాంటిక్ సన్నివేశాలు, కట్టిపడేసే భావోద్వేగాలు, అదరగొట్టే యాక్షన్ సీక్వెన్స్ ఈ చిత్రంలో మిళితమై ఉంటాయి' అని అమర్‌దీప్ చౌదరి చెప్పారు.

నా తల్లే నాకు కన్నప్ప

-మోహన్‌బాబు



మంచు విష్ణు హీరోగా ముఖేశ్ కుమార్ సింగ్ తెరకెక్కించిన చిత్రం 'కన్నప్ప'. మోహన్‌బాబు కీలక పాత్రలో నటించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా మోహన్‌బాబు ఓ వీడియో విడుదల చేశారు. ఇందులో తన తల్లిదండ్రుల గురించి మాట్లాడుతూ ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. "ఓ అమాయకుడు, ఆటవికుడైన తిన్నడు, ఆ పరమేశ్వరునికి తన కళ్లు ఇచ్చి కన్నప్పగా చరిత్రలో మిగిలిపోయారు. మన ఆకలి తెలుసుకున్న అమ్మ, అడగకుండానే అన్నం పెడుతుంది. మనకు ఏది కావాలనుకుంటే అది, వారికి శక్తికి మించి ఉన్నా కూడా మన అమ్మానాన్నలు అందిస్తారు. నా దృష్టిలో మా అమ్మానాన్నలు నాకు కన్నప్పలు. మా అమ్మ పేరు లక్ష్మమ్మ. దురదృష్టవశాత్తు పుట్టుక నుంచే ఆమెకు రెండు చెవులూ వినిపించేవి కావు. ఆ మహాతల్లికి పరమేశ్వరుడు ఐదుగురు సంతానాన్ని ప్రసాదించాడు. మా ఊరు టౌన్‌కు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉండేది. ఓ కాలువ, సువర్ణముఖి నదిని దాటితే గాని ఊరిని చేరలేం. దారి కూడా అంతంతమాత్రమే. మా ఐదుగురిని మోసుకుంటూ ఆమె ఆ కష్టమైన దారిలోనే ప్రయాణించేది. అది ఎంత కష్టమో ఒక్కసారి ఆలోచించండి. మా కోసం ఆమె చేసినవి గుర్తొస్తే బాధేస్తుంది. నా గొంతును అందరూ మెచ్చుకుంటునప్పుడు 'ఈ మాటలు నా తల్లి వింటే ఎంత బాగుండేది పరమేశ్వరా' అని అనుకునేవాడిని. నాకు నా కన్నతల్లే కన్నప్ప" అని పేర్కొన్నారు.

కట్టప్ప జడ్జిమెంట్



'బాహుబలి' కట్టప్ప పాత్రధారి సత్యరాజ్ ప్రధాన పాత్రలో నటించిన తమిళ చిత్రం 'తీర్పుగల్ విర్కపడుమ్'. ధీరన్ దర్శకుడు. అక్కడ మంచి విజయం అందుకున్న ఈ చిత్రాన్ని 'కట్టప్ప జడ్జిమెంట్' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు నిర్మాత వెంకటస్వామి. ఈ నెల 13న 'కట్టప్ప జడ్జిమెంట్' చిత్రాన్ని విడుదల చేస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కట్టప్ప ఏ విషయంలో ఏ తీర్పు ఇచ్చాడనేది ఆసక్తికరంగా ఉంటుంది. పూర్తి మాస్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది. సత్యరాజ్ నటన సినిమాకు ప్రత్యేకాకర్షణ' అని చెప్పారు. 'సినిమా చూసిన తర్వాత నా పాత్రకు పరిపూర్ణ న్యాయం చేశాననే ఫీలింగ్ కలిగింది' అని సత్యరాజ్ అన్నారు.





ఒప్పంద పత్రాలతో విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఐసీసీఆర్, ఏపీ అధికారులు

రాష్ట్రంలోని సాంస్కృతిక సంస్థలకు మరింత ఊతం

» ఐసీసీఆర్‌తో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం

న్యూఢిల్లీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక దౌత్యం, అంతర్జాతీయ సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించుకోవడం కోసం భారతీయ సాంస్కృతిక సంబంధాల మండలి(ఐసీసీఆర్)తో రాష్ట్రప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం, ఐసీసీఆర్ కార్యాలయంలో జరిగిన ఈ ఒప్పందంపై విదేశాంగ శాఖ సంయుక్త కార్యదర్శి, ఐసీసీఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మనీషా స్వామి, రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు సంతకాలు చేశారు. కార్యక్రమానికి ఐసీసీఆర్ డైరెక్టర్ జనరల్ నందిని సింగ్లా, ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ ఆర్జా శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ ఒప్పందంతో ఏపీలోని సాంస్కృతిక సంస్థలు బలోపేతం కావడంతో పాటు అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలు మెరుగుపడతాయి. ప్రపంచ సాంస్కృతిక రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రాధాన్యం ఈ ఒప్పందంతో మరింత ఇనుమడించనుంది.

జగన్ జమానాలో రేషన్ అక్రమాలు

» ఐదేళ్ల అవినీతిపై విచారణ జరపాలి: లీలా మాధవరావు

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పంపిణీలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని రేషన్ డీలర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్డుదారులకు మెరుగైన సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని పునఃప్రారంభించడంపై జగన్ చేసిన విమర్శలను ఆయన గురువారం ఓ ప్రకటనలో తప్పుపట్టారు. 'టీడీపీ హయాంలో ప్రజాపంపిణీ వ్యవస్థ దేశంలోనే నంబర్ వన్‌గా ఉండేది. వైసీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా దిగజార్చి పూర్తిగా భ్రష్టు పట్టించింది. రేషన్ అక్రమ రవాణాకు దోహదపడుతున్న రేషన్ వాహనాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ఎండీయూ ఆపరేటర్ల తరఫున వైసీపీ వకాల్తా పుచ్చుకుంది. నిధులు సమకూర్చి మరీ కోర్టులో పిటిషన్ వేయించింది. అవసరమైతే రేషన్ డీలర్ల సంఘం తరఫున మేంకూడా ఇంప్లీడ్ అవుతాం' అని తెలిపారు.

పామాయిల్‌కు కనీస మద్దతు ధర కల్పించండి

» కేంద్రానికి ఎంపీ పుట్టా మహేష్ వినతి

న్యూఢిల్లీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఏపీలో పామాయిల్ సాగు చేస్తున్న రైతులకు కనీస మద్దతు ధర కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం, వాణిజ్య భవన్‌లో కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్‌కు వినతి పత్రం అందజేశారు. 2025 మే 31న విడుదలైన కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకుంటూ, క్రూడ్ ఎడిబుల్ ఆయిల్స్‌పై 50 శాతం కస్టమ్స్ డ్యూటీ విధించడం ద్వారా రైతులకు ఒక్కో మెట్రిక్ టన్నుకు రూ.22,000 లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

సజ్జల భూములపై.. సింగిల్ జడ్జి ఉత్తర్వులకు పాక్షిక సవరణ

» ఇప్పటికే 63 ఎకరాలు స్వాధీనం చేసుకున్న అధికారులు

» వాటిపై యథాతథ స్థితికి హైకోర్టు ధర్మాసనం ఆదేశం

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సీకేదిన్నె మండలం పరిధిలో వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి సోదరుల కుటుంబ సభ్యుల అధీనంలో ఉన్న భూముల విషయంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు ధర్మాసనం పాక్షికంగా సవరించింది. వాటిపై యథాతథ స్థితి పాటించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. సీకే దిన్నె మండలంలో 63.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటూ గత నెల 21న జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ సజ్జల కుటుంబ సభ్యులు పిటిషన్ దాఖలు చేశారు. ఆయా సర్వే నంబర్లలో తమకున్న 201.17 ఎకరాల భూముల విషయంలో అధికారులు జోక్యం చేసుకోకుండా నిలువరించాలని కోరారు. దీనిపై వ్యాజ్యం రాగా ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి.. కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌పై స్టే విధించారు. దీనిని ప్రభుత్వం అప్పీల్ వేసింది. ఈ అప్పీల్ గురువారం విచారణకు రాగా.. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. 'పిటిషనర్ల అధీనంలో 63.72 ఎకరాల అటవీ, ఇరిగేషన్, అసైన్డ్ భూమి ఉందని అధికారులు గుర్తించారు. అయితే దశాబ్దాలుగా ఆ భూములు తమ అధీనంలో ఉన్నాయని చెబుతున్నారు తప్ప వాటి రికార్డులను పిటిషనర్లు అధికారుల ముందు ఉంచలేదు. ఈ నేపథ్యంలో భూములు స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన మెమోను పరిగణనలోకి తీసుకోకుండా సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇవ్వడం సరికాదు. వాటిని కొట్టివేయాలి' అని కోరారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం అధికారులు నిర్వహించిన పంచనామా చెల్లుబాటు కాదన్నారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఉత్తర్వులను పాక్షికంగా సవరించింది.

తెలంగాణ ఉద్యోగులకు రెండు డీఏలు!

హైదరాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రెండు డీఏలు ఇవ్వాలని నిర్ణయించింది. ఒక కరువు భత్యాన్ని(డీఏ) వెంటనే, మరొక డీఏను వచ్చే ఏప్రిల్‌లో ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డీఏల్లో ఒకదాన్ని వెంటనే చెల్లిస్తామన్నారు. మరో డీఏను వచ్చే ఏప్రిల్‌లో ప్రకటించాలని నిర్ణయించారు.

విద్యార్థి దశలోనే యోగా శిక్షణ: అయ్యన్న

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్రకు నాంది పలికేలా, యోగా ప్రతి ఒక్కరి జీవన విధానం అయ్యేలా, విద్యార్థి దశలోనే యోగా శిక్షణను తప్పనిసరి చేసేలా చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది అని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు యోగాను పాఠ్యాంశంగా చేసే అంశంపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామని తెలిపారు. యోగాంధ్రా-2025 కార్యక్రమంలో భాగంగా గురువారం అమరావతిలోని శాసనసభ ప్రాంగణంలో శాసనసభ ఉద్యోగులకు యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్పీకర్ మాట్లాడారు. 'ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొంటున్నారు. ఈ వేడుకల్లో దాదాపు ఐదు లక్షల మంది పాల్గొంటున్నారు. అందుకు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనేలా ఈ నెల 21 వరకూ యోగాంధ్ర-2025 కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుతూ కాలుష్య నియంత్రణకు కృషి చేయాలి' అని స్పీకర్ పిలుపునిచ్చారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ... విద్యార్థి దశ నుండే యోగాను పాఠ్యాంశంగా చేర్చితే మంచి ఫలితాలు ఉంటాయి. అందుకు తగ్గట్టుగా చట్టాన్ని రూపొందించే అంశంపై దృష్టి సారిస్తాం అని తెలిపారు. ఆయుష్ శాఖ వైద్యాధికారులు డాక్టర్ రామానందం, డాక్టర్ రత్న ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు అగ్రనేత

సుధాకర్ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఇరుపక్షాల నడుమ ఎదురుకాల్పులు జరిగాయని, కాల్పులు ఆగిన తర్వాత వెళ్లి చూడగా సుధాకర్ మృతదేహం కనిపించిందని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలంలో ఏకే 47ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆయన తలపై ఛత్తీస్‌గఢ్‌లో రూ. 40 లక్షల రివార్డు ఉంది. ఏపీ, ఒడిశా తదితర రాష్ట్రాలు ప్రకటించిన వెలలను కూడా కలిపితే ఆయనపై రూ.కోటికి పైగానే రివార్డు ఉంది.

ఎవరీ సుధాకర్?

మావోయిస్టు పార్టీని నడిపిస్తున్న అగ్రనేతల్లో సుధాకర్ ఒకరు. రివల్యూషనరీ పొలిటికల్ స్కూల్, రీజినల్ బ్యూరోలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతంలో (ఏవోబీ) మావోయిస్టు ఉద్యమానికి సుధాకర్ సుదీర్ఘకాలం నాయకత్వం వహించారు. ఎత్తుగడలు వేయడంలోనూ, ఉద్యమాన్ని విస్తృతపరచడంలోనూ ఆయనది అందెవేసిన చేయి అని పోలీసులు కూడా అంగీకరిస్తారు. ఆయన స్వగ్రామం ఏపీలోని ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలు. సుధాకర్‌ది అత్యంత పేద కుటుంబం. చదువు కోసం విజయవాడ వెళ్లిన తన సోదరుడు తిరిగి గ్రామానికి రానే లేదని ఆనందరావు చెబుతున్నారు. 40 ఏళ్ల క్రితం విద్యార్థి దశలో రాడికల్ సంఘం వైపు సుధాకర్ ఆకర్షితులయ్యారు. విజయవాడలో ఆయుర్వేద కళాశాలలో చదువుతున్నప్పుడే ఉద్యమబాట పట్టారు. 2004లో అప్పటి వై.ఎస్.రాజశేఖర్ ప్రభుత్వం మావోయిస్టులను శాంతి చర్చలకు ఆహ్వానించింది. మావోయిస్టు పార్టీ అగ్రనేతలు అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ, గణేశ్‌లతోపాటు సుధాకర్ అప్పుడు జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. చర్చల సందర్భంలో హైదరాబాద్‌లో కొంతకాలం బస చేశారు. అయితే, ఆ తర్వాత తిరిగి ఎప్పుడూ సుధాకర్ మైదాన ప్రాంతానికి రాలేదు. ప్రముఖ సినీ నటుడు కాకరాల కుమార్తెను ఉద్యమంలోనే పెళ్లి చేసుకున్నారు. కాగా ఏపీకే చెందిన మరో నేత, మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మరణించారు.

పట్టుకుని కాల్చేశారా?

సుధాకర్ ఎన్‌కౌంటరు పట్ల పౌర హక్కుల సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర కమిటీ సభ్యుడి హోదాలో సుధాకర్‌కు రెండంచెల భద్రత ఉంటుంది. ఒక వేళ ఎన్‌కౌంటర్ జరిగితే ఆయనతో పాటు ఉన్న అంగరక్షకులు కూడా మరణించే అవకాశం ఉంటుంది. కానీ ఘటనాస్థలంలో సుధాకర్ మృతదేహం మాత్రమే కనిపించింది. దీనిని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఆయనను ఎక్కడో పట్టుకుని ఛత్తీస్‌గఢ్‌కు తీసుకొచ్చి కాల్చేశారని ఆరోపిస్తున్నాయి. సుధాకర్ ఒంటిపై యూనిఫాం కాకుండా మామూలు చొక్కా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. సుధాకర్ మరణంపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాయి.



ఎన్‌కౌంటర్ ఘటనాస్థలంలో మావోయిస్టు నేత సుధాకర్ భౌతికకాయం

42 నుంచి 16కి..

» తగ్గిపోతున్న మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుల సంఖ్య

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన నర్సింహాచలం అలియాస్ సుధాకర్‌తో కలిపి ఈ ఏడాది ఇప్పటి వరకూ నలుగురు మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు కూడా ఉన్నారు. 2004లో నాటి పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ కలిసి మావోయిస్టు పార్టీగా ఏర్పడినపుడు 42 మందితో కేంద్రకమిటీ ఏర్పాటైంది. ఈ 21 ఏళ్లలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు, సహజమరణాలతో కేంద్ర కమిటీలోని సభ్యుల సంఖ్య 16కి తగ్గిపోయింది. రెండు దశాబ్దాల ప్రస్థానంలో మావోయిస్టు పార్టీ మధ్యభారతంలోని కొన్ని వేల కిలోమీటర్ల పరిధిలో జనతన సర్కార్ పేరుతో సమాంతర ప్రభుత్వాన్ని నడిపింది. అబూజ్‌మడ్ వంటి కంచుకోటలను ఏర్పాటు చేసుకుని నాయకులను, క్యాడర్‌ను కాపాడుకుంది. కానీ, ప్రస్తుతం కేంద్రప్రభుత్వం సాగిస్తున్న ఆపరేషన్ కగార్‌తో ఆ పార్టీ శ్రేణులు చెల్లాచెదరయ్యారు. వరుస ఎన్‌కౌంటర్లలో భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ఏడాది జనవరిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లోని కుల్హాదీఘూట్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడైన రామచంద్రారెడ్డి అలియాస్ జయరాం, అలియాస్ చలపతి మరణించారు. ఆ తర్వాత మే నెలలో బీజాపూర్ జిల్లా ఉసూర్ సమీపంలోని లంకపల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న మరణించారు. అదే నెలలో నారాయణపూర్‌లో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో ఏకంగా మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టు పార్టీ చరిత్రలో ఎన్‌కౌంటర్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి మరణించటం ఇదే ప్రథమం.



జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావును అభినందిస్తున్న మంత్రి అచ్చెన్న, చీఫ్ విప్ జీవీ

సహకార వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నాం

» వీలైనంత త్వరగా ఎన్నికలు: అచ్చెన్న

గుంటూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సహకార వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి అచ్చెన్నతోపాటు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తదితరులు హాజరై ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుల్లో రూ.కోట్లు లూటీ చేశారని మండిపడ్డారు. అక్రమంగా రుణాలు, కుంభకోణాలపై విచారణ జరిపి ఎంతటి వారినైనా వదిలేదిలేదన్నారు. అర్హులైన వారికి మాత్రమే సొసైటీల్లో సభ్యత్వాలుండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దఫా కౌలు రైతులకు కూడా రుణాలు అందించేలా పక్కాగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీలైనంత త్వరలో ఎన్నికలు జరిపి సహకార వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు. ప్రాథమిక పరమితి సంఘాలు, సెంట్రల్ బ్యాంకులను కంప్యూటరీకరణ చేశామని, ఈ నెల నుంచి ఆన్‌లైన్‌లోనే అన్ని లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలు వేస్తామన్నారు. నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి సీఎం చంద్రబాబు దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామని, గత ఏడాది కంటే మూడు రెట్లు ఉత్పత్తి పెరిగిందన్నారు. వీలైతే మార్క్‌ఫెడ్‌నూ రంగంలోకి దించి కొనుగోళ్లు జరిపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎల్లలకు ఆవల ఉన్న తెలుగు వారి ఆర్తి విందాం

» ఈ నేలతో అనుబంధాన్ని వారు కోరుకుంటున్నారు

» 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ ఉమామహేశ్వరరావు వెల్లడి

» 'తెలుగు జాడలు' పుస్తకంతో తెలుగు సమాజంలో కదలిక: రమేశ్

హైదరాబాద్ సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): దేశ ఎల్లలకు ఆవల ఉన్న తెలుగువారి ఆర్తిని మనం అర్థం చేసుకోలేకపోతున్నామని రచయిత, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని లామకాన్ వేదికగా గురువారం 'మరువం' చర్చా వేదిక ఆధ్వర్యంలో ఆయన రచించిన "తెలుగు జాడలు" పుస్తకంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల ఏళ్ల కిందట విదేశాలకు వలస వెళ్లిన తెలుగు వారు తిరిగి ఈ నేలతో ఆత్మీయానుబంధాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. వారి ఆర్తిని తెలుగువారు వినాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. "యాస, భాషల్లో మంచిచెడులు ఉండవు. దేన్నీ ఆరాధించాల్సిన అవసరం లేదు. అలాగని అసహ్యించుకోవాల్సిన పని లేదు" అని తెలుగు నెరవు నిర్వాహకుడు రమేశ్ పేర్కొన్నారు. చర్చాగోష్ఠిలో ఆత్మీయ అతిథిగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతి పెద్ద పది సుదీర్ఘ కథనాల్లో ఏడు తెలుగు భాష, సంస్కృతికి సంబంధించినవి కాగా, వీటిలో మూడు స్వీడన్, నార్వే దేశాలకు చెందినవని చెప్పారు. తెలుగు జాడలు పుస్తకం.. కళలు, సంస్కృతి పరిరక్షణ పట్ల తెలుగు సమాజంలో ఒక కదలికను తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుమనస్పతి రెడ్డి సమన్వయంలో సాగిన కార్యక్రమంలో ఇతర దేశాల్లోని తెలుగు వారి వివరాలను సుబ్బారెడ్డి ప్రస్తావించారు. ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికలో ప్రచురితమైన సమయంలోనే ఈ కథనాలన్నింటినీ తాము ఆసక్తిగా చదివినట్లు కొందరు వక్తలు సభలో చెప్పారు. కార్యక్రమంలో పాత్రికేయులు కె.శ్రీనివాస్, వేమన వసంతలక్ష్మి, అల్లం నారాయణ, కట్టా శేఖర్ రెడ్డి, దర్శకుడు అంకురం ఉమామహేశ్వరరావు, కుప్పిలి పద్మ, సజయ, ఖదీర్ బాబు, అనీల్ అట్లూరి, చిలుకూరి ఉమామహేశ్వర శర్మ, కోడూరి విజయ్ కుమార్, ఒమ్మి రమేష్‌బాబు, పులికొండ సుబ్బాచారి, చందూ శివన్న, రమేష్ కార్తీక్ నాయక్, డీపీ అనూరాధ, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.



చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న రమేశ్, చిత్రంలో ఆర్ఎం ఉమామహేశ్వరరావు, సుబ్బారెడ్డి

విద్యుత్ శాఖకు మద్దాళి గిరి 42 కోట్లు ఎగనామం

» గత ప్రభుత్వంలో పేరుకుపోయిన బకాయిలు

» స్పిన్నింగ్ మిల్లుల బిల్లులు చెల్లించని వైనం

» కూటమి సర్కారు వచ్చాక కనెక్షన్లు కట్

» మాజీ ఎమ్మెల్యే ఆస్తులపై ఆర్ఆర్ యాక్టు?

గుంటూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సామాన్య వినియోగదారులు ఎవరైనా విద్యుత్ బకాయి రూ.500 ఉన్నా అధికారులు నిర్దాక్షిణ్యంగా కనెక్షన్ కట్ చేస్తారు. కానీ గత ప్రభుత్వంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కోట్లలో బకాయిలు పెట్టినా అధికారులు అటువైపు కూడా చూడలేదు. ఆయన తన స్పిన్నింగ్ మిల్లులకు సంబంధించి ఏకంగా రూ.42 కోట్లకు ఎగనామం పెట్టారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక చర్యలు మొదలయ్యాయి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి 2019లో టీడీపీ తరఫున గెలిచిన మద్దాళి గిరి.. అప్పట్లో వైసీపీ అధికారంలోకి రావటంతో పార్టీని వీడి అధికార పార్టీ పంచన చేరారు. అప్పటికే కొద్ది పాటి విద్యుత్ బకాయిలు ఉన్నాయి. ఇక వైసీపీ ఐదేళ్ల పాలనలో అధికారులు అడిగే ధైర్యం చేయక పోవటంతో బకాయిలు కోట్లలో పేరుకుపోయాయి. ఆయన మిల్లుల విద్యుత్ కనెక్షన్లను కట్ చేసేందుకు ఎవరూ సాహసించలేదు. ఉన్నతాధికారులతో చెప్పించుకొని బిల్లులు కట్టకుండా ఎగనామం పెడుతూ వచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక కొద్ది రోజులకే విద్యుత్ శాఖ అధికారులు ఆయన మిల్లులకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. బిల్ స్టాప్ కూడా చేసేశారు. అయినా ఆయనలో స్పందన లేదు. ఏపీ సీపీడీసీఎల్ సీఎండీగా కొత్తగా నియమితులైన పుల్లారెడ్డి జిల్లాల పర్యటనలో భాగంగా గురువారం గుంటూరు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు మాజీ ఎమ్మెల్యే గిరి విద్యుత్ బకాయిల విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తగిన చర్యలు తీసుకునేందుకు ఆదేశించాల్సిందిగా కోరారు. విద్యుత్ బకాయిలను ఆర్ఆర్ యాక్టు ప్రకారం వసూలు చేసుకునే అధికారం అధికారులకు ఉంది. ఈ యాక్టు ద్వారా ఆస్తులను సీజ్ చేసి బకాయిలు రాబట్టుకోవచ్చు. మాజీ ఎమ్మెల్యే గిరికి కూడా కొద్ది రోజులు గడువు ఇచ్చి ఆర్ఆర్ యాక్టు ప్రయోగించే అవకాశం ఉంది. కాగా టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి టీడీపీలో చేరాలని గిరి ప్రయత్నించినా చేర్చుకోలేదు. ఇంకా వైసీపీలోనే ఉంటే బకాయిలు/అప్పుల వేధింపులు ఎక్కువవుతాయని భావించి ఆ పార్టీకి రాజీనామా చేశారు.



మద్దాళి గిరిధర్

గుండ్లపాడు జంట హత్యల కేసులో.. ఆరుగురు నిందితుల అరెస్టు

» 19 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించిన మాచర్ల కోర్టు

నరసరావుపేట లీగల్/మాచర్ల టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో సంచలనం సృష్టించిన గుండ్లపాడు టీడీపీ నేతల జంట హత్యల కేసులో ఆరుగురు నిందితులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వారిని మాచర్ల కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. పరారీలో ఉన్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులకు ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. గుండ్లపాడులో జవిశెట్టి వెంకటేశ్వర్లు, తోట వెంకట్రామయ్య మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. జవిశెట్టి వెంకటేశ్వర్లుకు గ్రామంలో మంచి గుర్తింపు ఉంది. ఆయన పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేయాలనుకుంటున్నారు. దీంతో తమ రాజకీయ భవిష్యత్‌కు అడ్డంకిగా మారుతారని రెండోవర్గంవారు భావించారు. ఈ క్రమంలో గుండ్లపాడుకు చెందిన తోట వెంకటరామయ్య(ఏ-1), జవిశెట్టి శ్రీనివాసరావు, తోట గురవయ్య, శ్రీను బొచ్చిలి, తోట వెంకటేశ్వర్లు, గెల్లిపోగు విక్రం, రచ్చమల్లపాడుకు చెందిన దొంగరి నాగరాజులు.. పిన్నెల్లి వెంకటరెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డితో కలిసి హత్యకు పథకం రూపొందించారు. గత నెల 25న నిందితులు స్కార్పియో వాహనంతో ఢీ కొట్టి ఆపై రాళ్లు వేసి హత్య చేశారు. వీరిలో ఆరుగురు నిందితులు బుధవారం వెల్దుర్తి తహశీల్దార్ కార్యాలయంలో లొంగిపోగా, పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మాచర్ల మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా.. న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ ఈ నెల 19 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. నిందితులను గుంటూరు జైలుకు తరలించారు. పిన్నెల్లి సోదరులను అరెస్టు చేయాల్సి ఉంది.

పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్‌పై విచారణ 12కి వాయిదా

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల హత్య కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ పిన్నెల్లి సోదరులు రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి వేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. విచారణను ఈనెల 12కి వాయిదా వేసింది.

విచారణకు అందుబాటులో ఉండండి

» దేవినేని అవినాశ్‌కు హైకోర్టు ఆదేశం



అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తిరువూరు నగరపంచాయతీ ఎన్నిక సందర్భంగా కిడ్నాప్, తదితర సెక్షన్ల కింద నమోదైన నాలుగు కేసుల్లో దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు అందుబాటులో ఉండాలని, దర్యాప్తునకు సహకరించాలని వైసీపీనేత దేవినేని అవినాశ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆయనకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంచం మహేశ్వరరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నగరపంచాయతీ ఎన్నిక సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్‌తో మాట్లాడాలంటూ తన మరదలు షేక్ నదియా, ఆమె భర్తను మాజీ ఎమ్మెల్యే స్వామిదాస్ తీసుకెళ్లి నిర్బంధించారంటూ షేక్ మస్తాన్ ఈనెల 20న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా అవినాశ్, స్వామిదాస్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అవినాశ్ హైకోర్టును ఆశ్రయించారు. గురువారం వ్యాజ్యం విచారణకు వచ్చింది. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు హాజరయ్యేలా పిటిషనర్‌ను ఆదేశించాలని కోరారు.

పీఎస్ఆర్‌కు రిమాండ్ పొడిగింపు

విజయవాడ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుకు కోర్టు రిమాండ్ పొడిగించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న ఆయన్ను పోలీసులు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం హాజరుపరిచారు. 19వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి దేవిక ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం ఆయనను జైలుకు తిరిగి తీసుకెళ్లారు.

క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో.. పోలీసు కస్టడీకి కాకాణి

» 3 రోజుల విచారణకు నెల్లూరు ఎస్సీ, ఎస్టీ కోర్టు అనుమతి

» బెయిల్ పిటిషన్‌పై విచారణ 9కి వాయిదా



నెల్లూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిని పోలీసు కస్టడీలో విచారించేందుకు కోర్టు అనుమతి మంజూరుచేసింది. మూడ్రోజుల పాటు విచారణ జరిపేందుకు వారిని పోలీసు కస్టడీకి ఇస్తూ నెల్లూరు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి కాకాణిని పోలీసులు తమ కస్టడీకి తీసుకుంటారు. రోజూ సాయంత్రం 5 గంటల వరకూ న్యాయవాది సమక్షంలో ఆయన్ను ప్రశ్నిస్తారు. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో ఆయన ఏ4గా ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో అనేక మందిని పోలీసులు విచారించారు. వారి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా కాకాణిని విచారించాలని భావించారు. ఇందుకోసం పలుమార్లు నోటీసులు జారీ చేసినా ఆయన హాజరు కాలేదు. పైగా తప్పించుకుని తిరిగారు. బెంగళూరు శివార్లలో చింతామణి ప్రాంతంలోని వెంకటపురం గ్రామంలో మకాం వేసి ఉండగా.. గత నెల 25వ తేదీ రాత్రి పోలీసులు అరెస్టుచేశారు. నెల్లూరు కోర్టులో హాజరుపరచగా.. జ్యుడీషియల్ రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. కాగా.. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కోర్టులో కాకాణి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ మళ్లీ వాయిదా పడింది. ఈ నెల 9న విచారణ జరుగనుంది.

వెన్నుపోటు దినంలో అనుమతుల ఉల్లంఘన

» తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సహా 11 మందిపై కేసు

ములకలచెరువు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువులో బుధవారం వైసీపీ నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో అనుమతులు ఉల్లంఘించారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మరో 10 మంది వైసీపీ నాయకులపై బీఎన్ఎస్ సెక్షన్లు 189(3), 126(2), 292, 223(ఎ), రెడ్ విత్ 3(5) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాక్ అణు బెదిరింపులకు తలవంచం: ఎంపీ లావు

న్యూఢిల్లీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ అణు బెదిరింపులకు భారత్ తలవంచబోదని మేం పర్యటించిన దేశాల నేతలు, మేధావులకు స్పష్టం చేశామని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. పాక్ ఉగ్రవాదం గురించి తమకు కొత్తగా చెప్పాల్సిన పనిలేదని, ప్రపంచంలో ఎక్కడ ఉగ్రదాడి జరిగినా దాని మూలాలు పాక్‌లోనే ఉంటాయని ఆయా దేశాలన్నీ అంగీకరించాయని తెలిపారు. ఉగ్రవాద సంస్థలకు అండగా ఉంటూ, ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాక్‌ను ఉగ్రవాద బాధిత దేశంగా తాము చూడబోమని స్పష్టం చేశామని తెలిపారు. గురువారం, ఇక్కడ తన అధికారిక నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో లావు మాటాడారు. 'పాక్ ఉగ్రవాదం, ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి గల కారణాలను ఖతార్, ఈజిప్టు, ఇథియోపియా, దక్షిణాఫ్రికా దేశాలలోని ఆయా రాజకీయ పార్టీల నేతలు, మేధావులకు వివరించాం. ఉగ్రవాదం పట్ల భారత్ వైఖరిని అన్ని దేశాలు సమర్థించాయి. ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు దౌత్యపరంగా చేపట్టిన అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాకే ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టినట్లు వివరించాం. ఉగ్రవాద బాధిత దేశంగా పాక్‌ను చూడవద్దని ఆయా దేశాల నేతలకు విజ్ఞప్తి చేశాం. ఐక్యరాజ్యసమితి ఉగ్రవాదాన్ని నిర్వచించేలా, ఉగ్రవాదానికి పాల్పడే దేశాలపై కఠిన చర్యలు తీసుకునేలా కృషి చేయాలని కోరాం' అని ఎంపీ లావు తెలిపారు. నేడు విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కలిసి పర్యటన వివరాలను వెల్లడిస్తామని చెప్పారు.

ప్రతి ఒక్కరూ 10 మొక్కలు నాటండి


వనమహోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు, అధికారులు, సభికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న విద్యార్థిని లావణ్య

ప్లాస్టిక్ చాలా ప్రమాదకరం. ప్రకృతిని నాశనం చేస్తోంది. పశువులు ప్లాస్టిక్ తింటే.. వాటి పాలు మనం తాగుతున్నాం. దానిని నియంత్రించడానికి చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్నాం.

- ముఖ్యమంత్రి చంద్రబాబు



(మొదటి పేజీ తరువాయి)

తెలియనివారు స్వచ్ఛమైన గాలిని ఆశించవచ్చా అని ప్రశ్నించారు. అందుకే ప్రతి ఒక్కరూ కనీసం పది మొక్కలు నాటాలని.. వాటిని పెంచి సంరక్షించాలని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజధాని అమరావతిలోని తుళ్లూరు మండలం అనంతవరంలో గురువారం వన మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏడీసీఎల్ పార్కులో ముఖ్యమంత్రి.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి మొక్కలు నాటారు. సభా వేదిక వద్ద పర్యావరణ పరిరక్షణ నిమిత్తం కాలుష్య మండలి ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో సీఎం ప్రసంగించారు. 21న ప్రధాని ఆధ్వర్యంలో విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నామని, అక్కడ ఒకే రోజు 5 లక్షల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది లక్ష కేంద్రాల్లో యోగా సాధన చేసి గిన్నీస్ రికార్డ్ సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. 25 లక్షల మందికి యోగా సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేలా...

వ్యర్థాలను పునరుత్పాదక వనరులుగా వినియోగించుకుంటూ రాష్ట్రాన్ని కాలుష్యరహితంగా మార్చే గ్రీన్ అండ్ సర్క్యులర్ ఎకానమీని అమలు చేస్తాం. వచ్చే నాలుగేళ్లలో 37 శాతం, 2047 నాటికి 50 శాతం పచ్చదనాన్ని సాధించి.. ప్రపంచానికే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తాం. గుంటూరు, విశాఖలో చెత్త నుంచి కరెంటు ఉత్పత్తి చేసే ప్లాంట్లు ఏర్పాటు చేశాం. గ్రామీణ ప్రాంతాల్లో వేస్ట్ కంపోస్టు కేంద్రాలు నెలకొల్పాం. రీసైక్లింగ్ కింద ఇప్పటికే 87 మున్సిపాలిటీల్లో 157 రెడ్యూస్, రీ-యూజ్, రీసైకిల్ సెంటర్లు ఏర్పాటు చేశాం. కుళ్లిన చికెన్ పునర్వినియోగించి హై ప్రొటీన్ ఉత్పత్తుల తయారీకి ఉపయోగించవచ్చు. అలా ప్రతి వ్యర్థాన్ని తిరిగి వినియోగంలోకి తెచ్చి కాలుష్యరహిత సమాజాన్ని పొందడమే సర్క్యులర్ ఎకానమీ. రాష్ట్రంలో 37,421 చ.కిలోమీటర్ల పరిధిలో అడవులున్నాయి. రాష్ట్ర విస్తీర్ణంలో ఇది 23 శాతం. అటవీయేతర ప్రాంతంలోని పచ్చదనంతో కలిపి 30.05 శాతం పచ్చదనం ఉంది. దానిని 2047 నాటికి 50 శాతానికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఒక్క రోజే కోటి చెట్లను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందాన్నిస్తోంది. వచ్చే పర్యావరణ దినోత్సవం నాటికి 5.58 కోట్ల మొక్కలు పెంచాలని సంకల్పించాం. 50 శాతం పచ్చదనం సాధించడంలో ఆడబిడ్డల పాత్ర కీలకం. అన్నదమ్ముల నక్షత్రాలకు చెందిన మొక్కల విత్తనాలతో తయారు చేసిన సీడ్ రాఖీలను వారంతా కట్టాలి. వాటిని నాటేలా ప్రోత్సహించాలి. మియావాకీ తరహా గార్డెన్లు, అనేక దేశాల గార్డెన్లు అమరావతిలో పెంచుతాం. చైనీస్, కొరియా, జపాన్ గార్డెన్లను ఇక్కడ రూపొందిస్తాం.


సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సెల్ఫీ

ఇంటి అడ్రస్‌కు నాడు చెట్లే ఆనవాళ్లు: పవన్ కల్యాణ్

తమ చిన్నతనంలో ఇంటి అడ్రస్ చెప్పే సమయంలో ఆ ఇంటికి దగ్గరలో ఉన్న చెట్లను ఆనవాళ్లుగా చెప్పేవాళ్లమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. ఆ విధంగా చెట్లు మనిషికి ఆధారమే కాకుండా.. మనిషికి ఆనవాళ్లుగా కూడా నిలిచాయన్నారు. ఫారెస్ట్ మ్యాన్ అంకారావు కృషిని, సంకల్పాన్ని కొనియాడారు. ఆయన గురించి తెలుసుకుంటున్న కొద్దీ ఆసక్తిగా ఉందని చెప్పారు. ఆయనలా తాను కూడా కోటి మొక్కలు నాటాక సగర్వంగా మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొంగూరు నారాయణ, కందుల దుర్గేశ్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య, ఏడీసీ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి, అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, పీసీసీఎఫ్ ఏకే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ సలహాదారుగా అంకారావు



వనజీవి రామయ్య తన జీవితమంతా ఊరూరా తిరిగి మొక్కలు పెంపకంపై అవగాహన కల్పించారు. ఆయన అందరికీ స్ఫూర్తి. నా చిన్నతనంలో మా గ్రామంలో కేశవయ్యనాయుడు అనే సామాజిక కార్యకర్త కూడా అడవులు నరక్కుండా తీసుకున్న చర్యలు, నన్ను భాగస్వామిని చేసిన తీరు నాలో స్ఫూర్తి నింపాయి. నీరు-చెట్టు, వనం-మనం, ఇంకుడుగుంతలు వంటి కార్యక్రమాలు చేపట్టాను. నల్లమల సంరక్షణకు జీవితాన్ని అంకితం చేసి మూడు దశాబ్దాలుగా నల్లమలలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసి, కోట్లాది విత్తన బందలు వేసిన 'ఫారెస్ట్ మ్యాన్' కొమెర అంకారావు కృషి శ్లాఘనీయం. ఆయన్ను రాష్ట్ర అటవీశాఖ సలహాదారుగా నియమిస్తున్నాం.

వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఒక్క సీటే: రామ్మోహన్


శ్రీకాకుళంలో మొక్క నాటుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి తీరు మార్చుకోకపోతే.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఒక్క సీటే లభిస్తుందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం శ్రీకాకుళంలో మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గత ఐదేళ్లు జగన్మోహన్‌రెడ్డి తీరని ద్రోహం చేశారు. ఆ బాధ భరించలేక కేవలం 11 సీట్లు ఆయనకు వచ్చాయి. ఇప్పుడు మళ్లీ రాష్ట్రానికి ఉన్న బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బతీయడమే పనిగా జగన్ పెట్టుకున్నాడు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసింది. ఐదేళ్ల కాలంలో జగన్ చేయలేని పనులను సైతం కూటమి ప్రభుత్వం చేయడంతో వైసీపీ మరింత పతనమైంది' అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

ఉద్యమంలా మొక్కలు నాటుదాం: డోలా

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 'పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. దీనికోసం అందరూ ఉద్యమంలా మొక్కలు నాటాలి' అని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు తదితరులతో కలసి మొక్కలు నాటారు. అనంతరం డోలా మాట్లాడుతూ.. 'ఏపీని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా, గ్రీన్ ఆంధ్రగా మార్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారు. మనం కూడా ప్రకృతి పరిరక్షణకు మొక్కలు నాటి ఆరోగ్యకరమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకుందాం' అని పిలుపునిచ్చారు.

రేప్‌లు చేసేవాళ్లు చిన్న పిల్లకాయలా?

» వారిని పరామర్శించడానికి సిగ్గుపడాలి: వెంకటరమణారెడ్డి



అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 'గంజాయి తాగి పోలీసు కానిస్టేబుల్‌పై హత్యాయత్నం, అమ్మాయిలపై రేపులు చేసేవారు జగన్‌కు చిన్న పిల్లకాయలట. ఆయన మాటల్లో ఏమైనా అర్థం ఉందా?' అని ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణా రెడ్డి మండిపడ్డారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తెనాలి పిల్లకాయలపై పెట్టిన కేసులు దొంగ కేసులు అని జగన్ అంటున్నాడు. మరి ఆ పిల్లకాయలపై పెట్టిన కేసుల్లో కొన్ని జగన్ హయాంలోనే పెట్టారు. అవి కూడా దొంగ కేసులేనా? రేప్ చేసిన వాడిని, విద్యార్థి మీద హత్యాయత్నం చేసిన వాడిని పరామర్శిస్తాడా? జగన్‌రెడ్డికి సిగ్గుందా? జగన్‌పై 31 కేసులు ఉన్నాయి. ఆ కేసుల విచారణ మొదలై 5 వేల రోజులు అయింది. ఇప్పటికి 3,452 సార్లు కోర్టులో వాయిదాలు తీసుకోవడం ప్రపంచంలో ఓ రికార్డు. లీగల్ ఫీజుల కోసమే జగన్ రూ.6,904 కోట్లు ఖర్చు పెట్టాడు. ఇన్ని కేసులు ఎదుర్కొంటున్న జగన్‌రెడ్డి... ఎదురు చంద్రబాబును రోడ్డుమీద కొట్టాలంటూ మాట్లాడటానికి సిగ్గుండాలి. చంద్రబాబును రోడ్డుపై కొట్టాలంటున్న నిన్ను ఎక్కడ కొట్టాలి? దేనితో కొట్టాలో కూడా చెప్పు జగన్‌రెడ్డీ...' అని ఆనం నిలదీశారు.

సాగుకు సర్కారు అండ

» రైతుల ప్రయోజనాలే ముఖ్యం
» మార్క్‌ఫెడ్ ద్వారా బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు
» కిలో మామిడికి రూ.4, కోకోకు రూ.50 సాయం: సీఎం
» గిట్టుబాటు ధరలు, కొనుగోళ్లపై సమీక్ష

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఆగ్రో ప్రాసెసింగ్ వృద్ధి చెందేలా చూడాలి. సంక్షోభ సమయంలోనే తెలివిగా కష్టపడాలి. సమస్య పరిష్కారమయ్యే వరకు అధికారులు, మంత్రులు ప్రజల్లోకి వెళ్తూ ఉండాలి. వ్యవసాయానికి ప్రభుత్వం అండగా ఉందనే భరోసా రైతుల్లో కలిగించాలి. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యం' అని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. గురువారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో కోకో, మామిడి, పొగాకు గిట్టుబాటు ధర, కొనుగోళ్లపై సీఎం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ధాన్యం సేకరణ, ఉద్యాన పంటలు, ఆక్వా విషయంలో రైతులకు ఈ ప్రభుత్వం ఎంతో మేలు చేసింది. రైతుల్లో అసంతృప్తి లేకుండా చూడాలి. పీఎం కిసాన్ డేటాకు అనుగుణంగానే అన్నదాత-సుఖీభవ లబ్ధిదారుల జాబితాను రూపొందించాలి. ప్రభుత్వ సాయం దళారులకు, వ్యాపారులకు కాకుండా రైతాంగానికి అందేలా చూడాలి. మంత్రులు, ఎంపీలు కేంద్రమంత్రులను కలిసి, పామాయిల్‌పై కేంద్రం తగ్గించిన దిగుమతి సుంకం రైతులను ఏవిధంగా నష్టపరుస్తుందో చెప్పి, నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ఒప్పించాలి' అని సూచించారు. 'వైట్ బర్లీ పొగాకు రకాన్ని ఒప్పందం మేరకే సాగు చేయించి, కంపెనీలే కొనుగోలు చేయాలి. హెచ్‌డీ(బ్లాక్) బర్లీ పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలు, చిరుధాన్యాలు పండించేలా ఆయా గ్రామాల్లో చర్చించి, రైతులను ప్రోత్సహించాలి. పర్చూరు, ఇంకొల్లు, మద్దిపాడు, గుంటూరు, పెదనందిపాడు, ప్రత్తిపాడు, చిలకలూరిపేట మార్కెట్ యార్డుల్లో బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోళ్లను వెంటనే చేపట్టాలి. బ్లాక్ బర్లీని ఐటీసీ, జీపీఐ కలిసి 25వేల మిలియన్ కిలోలు కొనుగోలు చేయాలి. బ్లాక్ బర్లీలో సెకండ్, థర్డ్ గ్రేడ్‌ల కొనుగోలుపై కంపెనీలతో సంప్రదింపులు జరపాలి. కోకో పాలసీ తీసుకురావాలి. కోకో రైతుల వద్ద 465 టన్నుల కోకో గింజలు కొనుగోలు చేయగా, ఇంకా 745 టన్నులు మిగిలి ఉన్నాయి. కోకో రైతుకు కనీసం కిలోకు రూ.500 ధర తగ్గకుండా చూడాలి. కంపెనీలు రూ.450 చెల్లిస్తే, ప్రభుత్వం రూ.50 ఇస్తుంది. 43 వేల మెట్రిక్ టన్నుల మామిడి పల్ప్ ప్రాసెసింగ్ కంపెనీల దగ్గర నిలిచిపోయాయి. కిలో మామిడికి రూ.12 చొప్పున వ్యాపారులు తక్షణం కొనుగోలు జరపాలి. వ్యాపారులు రూ.8చెల్లిస్తే.. ప్రభుత్వం రూ.4 నేరుగా రైతులకు చెల్లిస్తుంది. రాష్ట్రంలో రైతుబజార్లను 116 నుంచి 200కు పెంచాలి. మొబైల్ రైతుబజార్లను కూడా ప్రవేశపెట్టాలి' అని మార్కెటింగ్‌శాఖను సీఎం ఆదేశించారు.

నేటి నుంచే పొగాకు కొనుగోళ్లు: అచ్చెన్న

పొగాకు రైతులెవరూ ఆందోళన చెందనవసరం లేదని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఉండవల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'శుక్రవారం నుంచే కొనుగోలు ప్రారంభమౌతుంది. పొగాకు నాణ్యతను పరిశీలించి, మార్క్‌ఫెడ్ కొనేలా క్వింటా రూ.12వేలకు తగ్గకుండా కొనుగోలు చేస్తాం. రూ.350కోట్లు ఖర్చయినా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుంది. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో 5.5 లక్షల టన్నుల తోతాపురి మామిడి ఉత్పత్తి వచ్చింది' అని తెలిపారు.

కలిసికట్టుగా బురదజల్లుదాం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధులకూ, వైసీపీ నేతలకూ చేసిన దిశా నిర్దేశం! 'తప్పొప్పులతో సంబంధం లేకుండా ప్రభుత్వాన్ని బద్నాం చేయాలి. రాజకీయంగా లబ్ధి పొందాలి. దీంతోపాటు పత్రిక సర్క్యులేషన్ పెంచుకోవాలి'... అనేదే వ్యూహం! దీనికోసం... పార్టీకీ, పత్రికకూ మధ్య 'సమన్వయం' పేరుతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. తొలివిడతగా గురువారం తిరుపతిలో జగన్ మీడియా ప్రతినిధులు, వైసీపీ నేతలు సంయుక్త చర్చలు జరిపారు. శుక్రవారం నెల్లూరులో ఆ తరహా మీటింగ్ జరగనుంది. ఆ తర్వాత జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించేలా ప్రణాళికలు రచించారు.

అసలు నేపథ్యం ఇదీ...

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టేందుకు వైసీపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల నుంచే విమర్శలకు తెరలేపింది. అటు... ఆయన మీడియా కూడా తనదైన శైలిలో ప్రభుత్వంపై బురదజల్లుతోంది. అయితే... ఇవేవీ ప్రజలను ప్రభావితం చేయలేదు. జగన్ అనేక పిలుపులు ఇచ్చినా... ఫలితం కనిపించలేదు. చివరికి... 'జూన్ 4'వ తేదీన నిర్వహించిన వెన్నుపోటు దినంలోనూ ప్రజలెవరూ స్వచ్ఛందంగా పాల్గొనలేదు. పార్టీ నేతల నుంచీ స్పందన అంతంతమాత్రమే కనిపించింది. ఈ నేపథ్యంలో కేవలం పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆందోళనలు, పోరాటాలు చేస్తే తాను ఆశిస్తున్న '2.0' సాధ్యంకాదని జగన్ గ్రహించారు. తన ఆరోపణలు, విమర్శలతోపాటు, ప్రభుత్వ వ్యతిరేక వార్తలను రోజువారీగా వండివార్చే తన పత్రికను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పదేపదే చెప్పే అబద్ధాలనే నిజమని నమ్మించాలని... పార్టీ నేతలను కూడా ఇందులో భాగస్వాములను చేయాలని వ్యూహం రచించారు. అందులో భాగంగానే... 'సమన్వయ' సమావేశాలు మొదలుపెట్టారు.

పార్టీ పత్రిక అసలు రంగు

'సాక్షి'... జగన్ కుటుంబ ఆధ్వర్యంలో నడుస్తున్న మీడియా! జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ... ప్రభుత్వంపై బురదజల్లి, వ్యతిరేకత పెంచి అధికారంలోకి వచ్చేందుకు మీడియాను వాడుకున్నారు! అధికారంలోకి రాగానే... సొంత మీడియాకు ఆదాయం తెచ్చిపెట్టేందుకు ప్రభుత్వాన్ని వాడుకున్నారు. వలంటీర్లు, గ్రామ సచివాలయాల సిబ్బందికి ప్రభుత్వ సొమ్మును అలవెన్సు రూపంలో ఇచ్చి రోత పత్రికకు చందాదారులుగా మార్చారు. వలంటీర్లు కొందరు ప్రజలతో కూడా చందాలు కట్టించారు. ఎంత చేసినప్పటికీ... ఎన్నికల్లో ఓటమి తప్పలేదు. దీంతో అధికారంలో ఉన్నప్పుడు 'బలవంతంగా పెంచుకున్న' సర్క్యులేషన్ ఒక్కసారిగా పడిపోయింది. తన అడ్డగోలు ఆరోపణలు, విమర్శలు ప్రజలకు చేరాలంటే సర్క్యులేషన్ పెంచుకోవాలి. దీనికోసమే... 'స్వతంత్ర మీడియా' అనే ముసుగును పూర్తిగా తొలగించేశారు. తన పత్రికను బహిరంగంగానే 'పార్టీ పత్రిక'గా మార్చేశారు. వైసీపీ నేతలతో కలిసి పని చేయాలని పత్రికను... పత్రికకు పూర్తిగా సహకరించాలని పార్టీ నేతలను ఆదేశించారు.

అజెండా ఒక్కటే... : జగన్ ఆదేశాల మేరకు... తిరుపతిలో తొలి 'సమన్వయ' సమావేశం జరిగింది. గురువారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలకనేత భూమన కరుణాకర్‌రెడ్డి నివాసంలో 'సాక్షి' ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు... ప్రత్యేకించి రాయలసీమ, ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని రాజకీయాలు, ప్రజా సమస్యలు, ఆయా అంశాలపై ప్రస్తుతం రోత పత్రిక ఇస్తున్న కవరేజ్, సర్క్యులేషన్ పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై చర్చించారు. ఆ తర్వాత మీటింగ్‌ను 'రిట్జ్' హోటల్‌కు మార్చారు. అక్కడ జగన్ మీడియా కీలక కార్యనిర్వహణ ప్రతినిధితోపాటు... వైసీపీ నేతలు భూమన కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రోజా, భూమన అభినయ్‌రెడ్డి, చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి, చంద్రగిరి సమన్వయకర్త మోహిత్‌రెడ్డి, సత్యవేడు నేత ఎన్.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. "ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు చిన్నవే అయినా... వాటికి మీడియాలో చాలా ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వ చర్యల వల్ల ఇబ్బందులు పడుతున్నారని చిత్రీకరించాలి" అని నిర్ణయించారు. సమస్య చిన్నదా? పెద్దదా? అన్నది చూడకుండా... దాన్ని ప్రభుత్వ వైఫల్యంగా చూపించేలా వార్తలు రాయాలని నిర్ణయించినట్లు తెలిసింది. అదే క్రమంలో... జగన్ పత్రికలో వచ్చే అంశాల ఆధారంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టే బాధ్యతను వైసీపీ తీసుకుంటుందని, ఇలా సమన్వయంతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ప్రభుత్వాన్ని తప్పుపట్టేలా ఉన్న ఎలాంటి సమాచారమైనా పరస్పరం పంచుకోవాలని కూడా తీర్మానించుకున్నట్లు తెలిసింది.

అది అసలు నెయ్యే కాదు



(మొదటి పేజీ తరువాయి)

డైరెక్టర్లు పోమిల్ జైన్(ఏ3), విపిన్ జైన్(ఏ4), వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ వినయ్‌కాంత్ చావడా(ఏ5) హైకోర్టులో బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. గురువారం వీటిపై విచారణ జరిగింది. సిట్ తరఫున సీబీఐ స్టాండింగ్ కౌన్సిల్ పీఎస్‌పీ సురేశ్ కుమార్ వాదనలు వినిపించారు. నెయ్యి ఉత్పత్తి కోసం బోలే బాబా డెయిరీ అసలు పాలనే సేకరించలేదని రైతులు చెప్పారని తెలిపారు. పామాయిల్, కెమికల్స్, ఇతర ముడిపదార్థాలను వినియోగించి కల్తీ నెయ్యిని తయారు చేసినట్లు సిట్ తన దర్యాప్తులో గుర్తించిందన్నారు. ముందుగా రచించుకున్న ప్రణాళిక ప్రకారమే టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారని వివరించారు. నెయ్యి సరఫరా కోసం టీటీడీతో ఏఆర్ డెయిరీ ఒప్పందం చేసుకున్నప్పటికీ, వెనుక ఉండి కథ మొత్తం నడిపించింది బోలే బాబా డెయిరీ అని పేర్కొన్నారు. బోలే బాబా డెయిరీని టీటీడీ బ్లాక్ లిస్టులో పెట్టడంతో ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీని ముందు ఉంచి బోలే బాబా డెయిరీ కల్తీ నెయ్యి సరఫరా చేసిందన్నారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న ఆశిష్ రోహిల్లా మేజిస్ట్రేట్ ముందు నేరాంగీకార వాంగ్మూలం ఇచ్చేందుకు సిద్ధపడగా, రోహిల్లాకు తెలియకుండానే ఆయన పేరు మీద ఇతర వ్యక్తులు హైకోర్టులో పిటిషన్ వేశారని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించిన రోహిల్లా మెయిల్ ద్వారా హైకోర్టు రిజిస్ట్రార్ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. మరోసాక్షి సంజయ్ జైన్ ఈ ఏడాది ఏప్రిల్ 7న ఢిల్లీ నుంచి తిరుపతికి రాగా ఎయిర్‌పోర్ట్ వద్ద కేసులోని నిందితుల బంధువులు అతనిపై దాడి చేసి బెదిరించారన్నారు. చెన్నై ఎయిర్ పోర్ట్‌కు తీసుకెళ్లి అక్కడి నుంచి ఢిల్లీకి వెనక్కి పంపించారన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలను కోర్టు ముందు ఉంచారు. పిటిషనర్లు అందరూ ఆర్థికంగా బలవంతులని, కేసు దర్యాప్తునకు ఆటంకం కలిగించేందుకు ప్రయత్నించారని చెప్పారు. బెయిల్ మంజూరు చేస్తే సాక్షులకు తీవ్ర ప్రమాదమన్నారు. నకిలీ నెయ్యి సరఫరా కుట్రకు సంబంధించి పత్రాలతో సహా పక్కా ఆధారాలు సేకరించామని తెలిపారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని బెయిల్ పిటిషన్లను కొట్టివేయాలని కోరారు. అంతకుముందు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సీవీ మోహన్‌రెడ్డి, శ్రీరామ్, మరో న్యాయవాది వాదనలు వినిపించారు. పిటిషనర్లు గత నాలుగు నెలలుగా జైల్లో ఉన్నారన్నారు. కేసు దర్యాప్తు పూర్తి చేసి సీబీఐ డైరెక్టర్ నేతృత్వంలోని సిట్ ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేసిందన్నారు. కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను ఇప్పటికే సిట్ సేకరించిందన్నారు. నెయ్యి సరఫరా గురించి టీటీడీతో ఏఆర్ డెయిరీ ఒప్పందం చేసుకుందని, వైష్ణవి, బోలే బాబా డెయిరీ డైరెక్టర్లకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంతో సంబంధం లేదని చెప్పారు. కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటామని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్ పిటిషనర్ల తరపు న్యాయవాదుల అభ్యర్థన మేరకు వ్యాజ్యాలపై తదుపరి విచారణను ఈ నెల 17కి వాయిదా వేశారు.

'బనకచర్ల' మొదలెడదాం!

» ప్రాధాన్య ప్రాజెక్టులపై నేడు సీఎం సమీక్ష

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకంపై కేంద్రం సానుకూలంగా ఉన్నందున.. పనులు మొదలుపెట్టే దిశగా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. కేంద్రానికి సమర్పించనున్న సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు కొన్ని సూచనలు చేయనున్నారు. ఈ నెలలోనే టెండర్లను పిలిచేందుకు జలవనరుల శాఖను సమాయత్తం చేస్తారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో పోలవరం, బనకచర్ల, ఇతర ప్రాధాన్య ప్రాజెక్టులపై ఆయన సమీక్ష నిర్వహించనున్నారు. శ్రీశైలం జలాశయం మరమ్మతు పనులపైనా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు.

బనకచర్లపై ఉత్తమ్, కవిత తప్పుడు ప్రచారం: బక్కని

హైదరాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు మండిపడ్డారు. ఈ ప్రాజెక్టుతో తెలంగాణకు ఏ విధంగా నష్టమో వారు సమాధానం చెప్పాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సముద్రంలో కలిసిపోతున్న నీటిని వాడుకునేందుకే బనకచర్ల ప్రాజెక్టు చేపడుతున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారన్నారు. ఇక్కడ టీడీపీ ఎదగకుండా జరుగుతున్న కుట్రలో భాగంగానే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే గోపీనాథ్‌కు తీవ్ర అస్వస్థత

» ఏఐజీ ఆస్పత్రి ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స

రాయదుర్గం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గురువారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. కుటుంబసభ్యులు ఆయనను ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. సీనియర్ వైద్యుల బృందం గోపీనాథ్‌కు చికిత్స అందిస్తోందని, 48 గంటల పాటు పరిస్థితిని పర్యవేక్షించాల్సి ఉందని వైద్యులు తెలిపారని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు.

ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్‌గా సూర్యదేవర మహేంద్రదేవ్

దుగ్గిరాల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆర్థికవేత్త, యాక్సిస్ బ్యాంక్ మాజీ ఇండిపెండెంట్ డైరెక్టర్ డాక్టర్ సూర్యదేవర మహేంద్రదేవ్ ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి చైర్మన్‌గా నియమితులయ్యారు. ప్రభుత్వ పాలసీల రూపకల్పనలో ప్రధానికి సూచనలిచ్చే ఆర్థిక సలహా మండలిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహేంద్రదేవ్ ప్రతిష్ఠాత్మక పదవిని చేపట్టనున్నారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామానికి చెందిన డాక్టర్ మహేంద్రదేవ్ ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేశారు. యేల్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ పూర్తి చేశారు. ప్రఖ్యాత ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్‌గానూ, వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణాయక కమిషన్ చైర్మన్‌గానూ 2008 నుంచి 2010 వరకూ పనిచేశారు.


ఆలపాటి సురేశ్‌ను అభినందిస్తున్న సీనియర్ పాత్రికేయుడు శ్రీనివాసరెడ్డి

ఏపీ మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సురేశ్

విజయవాడ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆలపాటి సురేశ్ జర్నలిజంలో విలువలతో పనిచేశారని జర్నలిస్టు సంఘం జాతీయ నేత, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ కార్యాలయంలో చైర్మన్‌గా ఆలపాటి సురేశ్ బాధ్యతలు స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ పాత్రికేయులు ఆయనను అభినందించి సత్కరించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, 'ప్రస్తుత కాలంలో అకాడమీ చైర్మన్ పదవి నిర్వహించడం సవాలుతో కూడుకున్నది. ఎలాంటి కష్టం వచ్చినా, విమర్శలు వచ్చినా ముందుకు సాగాలే తప్ప మరో మార్గం లేదు' అని అన్నారు. ఏపీయూడబ్ల్యూజే నేత ఐ.వి.సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టు యూనియన్‌గా మా వంతు సహకారం అకాడమీకి అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చందూ జనార్దన్, మణిరామ్, స్వర్ణ, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

తిరుపతి చేరిన 'లిక్కర్' లింకులు

» రెండు రోజులు సిట్ అధికారుల విచారణ
» చంద్రగిరి, తిరుపతిలో సమాచార సేకరణ
» అరెస్టు చేయాలనుకుంటే నేనే వస్తా: చెవిరెడ్డి

అమరావతి/తిరుపతి (నేరవిభాగం, రూరల్), జూన్ 5(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో 'తిరుపతి' లింకులు బయటపడుతున్నాయి. ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు రెండు రోజులు తిరుపతిలో మకాం వేసి పలువురిని ప్రశ్నించి, కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. 'మద్యం ముడుపులతో ఓట్ల కొనుగోలు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' సంచలన కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. 2024 ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేసిన వారికి ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి డ్రైవర్ ద్వారా మద్యం ముడుపులు చేరవేసినట్లు 'సిట్' గుర్తించినట్లు వెల్లడించింది. చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లోని కొంతమంది ముఖ్య నాయకులు, అధికారుల నుంచి వివరాలు రాబట్టి... కొందరి వాంగ్మూలాలు కూడా తీసుకున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసిన డబ్బులు, ఇతరత్రా వస్తువులకు డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయి? అనే అంశంపై దృష్టి సారించినట్లు తెలిసింది.

తప్పుడు వాంగ్మూలం రికార్డు చేశారు: చెవిరెడ్డి

'ఆంధ్రజ్యోతి' కథనంలో ప్రత్యక్షంగా ఎవరి పేర్లూ ప్రస్తావించనప్పటికీ... దీనిపై మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పందించారు. పోలీసులు తనను లిక్కర్ కేసులో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారని, గతంలో తనవద్ద పనిచేసిన ఏఆర్ కానిస్టేబుల్ గిరిని బెదిరించి తప్పుడు స్టేట్‌మెంట్ తీసుకున్నారని ఆరోపించారు. గురువారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. "నేను ప్రభుత్వ విప్‌గా ఉన్నప్పుడు గన్‌మ్యాన్‌గా పనిచేసిన కానిస్టేబుల్ గిరిని సిట్ ఆఫీసుకు పిలిచి... ఐదురోజులు విచారణ పేరుతో నరకం చూపించారు. నేను రూ.250నుంచి రూ.500కోట్లు తరలించినట్లు సాక్ష్యం చెప్పాలని కానిస్టేబుల్‌ను వేధించారు. నన్ను అరెస్టు చేయాలనుకుంటే బెటాలియన్లు అక్కర్లేదు. రమ్మంటే నేనే వచ్చి లొంగిపోతా. కోర్టులో నిజానిజాలు బయటకు వస్తాయి" అని చెవిరెడ్డి పేర్కొన్నారు. మద్యం వల్ల తన తమ్ముడు, తండ్రిని కోల్పోయానని... మద్యానికి తాను ఎప్పటికీ దూరమేనని చెప్పారు.

కోస్తా భగభగ

- నరసాపురంలో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఉక్కపోత, వడగాడ్పులతో జనం విలవిల

విశాఖపట్నం, అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత, ఉక్కపోతతో కోస్తా ప్రాంతం ఉడికిపోయింది. విశాఖపట్నం నుంచి నెల్లూరు వరకూ కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఆరు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అనేక ప్రాంతాల్లో వేడి వాతావరణం కొనసాగింది. వడగాడ్పులు వీచాయి. దీంతో జనం అల్లాడిపోయారు. నరసాపురంలో 41.5, బాపట్లలో 40.4, జంగమహేశ్వరపురంలో 40, మచిలీపట్నంలో 39.6, గన్నవరంలో 39.4, నెల్లూరులో 39.3, కావలిలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రతకు ఉత్తరకోస్తాలో పలుచోట్ల క్యుములోనింబస్ మేఘాలు ఆవరించి పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో ఎండ తీవ్రత కొనసాగుతుందని, అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, రాష్ట్రంలో శుక్రవారం భిన్నమైన, అసౌకర్య వాతావరణం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. విజయనగరం, మన్యం, అల్లూరి, ఏలూరు, ఎన్టీఆర్, నంద్యాల జిల్లాల్లో 39-40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదై, ఉక్కపోత పరిస్థితులుంటాయని పేర్కొంది. అల్లూరి జిల్లాలో కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.

టీటీడీకి చీఫ్ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్

- సీనియర్ ఐపీఎస్ సాయిప్రసాద్‌ను నామినేట్ చేసిన ప్రభుత్వం
- విధులు, బాధ్యతలపై ఉత్తర్వుల్లో అస్పష్టత
- ఈ నియామకంపై టీటీడీ వర్గాల్లో అయోమయం

తిరుపతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతి దేవస్థానాలకు చీఫ్ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి జి.సాయిప్రసాద్ నియమితులయ్యారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగానూ ఆయనను సంబంధిత పోస్టుకు నామినేట్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టీటీడీ చరిత్రలో ఈ తరహా అధికారిని నియమించడం ఇది రెండవ సారి. 2010లో ఐపీఎస్ అధికారి జి.సుధీర్‌ని అప్పటి ప్రభుత్వం ఇదే పోస్టుకు నామినేట్ చేసింది. అప్పుడు కూడా అధికారాలు, విధులు, బాధ్యతలు వంటివేవీ నియామక ఉత్తర్వుల్లో ప్రస్తావించలేదు. తాజా ఉత్తర్వుల్లోనూ అదే విధమైన అస్పష్టత నెలకొంది. గతంలో చీఫ్ ఇన్‌స్పెక్టింగ్ అధికారిగా వ్యవహరించిన సుధీర్ ఆ ఏడాదిలో రెండుసార్లు పర్యటించారని తెలిసింది. ఆ రెండు సందర్భాలలో టీటీడీకి చెందిన అన్ని విభాగాల అధికారులతో సమావేశమై టీటీడీలో పాలన ఎలా జరుగుతోంది? కొత్త కార్యక్రమాలను ఎలా అమలు చేస్తున్నారు? అన్న అంశాలపై సమీక్షించి వెళ్లినట్టు సమాచారం. ఆ తర్వాత మళ్లీ అలాంటి అధికారిని నియమించడం ఇప్పుడే. ఈ నియామకంపై టీటీడీ వర్గాల్లో అయోమయం నెలకొంది. ప్రస్తుత టీటీడీ ఈవో, అదనపు ఈవోలకు... సీఎం చంద్రబాబుకు విశ్వాసపాత్రులైన అధికారులుగా పేరుంది. వారిద్దరినీ సీఎం ఏరికోరి టీటీడీలో నియమించారు. అలాంటప్పుడు మళ్లీ చీఫ్ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్ నియామకం ఎందుకు అవసరమైందన్న ప్రశ్న టీటీడీ వర్గాలను వేధిస్తోంది. ఇటీవలి కాలంలో టీటీడీ ఉన్నత స్థాయి అధికార, అనధికారులు సీఎం చంద్రబాబుకు అక్కడి వ్యవహారాలపై వేర్వేరుగా నివేదికలు ఇస్తున్నట్టు దేవస్థానం వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆ నివేదికల్లోని కొన్ని అంశాల్లో పరస్పర విరుద్ధంగా ఉన్నందున సీఎం నిష్పాక్షిక సమాచారం, ఫీడ్ బ్యాక్ కోసం ఈ తరహా నియామకం చేపట్టి వుంటారన్న ప్రచారం జరుగుతోంది. సాయిప్రసాద్ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి అయినప్పటికీ ఆయన సీఎం కార్యాలయంలో పనిచేస్తున్న నేపథ్యంలో ఈ నియామకం జరిగివుంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

విశాఖ జోన్‌పై ముందడుగు

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల. కొత్త జోన్ ఇస్తామని ప్రకటించిన అనేక సంవత్సరాలకు.. 2019లో దానిని మంజూరుచేశారు. కానీ పనులు చేపట్టకుండా తాత్సారం చేశారు. జగన్ ప్రభుత్వం భూములపై దాగుడుమూతలు ఆడింది. చివరకు కూటమి ప్రభుత్వం వచ్చాక భూమి సమస్య పరిష్కారం కావడంతో ఈ ఏడాది జనవరి 8న ప్రధాని మోదీ స్వయంగా విశాఖ వచ్చి రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇది జరిగి ఐదు నెలలు దాటినా జోన్‌కు సంబంధించిన గెజిట్ విడుదల చేయలేదు. కనీసం జీఎంను కూడా నియమించలేదు. ఒడిసాలోని కొత్త డివిజన్ రాయగడకు డీఆర్ఎంను నియమించి.. ఇక్కడ జీఎంను వేయలేదు. దీనిపై రైల్వే మంత్రికి జనవరి నెలాఖరులోనే విశాఖ ఎంపీ శ్రీభరత్ లేఖ రాశారు. ఆపై ఢిల్లీ వెళ్లినప్పుడల్లా గుర్తు చేస్తూ వచ్చారు. ఇప్పుడు జీఎంను నియమించడంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. గెజిట్‌ను కూడా త్వరగా విడుదల చేయాలని కోరామని, నిర్మాణ పనులు కూడా చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు.

ఐదు నెలల తర్వాత..

(మొదటి పేజీ తరువాయి)

ఇంజనీరింగ్ (ఐఆర్ఎస్ఎస్ఈ)లో ఆయన హయ్యర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ (హెచ్ఏజీ) అధికారి. ప్రస్తుతం బోర్డులో సిగ్నల్ మోడ్రనైజేషన్ (పీఈడీ) విభాగంలో ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. కొద్ది రోజుల్లోనే ఆయన ఆ పదవి నుంచి రిలీవ్ అయి.. విశాఖలో దక్షిణ కోస్తా జోన్ నూతన జీఎంగా బాధ్యతలు స్వీకరిస్తారు. జోన్ ఏర్పాటులో జీఎం నియామకం అత్యంత కీలకం. మాథుర్ ఈ బాధ్యతలు చేపట్టగానే.. జోన్ సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను పరిశీలిస్తారు. కొత్త జోన్ పరిపాలనకు యుద్ధ ప్రాతిపదికన తాత్కాలికంగా అందుబాటులో ఉన్న కార్యాలయాలను ఆయన గుర్తించాల్సి ఉంటుంది. రైల్ వికాస్ నిగం లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్)కు చెందిన భవనాలు ఖాళీగా ఉన్నాయని ఇటీవల దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ) ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకరరావు కూడా రైల్వే బోర్డు దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆర్‌వీఎన్ఎల్‌తో పాటు విశాఖ డివిజన్‌లో అందుబాటులో ఉన్న ఇతర భవనాలను మాథుర్ పరిశీలిస్తారు. అలాగే జోన్‌కు సంబంధించి ఆయా విభాగాలకు ఎంత మంది అధికారులు, సిబ్బంది కావాలో సమగ్ర నివేదికను రూపొందించి కేంద్రానికి పంపిస్తారు. ఆయన నివేదిక ఆధారంగా కేంద్రం.. పరిపాలన సాగించే భవనాలను ఖరారు చేయడంతో పాటు వెంటనే పోస్టులను మంజూరు చేస్తూ ఆదేశాలు ఇస్తుంది. దీంతోపాటు అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఇది ఎప్పుడు ఇస్తే అప్పటి నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారికంగా ప్రారంభమవుతుంది. మరోవైపు.. కొత్త జీఎం విశాఖలో ఎప్పుడు బాధ్యతలు చేపట్టాలో విడిగా ఆదేశాలు ఇస్తామని రైల్వే బోర్డు తన ఉత్తర్వులో పేర్కొనడం గమనార్హం.



దక్షిణ కోస్తా రైల్వే జోన్ బిల్డింగ్ నమూనా



నూతన జీఎం సందీప్ మాథుర్

డివిజన్లు ఇలా..

కొత్త జోన్ డీపీఆర్ ప్రకారం విశాఖపట్నం డివిజన్ (రాయగడ మినహా) 410 కిలోమీటర్ల రైల్ నెట్‌వర్క్‌ను కలిగి ఉంటుంది. ఈ డివిజన్ పరిధిలోకి పలాస-విశాఖపట్నం-దువ్వాడ, కునేరు-విజయనగరం, నౌపాడ జంక్షన్-పర్లాకిమిడి, బొబ్బిలి జంక్షన్-సాలూరు, సింహాచలం నార్త్-దువ్వాడ బైపాస్, వడలపూడి-దువ్వాడ, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్-న్యూ జగ్గయ్యపాలెం సెక్షన్లన్నీ వస్తాయి. విశాఖపట్నం కాకుండా విజయవాడ రైల్వే డివిజన్ 1,068.194 కిమీ, గుంటూరు డివిజన్ 632.39 కిమీ, గుంతకల్ డివిజన్ 1,453 కిమీ.. వెరసి నూతన దక్షిణ కోస్తా రైల్వే జోన్ 3,563.584 కిమీ రూట్ లెంగ్త్‌ను కలిగి ఉంటుంది. వీటిలో గుంతకల్ అతి పెద్ద డివిజన్. రెండో స్థానంలో విజయవాడ డివిజన్, మూడో స్థానంలో గుంటూరు, నాలుగో స్థానంలో విశాఖ డివిజన్ ఉంటాయి. విశాఖపట్నం అతి చిన్న డివిజన్‌గా ఉంటుంది. కాగా.. జీఎంగా మాథుర్ నియామకం పై దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకరరావు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, ముఖ్యమంత్రి చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం సకాలంలో జీవో జారీ చేసి జోన్ పరిపాలనను కూడా త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో మరో 11 కొవిడ్ కేసులు

- నెల్లూరులో ఆరు, కర్నూలులో నాలుగు, విశాఖలో ఒకటి

విశాఖపట్నం, కర్నూలు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 11 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. కర్నూలులో గురువారం ఒక్కరోజే నలుగురికి, నెల్లూరు జిల్లాలో ఆరుగురికి కరోనా పాజిటివ్‌గా గురువారం నిర్ధారణ అయింది. విశాఖ కేజీహెచ్‌లో మరో కేసు నమోదయింది. నెల్లూరు జీజీహెచ్‌లో బుధవారం ఆరుగురికి కొవిడ్ పరీక్షలు నిర్వహించారు. వారిలో గురువారం నలుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడులో 25 ఏళ్ల మహిళకు, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం ఏ.తిమ్మాపురం గ్రామానికి చెందిన 49 ఏళ్ల వ్యక్తికి, గోనెగండ్ల మండలం లింగందిన్నెకు చెందిన 45 ఏళ్ల వ్యక్తికి, కర్నూలు నగరానికి చెందిన 20 ఏళ్ల యువతికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వారిని కర్నూలు జీజీహెచ్‌లోని వీవీపీ నెగిటివ్ ప్రెజర్ రూంకు తరలించారు. కర్నూలు జీజీహెచ్‌లో కొవిడ్ పాజిటివ్‌ల సంఖ్య ఆరుకు చేరింది. కొవిడ్ కేసులు పెరుగుతుండడంతో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ డి.శ్రీరాములు తన చాంబరులో కొవిడ్‌పై అత్యవసర సమీక్ష నిర్వహించారు. కాగా, విశాఖలో మరో కొవిడ్ కేసు నమోదైంది. బ్రెయిన్ ట్యూమర్‌తో కేజీహెచ్ న్యూరో సర్జరీ విభాగంలో చేరిన విజయనగరం జిల్లాకు చెందిన పద్నాలుగేళ్ల బాలికకు కరోనా సోకినట్టు నిర్ధారణ అయింది. గడిచిన నాలుగు రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక జ్వరం, జలుబు వంటి లక్షణాలతో బాధపడుతుండడంతో వైద్యులు ర్యాపిడ్ పరీక్ష నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. దీంతో సదరు బాలికను ఐసోలేషన్ వార్డుకు తరలించి ఆర్‌టీపీసీఆర్ పరీక్ష చేయించారు. ఫలితం రావాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద వెల్లడించారు.

18న ఈఎన్‌సీ కార్యాలయం వద్ద ధర్నా

- ఆ లోపు సమస్యలు పరిష్కరించాలి
- పీఆర్ డిప్లమో ఇంజనీర్ల అసోసియేషన్ నోటీసు

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలను ఈ నెల 18వ తేదీ లోపు పరిష్కరించేందుకు చొరవ చూపకుంటే, 18న ఈఎన్‌సీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల అసోసియేషన్ హెచ్చరించింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రవీంద్ర, ప్రధాన కార్యదర్శి కేసీహెచ్ మహంతి గురువారం పంచాయతీరాజ్ ఇంజనీర్-ఇన్-చీఫ్ బాలూనాయక్‌ను కలిసి నోటీసు అందజేశారు. ఇటీవల జరిగిన బదిలీ కౌన్సెలింగ్‌లో డిప్లమో ఇంజనీర్లకు అన్యాయం జరిగిందని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న 74 మంది సైట్ ఇంజనీర్లను రెగ్యులర్ చేసేందుకు సిఫారసు చేయడంలో పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆక్షేపించారు. ఆయా శాఖల అధిపతులకు డిపార్ట్‌మెంట్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని మే 30 లోపు నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ నిర్వహించలేదని తెలిపారు.

నేటి నుంచే మెగా డీఎస్సీ

- 30 వరకు రోజూ 2 సెషన్లలో పరీక్షలు
- పోస్టులు 16,347... దరఖాస్తులు 5,77,675
- గంటన్నర ముందే కేంద్రాల్లోకి అనుమతి
- హాల్ టికెట్, ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరి
- పెన్నులకు అనుమతి.. పేపర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం

అమరావతి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా మెగా డీఎస్సీ-2025 పరీక్షలు శుక్రవారం ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్షలకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లూ చేసింది. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. పీజీటీ, ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు మూడు గంటలు, మిగిలిన పోస్టులకు రెండున్నర గంటల సమయం కేటాయించారు. పీజీటీ, ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు టెట్ ఉండదు కనుక వంద మార్కులకు పరీక్షలు నిర్వహిస్తారు. 200 ప్రశ్నలుంటాయి. మిగిలిన స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, టీజీటీ పోస్టులకు 80 మార్కులకు, 160 ప్రశ్నలతో పరీక్షలు ఉంటాయి. వీరికి టెట్ మార్కుల వెయిటేజీ ఉంటుంది. డీఎస్సీ పరీక్షల్లో మైనస్ మార్కులు ఉండవు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12గంటల వరకు, 9.30 నుంచి 12గంటల వరకు... మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు, 2.30 నుంచి 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం పరీక్షకు 9గంటలు, మధ్యాహ్నం పరీక్షకు 2గంటల కల్లా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అధికారులు చెబుతున్నారు. 90 నిమిషాల ముందే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఎలక్ట్రానిక్ వస్తువులతో సహా అభ్యర్థులు ఎలాంటి వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లకూడదు. పెన్నులను మాత్రమే అనుమతిస్తారు. రఫ్ వర్క్ కోసం పేపర్లు లాంటివి తీసుకురావద్దని, అడిషనల్ షీట్లు తామే అందజేస్తామని అధికారులు స్పష్టంచేశారు. హాల్ టికెట్‌తో పాటు ఫొటో గుర్తింపు కార్డు కచ్చితంగా ఉండాలి. రోజుకు రెండు సెషన్లలో కలిపి గరిష్ఠంగా 40వేల మంది పరీక్షలు రాసే అవకాశం ఉంది.

154 పరీక్షా కేంద్రాలు: కన్వీనర్

మెగా డీఎస్సీకి 154 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వాటిలో 137 రాష్ట్రంలో, 17 బయటి రాష్ట్రాల్లో ఉన్నాయన్నారు. 16,347 పోస్టులకు 3,36,305 మంది అభ్యర్థులు... 5,77,675 దరఖాస్తులు చేసుకున్నారన్నారు. 87.8శాతం మంది అభ్యర్థులకు తొలి ఆప్షన్ పెట్టుకున్న జిల్లాలోనే పరీక్షా కేంద్రాలు కేటాయించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ టీవీ నిఘా పర్యవేక్షణ ఉంటుందని, అభ్యర్థులు బయోమెట్రిక్ ధ్రువీకరణ చేసుకోవాలని పేర్కొన్నారు. హాల్ టికెట్, ఫొటో గుర్తింపు కార్డు లేకపోతే పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

45 రోజులు వాయిదా వేయాలి: షర్మిల

డీఎస్సీ నిర్వహణలో అభ్యర్థుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని, పరీక్షకు సన్నద్ధం కావడానికి తగినంత సమయం ఇవ్వాలని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. 45 రోజుల్లో సిలబస్ మొత్తాన్ని చదవలేమన్న అభ్యర్థుల వినతి మేరకు మరో 45 రోజుల పాటు పరీక్షను వాయిదా వేయాలని మంత్రి లోకేశ్‌ను కోరారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు, పరీక్షకు మధ్య 45 రోజుల వ్యవధి చాలదని, కనీసం 90 రోజులైనా ఉండాలని కోరితే డీఎస్సీని వాయిదా వేయించాలన్న కుట్రగా లోకేశ్ పేర్కొనడాన్ని ఆమె తప్పుబట్టారు. గడువు పెంచాలని మొరపెట్టుకున్నా కనికరించరా అని అన్నారు. తమకు మరింత గడువు ఇవ్వాలంటున్న అభ్యర్థుల మొర ఆలకించకపోవడం కూటమి నియంత పోకడలకు నిదర్శనమని షర్మిల వ్యాఖ్యానించారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*